# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

జూలై 2023

వెల: రూ. 25/-





# శ్రీవేంకటేశం
ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి: 16 సంచిక: 7



సలహాదారులు, స్ఫూర్తిదాత, కర్త, కర్మ, క్రియ మా ప్రభు తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు

ప్రధాన సంపాదకులు:
పుల్లగూర్ల సాయిరెడ్డి
(గోవిందదాసు)
గౌరవ సంపాదకులు:
డా॥ పులిగడ్డ విజయలక్ష్మి
ఫొటోగ్రాఫర్:
పత్తి సుబ్రమణ్యం, శ్రీనివాస మంగాపురం
డి.టి.పి: సాయినాథ్
డిజైన్: రమేష్



**Email:** srivenkatesham@gmail.com
namo_venkateshaya@yahoo.com
**Website:** www.srivenkatesham.org
**E-Magazine:** www.readwhere.com
Phone: **040–27175050**
Cell: **9348212354**


## లోపలి పేజీల్లో


| | |
|---|---|
| శ్రీ వేంకటేశ్వర స్తుతి | 4 |
| ముక్తిమార్గం | 5 |
| అనంతపుణ్యప్రదం–చాతుర్మాస్యమ్ | 6 |
| తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశ... | 9 |
| మహాభారతంలోని మహోపాఖ్యానాలు | 19 |
| రామాయణ రత్నాకరం | 25 |
| ఒక అక్షరము మూడు ఉపదేశములు | 30 |
| గురుపూర్ణిమ | 32 |
| శ్రీ వేంకటాచల మాహాత్మ్యం | 34 |
| ముకుందమాల | 41 |
| తిరుమల సర్వస్వం | 46 |
| శ్రీమాన్ అనంతాళ్వాన్ల దివ్య చరితము | 51 |
| తాదళన్ కోవెల | 54 |
| అక్రూరుడు ధృతరాష్ట్రునికి హితోపదేశం చేయుట | 56 |
| సన్యాసులు అవధూతలు | 58 |
| మన మహర్షులు | 59 |
| రాధాకృష్ణుల గురించి అద్భుత రహస్య ఆలయం | 62 |
| రాశి ఫలితములు | 65 |
| మీ విజ్ఞానం | 66 |




# భక్తి ప్రదానం

ఈ కలియుగంలో మానవుడు తరించాలంటే తిరుమల శ్రీ వేంకటేశ్వరుని నామ స్మరణ ఒక్కటే ఏకైక మార్గము. ఇదే పరమౌషధమని పెద్దలంటారు. మనిషి భగవంతున్ని కేవలం నామం జపిస్తే సరిపోదు, మన అంతరంగములో సదా మనం ఆయన వారిమనే జ్ఞానం కలిగి, ఆయన మన పాలకుడనే భావంతో జీవించువారు ధన్యులు. ఈ కలియుగంలో చాలామంది శాస్త్ర పరిజ్ఞానము తెలియని వారే ఉన్నారు. ఎలాంటి గురూపదేశాలు పొందనివారే ఉన్నారు. భగవంతున్ని పొందుటకు 'భక్తి' అనువైన సాధనము. భగవంతుడు భక్తికి సులభంగా వశుడైతాడు. భక్తి అంటే భగవంతుని పట్ల ప్రేమ, అనురక్తి. భగవంతుడు మనవాడని, మనము ఆయన వారిమనే అచంచల విశ్వాసం కలిగి యుండాలి. సదా ఆయన పాదాలను వీక్షించుచు, ఆయన నామస్మరణ చేయుచు ఉంటే 'భక్తి' దృఢపడుతుంది. ఒక్కసారి మనలో భక్తి దృఢపడితే మనము చేసే ప్రతి పని అనుకోకుండా శాస్త్ర ప్రకారమే జరుగుతుంది. నమ్మినవారితో భగవంతుడు ఏ తప్పు చేయించడు. భక్తి పరాకాష్ట చెంది వాడు చేసే ప్రతి పనిని భగవంతుడు స్వయంగా స్వీకరిస్తాడు.

భక్త కన్నప్ప ఒక అత్యంత సాధారణ చెంచు జాతి వ్యక్తి. ఎలాంటి గురువుగాని, శాస్త్ర పరిజ్ఞానముగాని లేనివాడు. కాని ఆయనలో భక్తి నిండి ఉన్నది. భగవంతుని కష్టాన్ని తన కష్టంగా భావించాడు. తన సర్వశ్వం ఆయనకు ధారపోశాడు. తన కష్టాన్ని లెక్క చేయలేదు. భక్తి భావంలో తన్మయత్వం పొందాడు. భగవంతున్నే కోరుకున్నాడు. కాబట్టి భగవంతుడు ఆయన్ను మెచ్చాడు. కన్నప్ప ఎంగిలి నీటితో అభిషేకించాడు. కాలుతో గుర్తుపెట్టి తన కంటిని సమర్పించాడు. మాంసాన్ని నైవేద్యంగా సమర్పించాడు. అయినప్పటికి పరమ శివుడు ఆయనను ఎంతో అభినందించి దివ్యదర్శన భాగ్యాన్ని ప్రసాదించాడు. ఇలా భక్తి పారవశ్యము చెందినప్పుడు ప్రతి వ్యక్తి చేసే ప్రతి పనిని భగవంతుడు స్వయంగా స్వీకరిస్తాడు. మనలోని లోపాలను చూడడు. మరొక ఉదాహరణ.. శబరి. ఈమె కూడా ఏమి తెలియని వ్యక్తి. కాని శ్రీరామునిపై అచంచల భక్తి విశ్వాసాన్ని పెంపొందించుకుంది. శ్రీరాముని సుఖమే తన సుఖంగా భావించింది. ఒగరు పండ్లు తింటే కష్టం కలుగుతుందని భావించింది. ప్రతి పండును కొరికి అవి తీయన పండ్లని నిర్ధారించుకున్న తరువాతనే శ్రీరాముని కొరకు తీసిపెట్టేది. కాని ఆమె ఎంగిలి పండ్లను తీసిపెడుతున్నట్లు భావించలేదు. అసలు ఆ విషయం ఆమెకు గుర్తురాలేదు. కాబట్టి ఆ స్థితిలో ఆమె ఏది చేసినా భగవంతుడు అత్యంత ప్రీతిగా స్వీకరిస్తాడు. భగవంతునికి భక్తుని యొక్క హృదయాంతరంగా భావమే ప్రదానము. ఆ భావానికే వశుడైపోతాడు. ఆ భావం సాధించుటకే ఈ శాస్త్రాలు, పురాణాలు, గురువులు అని గ్రహించాలి. ప్రతి వ్యక్తి భగవంతుని పట్ల అచంచల భక్తిభావం సాధించుటకు ప్రయత్నించాలి. 'సాధనముగా పనులు సమకూరుధరలోన' అన్నట్లు సాధన చేయగా ప్రతిది సాధ్యమే. భగవంతునివైపు ఒక్క అడుగు భక్తితో వేస్తే ఆయన మూడు అడుగులు మన వైపు వేస్తాడు. మనవాడైతాడు. ఇది సత్యం!

నమో వేంకటేశాయ
వినా వేంకటేశం న నాథో న నాథః ।
సదా వేంకటేశం స్మరామి స్మరామి ।।

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు
(signature)
పుల్లగూర్ల సాయిరెడ్డి (గోవిందదాసు)


Editor, Publisher, Printer and owned by **Pullagurla Sai Reddy**. Published at: H.No.1-1-53, Street No:1, Habsiguda, Hyderabad-500007. Printed at: Sai Tirumala Printers, H.No:1-8-556/2, Chikkadpally, Hyderabad-500020. Editor: Pullagurla Saireddy: Cell : **93482 12354**, Ph:040-27175050; E.mails: **srivenkatesham@gmail.com**, namo_venkateshaya@yahoo.com

## చందా వివరాలు
(రూ.లలో)

| | |
|---|---|
| ☐ 1 సం॥ | 250-00 |
| ☐ 2 సం॥ | 500-00 |
| ☐ 4 సం॥ | 1,000-00 |
| ☐ జీవిత చందా | 3,000-00 |
| ☐ పోషకులు | 5,116-00 |
| ☐ రాజపోషకులు | 10,116-00 |

**9348212354**

నంబర్‌కు పేటీఎం / ఫోన్‌పే / గూగుల్ పే ద్వారా జమచేసి మీ చిరునామాతోపాటు మాకు తెలపండి.

లేదా

శ్రీ వేంకటేశం పేరుపైన ఎం.ఓ / డి.డి. / క్రాస్డ్ చెక్‌ను

లేదా

**Srivenkatesham**

A/c no. S.B. 11002191002593
(Ifsc Code: PUNB0110010)
Punjab National Bank,
Habsiguda, Hyderabadలో
చేరునట్లు ఏదేని పీఎస్బీ కాని, ఆన్‌లైన్ ద్వారా కాని చెల్లించి మాకు తెలియజేయండి.


పూర్తి పేరు:____________________
____________________
చిరునామా:____________________
____________________
____________________
____________________
____________________
పిన్‌కోడ్:____________________
చందా వివరాలు:____________________



మా చిరునామా:
శ్రీ వేంకటేశం, ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,
హబ్సిగూడ, హైదరాబాద్-500 007.
ఫోన్: 040-27175050
సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com



చందాదారులకు
స్వామివారి పవిత్ర పాదాలు
(10"x8") **ఉచితం**

# శ్రీ వేంకటేశ్వర స్తుతి

## బౌళి

దేహి నిత్యుఁడు – దేహము అనిత్యాలు
ఈహల నామనసా – యిది మరవకుమీ ॥ పల్లవి ॥

1. గుదిఁ బాఁత చీర మాని – కొత్తచీర గట్టినట్టు
ముదిమేను మాని దేహి – మొగిఁ గొత్తమేను మోచు
అదన జంపగలేవు – ఆయుధము లితని
గదిసి యగ్నియు నీరు – గాలియు జంపఁ గలేవు ॥ దేహి ॥

2. ఈతఁడు నరకువడఁ – డీతఁ డగ్నిఁగాలఁడు
ఈతఁడు నీట మునుఁగఁ – డీతడు గాలిఁబోడు
చేతనుడై సర్వగతుండౌ – చెలియించ దేమిటను
ఈతల ననాది యీతఁ – డిరవు గదలఁడు ॥ దేహి ॥

3. చేరి కానరానివాఁడు – చింతించరానివాఁడు
భారపు వికారాలఁ – బాసినవాఁ డీయాత్మ
ఆరయ శ్రీవేంకటేశు – నాధీన మీతఁడని
సారము దెలియుటే – సత్యం జ్ఞానము ॥ దేహి ॥

భావము : ఆత్మ శాశ్వతము. శరీరములు శాశ్వతములు గావు. పలు కోరికలతో గూడిన ఓ నా చిత్తమా! ఈ సత్యమును విస్మరింపకుము.

మానవుడు ప్రాత వస్త్రమును వదలి క్రొత్త వస్త్రమును ధరించినట్లు ఆత్మ ముదిసిన శరీరమును వీడి క్రొత్త శరీరమును గైకొనును. ఆయుధములీ యాత్మను చంపలేవు. నిప్పు, నీరు, గాలియు పైకొని దీనిని చంపజాలవు.

ఈ యాత్మ శస్త్రములచే ఛేదింపబడదు. ఇది నిప్పుచే కాలదు. ఇది నీట మునుగదు (నానదు). ఇది గాలికి ఆరిపోదు. ఇది చేతనము. సర్వత్ర వ్యాపించి యున్నది. దేనిచేతను చలించునది కాదు. ఇది సనాతనమైనది. ఉన్నచోటు విడువనిది. ఈ యాత్మ ఇంద్రియములకు గోచరము గాదు. మనస్సుచే భావించుటకు వీలు గానిది. షడ్భావ వికారములకు లోను గానిది. పరికింపగా ఇది శ్రీవేంకటేశ్వరుని కధీనమై యున్నదన్న సారార్థమును గ్రహించుటే నిజమైన తెలివి.

**వ్యాఖ్యానం: డా॥ సముద్రాల లక్ష్మణయ్య**

# ముక్తిమార్గము



## దేసాళం

అనంత మహిముఁడవు – అనంతశక్తివి నీవు
ఎనలేని దైవమా! ని – న్నేమని నుతింతును? || పల్లవి ||

1. అన్ని లోకములు నీ – యందునున్నవందురు నీ
వున్న లోకమిట్టిదని – వూహించరాదు,
ఎన్ననీవు రక్షకుఁడ – విందరిపాలిటికి
నిన్ను రక్షించేటివారి – నే నెవ్వరి నందును || అనం ||

2. తల్లివి దండ్రివి నీవు – తగు బ్రహ్మాదులకు
ఎల్లగా నీ తల్లితండ్రు – లెవ్వరందును,
ఇల్లిదె వరములు నీ – విత్తు విందరికిని
చెల్లఁబో నీ కొకదాత – చెప్పఁగ జోటేది || ఆనం ||

3. జీవుల కేలికవు – శ్రీవేంకటేశుఁడవు నీ
వేవలఁ జూచిన నీకే – యేలికె లేఁడు,
వేవేలు మునులును – వెదికేరు నిన్నును
నీ వెవ్వరి వెదకేవు – నిర్మలమూరితివి || ఆనం ||





భావము : ఓ
సాటిలేని దైవమా!
నీవు ఇంతింతలని
చెప్పుట కలవి గాని
తుదిలేని మహిమలు
కలవాడవు. నీ శక్తి
సామర్థ్యములకు మేరయే
లేదు. మనోవాక్కుల
కగోచరుడవైన ఇట్టి నిన్ను
నేనేమని పొగడుదును?
నీవే ఈ బరువైన
సంసారమును నాకు
అక్కరతో మెడగట్టితివి.
దానిని నేను భరించవలెనే
గాని శ్రమ యని
విసుగుకొనుట
అపరాధమగును కదా!
అన్ని దిక్కుల వ్యాపించి
అంతట నిండియున్న
ఓ వేంకటాద్రీశ్వరా!
నీవిచ్చనిదేదో
నేను పుచ్చుకొని
అనుభవించవలెను
గాని అణుస్వరూపుడనై
ఎక్కడో ఒక మూలనున్న
జీవుడనైన నేను నీ
కెదురాడుట న్యాయమా?

భావానువాదం:
**శ్రీమాన్ సముద్రాల లక్ష్మణయ్య**



# అనంతపుణ్యప్రదం చాతుర్మాస్యమ్

– చింతలపాటి
శివశంకర శాస్త్రి

**శ్లో ॥ "ఆచారః పరమోధర్మః ఆచారః పరమంతపః**
**ఆచారాత్ వర్ధతే హ్యాయుః ఆచారాత్పాప సంక్షయః"**

ఆచారమే పరమధర్మం. ఆచారమే గొప్పదనం. ఆచారం వలననే ఆయువు వృద్ధి, పాపక్షయం కలుగుతాయి.

భారతదేశం ధర్మప్రధానమైన దేశం. కనుక ఇక్కడ ధార్మిక పరమైన కర్మలకు ప్రాధాన్యత ఇవ్వబడింది. భగవంతుని అవతారాలు, దేవీదేవతల మహత్తులు, ఋషుల, మునుల వ్రత మహోత్సవాలకు గొప్ప విలువ ఇవ్వబడింది. వ్రతధారులు క్రోధము,లోభము, మోహము మొదలగునవి ఎల్లవేళలా పరిత్యజించవలెనని గరుడ పురాణములో చెప్పబడింది.

**శ్లో ॥ "క్షమా సత్యం దయా దానం శౌచ మింద్రియ నిగ్రహం**
**దేవ పూజాగ్ని హవనం సంతోషస్తేజ వర్జనమ్"**

అనగా వ్రతాచరణ సమయమున క్షమ, దయ, దాన, శౌచ, ఇంద్రియ నిగ్రహం, దైవపూజ, అగ్నిహోత్రం మున్నగునవి ఆచరించినప్పుడే పుణ్యప్రాప్తి కలుగుతుంది. ఆధ్యాత్మిక మార్గం వైపు అడుగులు వేయటానికి వ్రతాలు సహాయపడతాయి.

భారతీయ ధర్మానికి, ఆచారానికి ఆత్మబలం ఎక్కువ. పరిపూర్ణ మానవీయతతో నిండి అలరారుతోంది. ''ధర్మోరక్షతి రక్షితః''. ధర్మాన్ని రక్షిస్తే, ఆ ధర్మం మనల్ని రక్షిస్తుందనే విశ్వాసాన్ని విశ్వసించే సమాజం భారతీయ సమాజం. ధర్మం అంటే ధరించేది. ఆచారం అంటే ఆచరించేది. ధర్మానికి ధైర్యం ఎక్కువ. ఆచారానికి ఆత్మబలం ఎక్కువ. ధర్మగ్లానిని ధరణి భరించలేదు. ఆచారహీనతను ఆర్యులు అనగా జ్ఞానులైన మాన్యులు సహించలేరు. ''సదాచారం ధర్మమూలమ్'' సదాచారమే ధర్మానికి మూలమని పండితుల నిశ్చితాభిప్రాయం. ఆచరణలో ఆత్మబలాన్ని, ఆధ్యాత్మిక

ఫలాన్ని, సమయోగ జీవన సాఫల్యాన్ని సాధించే సదాచారమే ధర్మము. ఆచారమే గొప్పదనం. ఆచారమే పరమ ధర్మం. ఆచారము వలననే ఆయువు వృద్ధి, పాపక్షయం కలుగుతాయి.

భారతీయులకున్న ధార్మిక వ్యవస్థ చాలా బలమైంది. బ్రహ్మచర్యం, గార్హస్థ్యం, వానప్రస్థం, సన్యాసం అంటూ చతుర్విధ ఆశ్రమాలు, అందు పాటించవలసిన సదాచార సంపత్తిని చక్కగా వివరించారు.

జ్యోతిశ్శాస్త్ర ప్రకారం చంద్రుడు ప్రతినెలలో పౌర్ణమినాడు ఒక్కో నక్షత్రంతో కూడి ఉదయిస్తాడు. చంద్రుడు ఏ నక్షత్రంతో కలిసి ఉదయిస్తే, ఆ నక్షత్రం పేరుతోనే ఆ మాసం ఏర్పడుతుంది. ఆషాఢ నక్షత్రంతో కూడిన పూర్ణిమ కలది కావున ఈ మాసం ఆషాఢ మాసం. ఆషాఢమాసం ఆధ్యాత్మికంగా ఒక ప్రత్యేకతను కలిగి ఉన్నది. సనాతన సంస్కృతిలో ముఖ్యమైన పండుగలకు ఈ నెల పెట్టింది పేరు. తొలి ఏకాదశి, చాతుర్మాస్య దీక్ష, వ్యాసపూర్ణిమ (లేదా) గురుపూర్ణిమ, దక్షియానము మున్నగు ఆధ్యాత్మిక విశేషములతో విశిష్టతని సంతరించుకున్న మాసం ఆషాఢమాసం. గ్రీష్మ ఋతువులో తొలకరి జల్లులకు ఈ మాసం నాంది పలుకుతుంది.

మన హిందూ సంస్కృతిలో ''ఏకాదశితిథి'' ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఈ తిథి శివకేశవులకు మరింత ప్రీతిపాత్రమైంది. ఇట్టి పుణ్యప్రదమైన ఏకాదశుల సమ్మేళనంతో నాలుగు మాసములపాటు నిరంతరాయంగా ఆచరించే దీక్షావ్రతమే ''చాతుర్మాస్య దీక్ష''. ఆషాఢమాస శుక్ల పక్షైకాదశి నుండి కార్తీమమాస శుక్లైకాదశి వరకు ఉండే నాలుగు నెలల కాలాన్ని చాతుర్మాస్య కాలం అంటారు. దీనినే 'హరకాలం' అనే మరొక నామంతో ఋషులు పిలుస్తుంటారు. ఈ కాలం ఉపాసనా పరులకు, మంత్రసాధనా పరులకు, మహర్షులకు పరమ పవిత్రమైన కాలం. పూర్వం మహర్షులు ఈ నాలుగు నెలల కాలం ప్రయాణాలు మాని, ఏదో ఒక దివ్యక్షేత్రంలో నియమ నిష్ఠలతో భగవదారాధన, పురాణేతిహాస గోష్ఠులతో పవిత్రంగా కాలం గడిపేవారు.

ఆషాఢ మాసంలో శుక్లపక్షపు ఏకాదశి నాడు క్షీరసాగరంలో మహావిష్ణువు నిద్రకుపక్రమిస్తాడు. నాలుగు నెలల పాటు శేషశయనుడై, కార్తీక శుక్ల ద్వాదశి నాడు నిద్రనుండి లేస్తాడు. శ్రీమహావిష్ణువు నిద్రకుపక్రమించే తిథిని ''శయనైకాదశి'' అని, నిద్ర లేచే తిథిని ''ఉత్థాన ద్వాదశి'' అని వ్యవహరిస్తారు. స్వామి నిద్రించే ఈ కాలం సాధనకు మాత్రమే ఉపయుక్తం అంటాడు నారదుడు. లోక శ్రేయస్సు కోసం జగన్నాటక సూత్రధారి నిద్ర అనే నాటకంలో ఉన్న స్వామి హృదయంలో ప్రవేశించి, ఆయన అనుగ్రహానికి మనం పాత్రులమై తరించడానికి భక్తులకు చాతుర్మాస్య నియమం ఏర్పాటు చేసిన వాడు సాక్షాత్తూ బ్రహ్మదేవుడే అని బ్రహ్మాండ పురాణం చెబుతున్నది. చాతుర్మాస్య కాలంలో భాగవత గాథలు వింటే సామాన్యుడు కూడా మహోన్నత స్థానం పొందగలుగుతాడు. నరుడిని హరి కృపకు పాత్రుని చేసే దివ్య యౌగిక కాలం చాతుర్మాస్యం అంటున్నది సౌర పురాణం. వర్ష శరదృతువులు కుండలినీ శక్తిని ప్రచోదనం చేసి, అమృతవర్ష ధారలతో సాధకుడిని మనీషిగా మార్చే దివ్య ఋతువులని ''కాళికోప పురాణం'' చాటుతున్నది. నాలుగు నెలలు అత్యంత పవిత్రమైన దినాలే అయినా, చాతుర్మాస్య కాలంలో వచ్చే ఏకాదశులు మరింత పవిత్రమైనవని నారద పురాణం చాటుతోంది.

ఆషాఢమాసంలో శుక్లైకాదశిని శయనైకాదశి అంటారని పూర్వం తెలుసుకున్నాము. ఈ ఏకాదశి నుండి చాతుర్మాస్య దీక్షారంభం చేయాలి. కనుక ఈ రోజు ప్రాతః కాలముననే లేచి కాలకృత్యములు తీర్చుకొని అభ్యంగనస్నానమాచరించి పూజగదిని గోమయంతో అలికి శుభ్రం చేసి మంటపంలో విష్ణుప్రతిమను ఉంచి, మంటపారాధన చేసి షోడశోపచారాలతో పూజించి, హారతి ఇవ్వాలి. ఈరోజు ఉపవాసం ఉండి విష్ణు సహస్ర పారాయణ గావించాలి. ఆపై శ్రీహరిని

**"సుప్తే త్వయి జగన్నాథ! జగత్సుప్తం భవేదిదమ్**
**విబుద్ధే త్వయి బద్ధంచ జగత్సర్వం చరాచరమ్"**

''ఓ జగన్నాథా! శ్రీహరీ! నీవు నిద్రిస్తే లోకాలన్నీ నిద్రిస్తాయి. మేల్కొంటే జగత్తంతా మేల్కొంటుంది అనే అర్థం వచ్చే శ్లోకాన్ని పఠించి

**"ఇతి సంప్రార్థ్య దేవాగ్రే చాతుర్మాస్య ప్రచోదితాన్**
**నియహంస్తు యథాశక్తి గృహ్ణీయాద్ భక్తి మాన్నరః"**

అని ప్రార్థన చేసి చాతుర్మాస్య దీక్ష నియమాలను స్వీకరించి వ్రతారంభం చేయాలి. ఆషాఢ శుద్ధ ఏకాదశి నుండి కార్తీక శుద్ధ ద్వాదశి వరకు గల ఈ నాలుగు మాసాలు వర్షాకాలం. వర్షాలు కురుస్తూ ఉంటాయి. వర్షాకాలంలో తరచుగా రహదారులలో క్రిమికీటకాదులు సంచరిస్తుంటాయి. కాలి క్రిందకు అవి వస్తే నశించిపోతాయి. అందువలన సంచారం గావిస్తూ ధర్మప్రచారం చేయు యతులు తమకు అనువైన ప్రాంతాన్ని ఎంచుకొని చాతుర్మాస్య వ్రతాన్ని ఆరంభిస్తారు. సదాచార సంపన్నులు, భగవంతుని పట్ల భక్తి



కలిగి యుండి మెలగువారి గృహము లందు చాతుర్మాస్య వ్రతాన్ని ఆచరించాలన్న అభిలాష ఉన్న యతులు గృహస్థుని ప్రార్థించి భూత హితము కోరి నాలుగు మాసములు మీ గృహమునందు నివసించెదమని తెలుపగా గృహస్థులు అంగీకారాన్ని తెలుపుతూ "తాము సుఖంగా మా గృహము నందు ఉండవచ్చును. మీ రాక మాకు శుభకరము. మీ రాక వలన మేము కృతార్థుల మవుతాము. త్రికరణశుద్ధిగా యథాశక్తి మీకు శుశ్రూష చేసెదమని మాకెటువంటి అభ్యంతరము లేదని పలుకుతూ వారిని సాదరపూర్వకంగా ఆహ్వానిస్తారు. అప్పటినుండి ఆ గృహస్థుని ఇంట చాతుర్మాస్య వ్రతాన్ని ప్రారంభించి కొనసాగిస్తారు. శయన ఏకాదశి నుండి కార్తీక శుద్ధ ఏకాదశి వరకు నాలుగు నెలలు దేవతలకు రాత్రి సమయము. ఈకాలంలో చేసే పుణ్యాలవల్ల వ్రతాలవల్ల బ్రహ్మహత్యాది దోషాలు, పాపాలు నశిస్తాయి. అశ్వమేధయాగ ఫలం లభిస్తుంది.

చాతుర్మాస్యం నాలుగు నెలలు యతులు, సన్యాసులకు ప్రత్యేకమైనది. ఈ సమయాన్ని వారు ఎంతో కఠినమైన నియమ నిష్ఠలతో గడపాలి. వ్రతాన్ని ప్రారంభించక ముందే క్షౌరాదికాన్ని ఆచరించి, మృత్తికా స్నానాలు చేస్తూ వ్యాసుని పూజించాలి. అనంతరం శ్రీకృష్ణుని పూజించాలి. అనంతరం "అనతి ప్రతిబంధకే చతురో మాసాని హవసామి" అని సంకల్పం తీసుకోవాలి. నాలుగు మాసములందు భగవంతుని ప్రబోధము వరకు శ్రావణ మాసములో శాకమును, భాద్రపదమాసములో పెరుగును, ఆశ్వయుజ మాసములో పాలను, కార్తీకమాసములో పెసలు మొదలైన పప్పులను విడువవలెను. ఈ మాసములలో చెప్పులు, గొడుగులను ధరించకూడదు. లోహపాత్రలోని నీటిని త్రాగరాదు. ఉసిరికాయ, జామపండు, నివేదించని అన్నమును, మాంసము, బొబ్బర్లు, వంకాయ, పుచ్చకాయ, ముల్లంగి, గుమ్మడికాయ, రేగుపండ్లు, చింతపండు, మినుములు, ఉలవలు, తెల్ల ఆవాలు, పొట్లకాయ, బెల్లము తినకూడదు. మంచముపై నిదురించరాదు. ప్రతిరోజు అరుణోదయవేళ శీతల స్నానము చేయాలి. బ్రహ్మచర్యం పాటించాలి. ఒంటిపూట భోజనం చేయాలి. అహింస పాటించాలి. మంత్రానుష్ఠానం చేయాలి. ఈ సమయంలో (చాతుర్మాస్యకాలం) దానాలు, పుణ్యకార్యాలు నిర్వహించాలి. ఈ నాలుగు నెలల కాలంలో బెల్లాన్ని వదిలితే మధురంగా మాట్లాడటం వస్తుంది. నూనెలను వదిలితే దీర్ఘాయువు, అందము, శత్రురహితము కొరకు చేదు పదార్థములను విడిచిపెట్టాలి. నేతిని విడిచిపెడితే సౌందర్యవంతమైన శరీరం వస్తుంది. యోగాభ్యాసము చేయువాడు బ్రహ్మపదమును, తాంబూల విసర్జనము వలన మహాభోగి యగును. అపక్వములను తినుట వలన నిర్మల మనస్కుడు, భూశయనము వలన మునిశ్రేష్ఠుడు అగును. మౌనవ్రతాన్ని పాటిస్తే సర్వాధికారాలు దేవాలయాన్ని శుభ్రం చేసిన వైకుంఠప్రాప్తి, తులసిపూజ చేసిన విష్ణులోక ప్రాప్తి కలుగుతాయి. విష్ణు సంబంధమైన సహస్ర నామములను చదువుతూ, విష్ణుమూర్తికి ప్రదక్షిణలు చేసినవాడు విష్ణు లోకమునకు వెళ్ళును. యాచన చేయనివాడు ధర్మాత్ముడుగాను, ఆకులందు భోజనము చేసినవాడు కురుక్షేత్రానికి వెళ్ళిన ఫలము కలుగుతుంది. శొంఠి, పసుపు, జీలకర్ర, వరుగులు మున్నగువాటిని వాడరాదు. ఈవిధంగా నాలుగు మాసములలో చేయు వ్రత సంకల్పము చేసి ఆచరించువారికి విశేషమైన, అనంతమైన ఫలము కలుగును.

అనంత పుణ్యప్రదమైన చాతుర్మాస్య వ్రతమును భగవంతుడు యతులకే కాక గృహస్థులకు ఇచ్చిన మహదవకాశం. ఈ అవకాశమును అందిపుచ్చుకుని యతుల జాడలలో నడిచి సనాతన హిందూ ధర్మమును ఆచరించి తరిద్దాము. మహనీయులు చూపిన బాటలో నడవడం, విలువలను పాటించడం మన విధి. కావున వారి బాటలో నడిచి, విలువలను పాటించి మన జన్మలను చరితార్థము గావించుకుందాం.

**మహనీయుల బాట బంగారు బాట**

**సర్వేజనాః సుఖినోభవంతు**

# తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశ..



**తెలంగాణలో మరో తిరుపతిగ తన 'హరినామక్షేత్రము'ను ఏర్పాటు చేయుటకై తిరుమల శ్రీవేంకటేశ్వరుని లీలల ధారావాహికం**

**- పుల్లగూర్ల సాయిరెడ్డి (గోవింద దాసు)**


దిశ : సిద్ధిపేటకు 7 కి.మీ దూరములో ఉన్న చిన్నగుండవెల్లి అనే మా స్వగ్రామంలోని మా తోటబావి వద్ద తిరుమల శ్రీవేంకటేశ్వరుడు తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయదలచాడు. కనీసం రెండు ప్రాకారాల (వెండి వాకిలి) వరకైనా తిరుమల ఆలయ ప్రతిరూపమును నిర్మించమన్నారు. తాను స్వయంగా ఈ క్షేత్రంలో స్థిరనివాసమేర్పరచుకొని భక్తులను అనుగ్రహించుదునన్నారు. మరియు వివిధ భక్త బృందాలచే వంతుల వారిగా అఖండ హరినామ స్మరణ జరగాలని సూచించారు. స్వామివారిని తిరుమల నుండి ఆహ్వానించుటకు తగిన యోగ్యత సాధించుటకు వీలుగా కఠిన సాధనతో పాటు భాగవతుల ఆశీర్వాదమును పొందమన్నారు. తన కలల ద్వార సం॥ 2000 నుండి శిక్షణ ఇచ్చుట ప్రారంభించి సం॥ 2022లో అసలు విషయం తెలిపారు. మరియు భక్తులను ఈ కార్యక్రమములో భాగస్వాములుగ చేయుటకు వీలుగ స్వామివారు ప్రసాదించిన అనుభూతులను తెలుపమన్నారు. అందులో భాగంగానే ప్రస్తుతపు 4వ భాగపు లీలల ప్రచురణ.




## చూడని ఆలయాలను దర్శించుట

**పూర్వాంగం:** నేను చూడని ఆలయాలు కనబడ్డవి. అవి ఏ ఆలయాలు? అందులోని దైవం ఎవరు? అనే విషయం తెలియలేదు. కనుక్కో చూద్దాం నేనెవ్వరినో? అనే ప్రశ్న వేసినట్టనిపించింది. ఈ కల కన్న వెంటనే ఈ మూర్తి నన్ను బాగా ఆకర్షించింది. అత్యంత స్పష్టంగా దగ్గర నుండి చూచాను. కాని వారెవ్వరో కనుక్కోలేకపోయాను. దాదాపు 15 నెలలు వీరి గురించి ఎంతో మందిని అడిగాను. నేను దర్శించిన ఆలయ నమూనాలను వెతికాను. కాని లభించలేదు. చివరికి ఇది కొల్హాపూర్ శ్రీమహాలక్ష్మి అమ్మవారి మందిరమని, నేను చూచింది ఈమెనే అని తేది 21-06-2002 నాడు ధృవీకరించుకున్నాను. ఆ లీల ఈ విధంగా ఉంది.

**20-03-2001 : లీల :** ఈ రాత్రి నేను మామూలుగానే పడుకున్నాను. నాకు ఒక కల వచ్చింది. అందులో నేను ఒక రోడ్డుపై నడుచుకుంటూ వెళ్ళుచున్నాను. ఆ రోడ్డుకు ఇరు ప్రక్కల గుళ్ళు లాంటి ఆర్చెస్ కలవు. అవి ఈ క్రింద చూపిన ఆకారములో



ఎత్తైన వరండాపై ఒకదాని ప్రక్కన మరొకటి ఉన్నవి. ఈ వరండాపై ఒక ముసలాయన కావలిగా పడుకుని ఉన్నాడు. గుళ్ళు పురాతనమైనవి. రంగులు పోవుచున్నవి. అన్ని ఆర్చెస్ కలవు. నేను ఆ రోడ్డుకు ఇరుప్రక్కల ఉన్న ఈ క్రొత్త రకమైన ఆలయాలను చూచుకుంటూ రోడ్డు చివరిదాకా వెళ్ళాను. చివరికి మళ్ళీ వెనుకకు వచ్చాను. మొదటి ఆర్చి వద్దకు వచ్చాను. ఇప్పుడిది ఒక క్రొత్త రకమైన ఆర్చిలాగా కనబడ్డది. రెండడుగుల ఎత్తైన చతురస్రాకారపు గట్టుపైన దాదాపు 12 అడుగుల ఎత్తైన చతురస్రాకారపు గోడలో ఈ ఆర్చి ద్వారములాగా అమర్చబడ్డది. దానిని పరిశీలించి చూడాలనిపించింది. చతురస్రాకారపు గట్టును ఎక్కి ఆ ఆర్చి ద్వారము గుండా లోనికి ఒక ప్రత్యేకమైన కోణంలో చూచాను. ఆ ఆర్చి నుండి లోపలకు చూచుచుంటే మళ్ళీ క్రొత్తరకమైన చిన్న చిన్న ఆర్చెస్ ఎన్నో కలవు. వాటి నుండి చక్కగ చూచాను. చాలా దూరములో ఒక నల్లని ఆకారములో శంఖు చక్రములతో ఉన్నట్లు ఉన్న ఒక దేవుణ్ణి దర్శించాను. అంత దూరము ఉన్నా, ఆ దేవుణ్ణి నేను చాలా దగ్గర నుండి అంటే స్వయంగా గర్భగుడిలో ఉండి చూచినట్లు చూచాను. ఈ మూర్తి ఒక ప్రత్యేకమైన ఆకారంగా కనబడ్డది. ఈ మూర్తి వెనకాల చక్కని చక్కునము ఉన్నది. దాదాపు 4 అడుగుల వ్యాసము కలిగి పద్మరేకు ఆకారం ఔట్ లుక్ గల దానిలో ఈ చక్కునము అమర్చబడ్డది. మూర్తిపైన నాగుపాము పడగ చక్కునములోనే అమర్చబడి ఉన్నది. ఈ మూర్తి అత్యంత సుందరంగా కనిపించింది. శంఖు చక్రాలతో పాటు, మూడవ చేతిలో గద, 4వ చేతిలో ఒక పాత్రను పట్టుకున్నట్లు ఉంది. అత్యంత నల్లగా, అప్పుడే అభిషేకము జరిగినట్లనిపించింది. నేను ఇంతవరకు ఈ రకమైన గుడులను చూడలేదు. అది ఏ గుడి అగునో నేను ఎవ్వరిని చూచానో పోల్చుకోలేదు. ఈ కలలో నేను మొత్తం ఆర్చెస్ ను మరియు గర్భగుడిలో ఉన్న మూర్తిని మాత్రమే చూచాను. కాని గుడి బయటి ఆకారాన్ని కాని, ధ్వజస్తంభాన్ని కాని చూడలేదు. మొత్తం మీద ఈ గుడి తెలుగు సాంప్రదాయపుది కాదని తెలుసుకున్నాను. ఇది కల.

ఈ మూర్తి నన్ను మోహపరవశుణ్ణి చేసింది. చాలా ఆకర్షించింది. ఆ గుడి గురించి, మూర్తి ఎవరన్న దాని గురించి 15 నెలలు నాకు తెలిసిన ఆధ్యాత్మిక వ్యక్తులను అడిగాను. నా దృష్టికి వచ్చిన ఆ ఆకారపు గుడులను ప్రత్యేకించి చూచుట మొదలుపెట్టాను. కొందరు విశాఖపట్నం తీర ప్రాంతంలో అమ్మవారి గుడిని సూచించారు. మరికొందరు బెంగాల్ ప్రాంతములో ఈ రకమైన ఆర్చెస్ తో కూడిన గుడులు ఉన్నవని చెప్పారు. చివరికి తేది 21-06-2002 రోజున నేను కొల్హాపూర్ శ్రీమహాలక్ష్మీ అమ్మవారి ఆలయమును దర్శించాను. ఒక ప్రత్యేక భంగిమలో చూచినప్పుడు ఇది నేను కలలో చూచిన మాదిరిగ కనబడ్డది. తూర్పువైపున ఉన్న ముఖ్యద్వారము నుండి ఒక ప్రత్యేక కోణంలో చూచినచో అదే విధమైన ఆర్చెస్ మరియు వాటి మధ్యనుండి చూచినప్పుడు నల్లని ఆ అమ్మవారి విగ్రహము యథావిధిగా కనబడింది. అమ్మవారి వెనకాల చక్కునము కూడా అదేవిధంగా ఉంది. అప్పుడు నేను ఆ శ్రీమహాలక్ష్మి అమ్మవారే కనబడ్డారని మురిసిపోయాను.

**31-03-2001 :** ఈ రోజు ఒక నిజమైన సంఘటన జరిగింది. శ్రీవేంకటేశ్వరుడు కల్పించు లీలలపైన విశ్వాసమును పెంచే విధంగా ఉంది. నేను అల్వాల్ లోని జి.వి.రెడ్డి కాలనీలో ప్లాట్ నెం.50 లో కంటోన్మెంట్ బౌండరీకి ఆనుకొని ఉన్న ప్లాట్ లో రెండు ఇళ్ళ కోసమని కన్స్ట్రక్షన్ మొదలుపెట్టాను. ఫూటింగ్ వర్క్ అయిపోయింది. అప్పుడు కంటోన్మెంట్ అధికారులు ఎలాంటి నోటీస్ లేకుండా మా సైట్ వద్దకు వచ్చి క్రేన్ సహాయముతో నేను వేసిన ఫూటింగ్సును, బేస్మెంటును తీసి వేయుచున్నారు. ఈ విషయమును మా సూపర్వైజర్ ద్వారా తెలుసుకొని, అత్యంత ఆత్రుతతో నా కారులో ఇంటినుండి అల్వాల్ కు వెళ్ళుచున్నాను. స్వామివారిని ప్రార్థించుచు ఆత్రుతతో వెళ్ళుచున్నాను. మా సైటు నుండి ఒక కిలోమీటరు ముందున్న నర్తకి టాకీస్ చౌరస్తా వరకు వెళ్ళాను. నా మనస్సులో ఆందోళన తారాస్థాయికి చేరింది. అప్పుడు ఆ చౌరస్తా వద్ద కట్టెతో చేసి అత్యంత సుందరమైన రంగులు వేసినటువంటి ఒక 15 అడుగులు ఎత్తు కలిగిన శ్రీవేంకటేశ్వరుని రథము నిలిచి ఉండుటను చూచాను. దానిలో కట్టెతో చేసి రంగులు వేసినటువంటి శ్రీవేంకటేశ్వరుడు దాదాపు నాలుగైదు అడుగుల ఎత్తుతో ఆ చౌరస్తా పైన నిలుచుని ఉన్నారు. అది ఏదో ఒక దేవస్థానము వారు స్వామిని ఊరేగించుచున్నారు అన్న విధంగా ఉన్నది. ఆ నడి బజారులో రథం, అందులో స్వామివారు మాత్రమే ఉన్నారు. రథం త్రిప్పువారు ఒక్కరూ లేరు. స్వామివారు నాకు ఎదురుగా నా కోసమే ఉన్నట్లు కనబడ్డారు. దానిని చూచిన వెంటనే నా లోపల ఆత్రుత తగ్గింది. "తొందర పడకు, వారు ఏమి చేసుకుంటారో అది వారిని చేయనివ్వు. నీకు మేలే జరుగుతుంది. దానిని వారు ఎంత కోపముతో నిన్ను పని చేయనీయకుండా చేయుచున్నారో అంతకు రెండింతల సహనముతో నిన్ను వారు అనుమతించుదురు. వారు అభ్యంతరము లేదని అందురు" అని నాలో నాకు భావన కలిగింది. తరువాత

నా తొందరను తగ్గించి నెమ్మదిగా వెళ్ళాను. ఇంతలో వారు పని ముగించుకుని వెళ్ళిపోయారు. ఒక అయిదారు నెలల తరువాత క్రొత్త అనుమతి నెం.111 కలిగిన దానితో మళ్ళీ పనులు మొదలు పెట్టాను. వెంటనే కంటోన్మెంట్ యొక్క పెద్ద పెద్ద ఆఫీసర్స్ వచ్చి చూచారు. మరియు 'నీ ఇష్టమున్నట్లు కట్టుకొమ్మ'ని చెప్పి వెళ్ళిపోయారు.

అయితే తరువాత ఆ రథము ఏ దేవాలయంది? ఎక్కడిదని వెతకనారంభించాను. ఉన్న అన్ని దేవాలయములలో వెళ్ళి కనుక్కున్నాను. కాని ఎవ్వరూ కూడా అలాంటి రథము వారివద్ద లేదని, వారు ఊరేగింపు చేయలేదని చెప్పారు. చివరికి ఇది శ్రీవేంకటేశ్వరుని లీల అని, నాకు మాత్రమే కనబడుచు ఇతరులకు కనిపించని ప్రత్యేకమైన లీల అని ఒక రెండు సంవత్సరముల తరువాత గ్రహించాను. మరియు శ్రీవేంకటేశ్వరుడు చూపు లీల యాదృచ్ఛికము కాదని, జరిగి తీరుతుందనే నమ్మకము నాలో బలపడింది.

## స్వామిసేవ ఒక ఆట లాగ చిత్రీకరించుట

నేను హైదరాబాద్ లోని దుర్గాబాయి దేశ్ ముఖ్ కాలనీలో నివసించుచున్నాను. కన్స్ట్రక్షన్ వర్కు మాత్రం అల్వాల్ లో జరుగుచున్నది. ప్రతిరోజు పని దగ్గరికి పోవడం, తిరిగి రావడం తిరుమలగిరి నుండే జరుగును. తిరుమలగిరి మెయిన్ రోడ్డుపైన శ్రీఆంజనేయస్వామి వారి గుడి ఒకటి ఉంది. నేను అప్పటికే ఈ సృష్టిలోని ప్రతి మూర్తి శ్రీవేంకటేశ్వరుని అంశ మాత్రమే అని దృఢంగా నమ్మేవాణ్ణి. మరియు ఆయా మూర్తులలోని శ్రీవేంకటేశ్వరుని అంశకే నమస్కరించే అలవాటు చేసుకున్నాను. సం॥ 2000 లో అల్వాల్ లోని కన్స్ట్రక్షన్ లో జరిగిన గొడవల నుండి గట్టెక్కించే ప్రయత్నంలో, అత్యంత అందుబాటులో ఉంది కావున ఇక్కడి శ్రీ ఆంజనేయస్వామి వారిని మరియు వెనుక ఉన్న శివుణ్ణి నా ప్రభు తిరుమల శ్రీవేంకటేశ్వర రూపంగా భావించి ప్రతిరోజు ప్రార్థించేవాడిని. నా సమస్యలు తీర్చుమని దీనాతి దీనంగా ప్రార్థించేవాడిని. చాలా సందర్భాలలో నా హృదయం నుండి భక్తి భావం ఉప్పొంగి రోమాంచితుడనై కళ్ళనుండి ఆనందబాష్పాలు రాలుచుండ ప్రార్థించేవాడిని.

**19 ఏప్రిల్ 2001 :** కల: ఈరోజు ఒక స్వప్నము కలిగింది. ఇది హైదరాబాదులోని తిరుమలగిరిలో రోడ్డు ప్రక్కన ఉన్న ఆంజనేయస్వామివారి గుడి. గుడి కాంపౌండు వాల్ పైన ఒక పెద్ద కోతి, రెండు చిన్న కోతులు ఖాకీరంగు నెక్కరు వేసుకుని తెల్లరంగు అంగీలు ధరించి ఆడుకొంటున్నాయి. కాంపౌండు గోడపై అటు ఇటు దుంకుచు చాలా ఆనందంగా ఆడుకుంటున్నాయి. నేను వాటి ముందు ఉన్న రోడ్డు పైనుండి అల్వాల్ వైపు పోవుటను చూచి, "రా... ఆడుకుందాము రా..." అని సైగ చేయుచున్నవి (అంటే పిలుస్తున్నవి). నేను మాత్రం వాటిని వాటి ఆనందమును చూచుచు నిలుచున్నాను. అవి నన్ను రా.. రమ్మంటు పిలుస్తున్నవి.

ఇది కల. కాని ఆ రోజు ఈ కల అర్థం నాకు తెలియలేదు. ఈ కోతులు అత్యంత నేర్పరితనం కలిగినవి. చొక్కాలు ధరించినవి. సర్కస్ వారి కోతుల లాగా ఉన్నవని భావించాను. కాని నన్నెందుకు ఆడుకుందాం రా... అంటూ పిలుస్తున్నవో అర్థం కాలేదు.

నా జీవితములో స్వామివారి సేవ ఒక ఆటలాగా జరిగింది. బహుశా దీనికి చిహ్నంగా ఈ లీలను చూపారనుకుంటున్నాను.

**పూర్వాంగం:** శ్రీవేంకటేశ్వరుడు నాకు ఆసక్తిగల వ్యాపారము మొదలగు అంశాలలో తలెత్తిన సమస్యలను తీర్చు క్రమములోఎంతో ఆప్తుడైనాడు. క్షణము ఆయన నామస్మరణను వదిలి ఉండలేని స్థితి కలిగింది. శ్రీవేంకటేశ్వరుని పైన అమితమైన భక్తి పెరిగింది. స్వామివారికి ఎలాంటి అపకారము చేయుటను కాని లేదా చిన్నతనం చేసి మాట్లాడుటను కాని సహించలేని స్థితి కలిగింది. ఇలాంటి ఘటన ఒకటి జరిగింది.

మా ఊరిలో అందరు శైవ సాంప్రదాయాన్ని పాటించేవారే. ఒకే ఒక కుటుంబం రమణయ్య పంతులు అనేవారు మాత్రం చ్ఛాదత్త శ్రీవైష్ణవులు ఉండేవారు. నేను హైదరాబాదులో నివసించుచున్నప్పటికీ పండుగలకు ఇతర సందర్భాలలో ఊరికి వెళ్ళేవాడిని. ఇలా ఒకరోజు ఊరికి వెళ్ళాను.

## శ్రీవేంకటేశ్వరుడే శివుడని సూచించుట

ఇది నాకు అద్భుతమైన రోజు. మరువలేని రోజు. నాకు ఆ శ్రీవేంకటేశ్వరుని పైన అమితమైన ప్రేమ ఏర్పడింది. ఎవ్వరికీ ఏ ఆపద కలిగినను ఆ శ్రీవేంకటేశ్వరుణ్ణి పూజించినచో అన్నీ నెరవేరునని నా ప్రగాఢ విశ్వాసము. నేను ఒకరోజు మా స్వగ్రామమైన చిన్నగుండవెల్లికి పోయాను. అక్కడ ఆ రోజు రాత్రి దాదాపు 8.30 ప్రాంతమున నా మిత్రుడైన శ్రీ శేఖరం దుకాణంలో ఆయనతో మాటలాడుచు కూర్చున్నాను. ఇంతలో నలుగురైదురు మా ఊరివారు వచ్చి మాతో మాట్లాడుచున్నారు. అందులో ఒకరు తనకు గత రెండు సంవత్సరముల నుండి చాలా కష్టంగానున్నదని ఎంత

ప్రయత్నించినా ఏ పనులు కావటం లేదని చెప్పుచుండెను. వెంటనే నేను "నీవు ఆ శ్రీవేంకటేశ్వరుని వేడుకో. నీకు అన్ని పనులు చక్కగా అవుతాయి" అని అప్రయత్నంగా చెప్పాను. ఇంతలో శేఖరం (శివభక్తుడు) ఇలా అన్నాడు. "హా! వేంకటేశ్వరుణ్ణే పూజించాలా? శివుణ్ణి పూజించితే కాదా? నీవిలా చెప్పద్దు. ఎవరికి ఎవరు ఇష్టమైతే వారినే పూజించుదురు" అని ఆ శ్రీవేంకటేశ్వరుణ్ణి కించపరిచే విధంగా మాట్లాడాడు. "నీకిష్టమైతే నీవు ఆయనకు పూజ చెయ్యి. కాని ఇతరులకు చెప్పకు"మని కఠినంగా, కించపరుచుటకు ఉపయోగించే స్వరముతో మాట్లాడాడు. దీనితో నా మనస్సు చాలా బాధపడింది. అసలు ఎవ్వరిని పూజించాలి అనే సందేహం కలిగింది. శివుడు గొప్పవాడా? లేదా శ్రీవేంకటేశ్వరుడు గొప్పవాడా? అనే సందేహం కలిగింది.

ఈ విధంగా స్వామివారిని కించపరిచి మాట్లాడేసరికి చాలా బాధపడ్డాను. నా గుండెలో గునపముతో గుచ్చినట్లు, గుచ్చిన గునపమును మళ్ళీ మళ్ళీ పెకిలించునట్లుగ బాధ కలిగింది. నా సందేహమును తీర్చుమని ఆ దేవుణ్ణి మరి మరి వేడుకున్నాను. మనస్సులో ధ్యానించాను. దాదాపు 15 రోజులు ఈ బాధ అనుభవించిన తరువాత ఈ కల వచ్చింది. దీనితో నా సందేహం తీరిపోయింది. గుండెలోని బాధ తగ్గింది.

**22-11-2001** : కల : ఇందులో నేను ఒక నేచురల్ గ్రానైట్ స్టోన్ రంగులో మధ్యసైజులో ఉన్న శివలింగమును చూచాను. అది భూమిపై కాకుండా మధ్యన గాలిలో నిలిచి ఉన్నది. దాదాపు నా భుజాల ఎత్తులో, నా నుండి మూడు అడుగుల దూరంలో ఉన్నది. నేను అత్యంత స్పష్టంగా చూడగలిగే విధంగా ఉన్నది. ఇది నలుపు కాదు, తెలుపు కాదు. నేచురల్ గ్రానైట్ రంగులో చుక్క చుక్కలుగ ఉన్నది. అభిషేకం తరువాత ఏవిధంగా ఆ నీటి తడిలో మెరుస్తూ ఉంటుందో ఆ విధంగా మెరుస్తూ ఉంది. కొంతసేపు స్పష్టంగా ఆ లింగమును చూచిన తరువాత కల చెదిరింది. కల జరుగుచున్న కాలము "నేనే శివుడిని నీవు పూజించు" అనే భావము నా మనస్సున ప్రవేశించింది. ఇలా ఈ కల వచ్చినప్పటి నుండి నాకు ఆ శ్రీవేంకటేశ్వరుడే శివుడు అనే జ్ఞానోదయం స్పష్టంగా కలిగింది. అప్పటినుంచి నేను ఏ శివాలయమునకు పోయినా "ఓం నమో శివరూపాయ శ్రీవేంకటేశ్వరాయ నమో నమః" అని కొలిచినచో నాకు అమితమైన ఆనందము కలుగుచుండేది. కనుల వెంట ఆనంద బాష్పములు రాలుచుండేవి. అప్పటినుండి శివుణ్ణి నా ప్రభువు శ్రీవేంకటేశ్వరుని ద్వితీయ రూపంగా భావించాను.

శ్రీవేంకటేశ్వరునితో మంచి బంధం ఏర్పడింది. నా మనస్సులోని ప్రతి భావమును ఆయనకు చెప్పేవాడిని. ఆయన కూడ తగిన విధంగా జవాబిచ్చేవాడు. స్వామివారితో ఒక ఆత్మీయబంధం ఏర్పడింది. ఉదా : ఒక మారుమూల ప్రాంతం నుండి హైదరాబాద్ లాంటి నగరమునకు విద్యాభ్యాస నిమిత్తమని వేరు వేరు ప్రాంతముల నుండి వచ్చిన ఇద్దరు విద్యార్థులు ఒక చిన్న 10 X 10 సైజుగల గదిలో స్వయంపాకం చేసుకుంటూ ఒక సంవత్సరం కాలం గడిపిన తరువాత వారి మధ్యన ఎటువంటి దాపరికం లేని స్నేహబంధం ఉంటుందో అంతటి బంధం మా మధ్యన ఉన్నదనిపించింది.

## స్వామివారు సమాశ్రయణం చేయుట

**పూర్వాంగం:** నాకు ప్రతిరోజు ఆ స్వామిని చూడాలని కోరిక అమితంగా ఉండేది. ముఖ్యంగా ఆ స్వామివారి పాదాలను చూడాలనే కోరిక బలంగా ఉండేది. నా కోరిక తీర్చుమని స్వామివారిని రకరకాలుగా ప్రార్థించాను. అంతే! అద్భుతం జరిగింది. ఆ రోజు రాత్రి నిండా దుప్పటి కప్పుకొని నిద్రపోయాను. నా జీవితంలో మరపురానిది, జీవితం పావనమయ్యేది, నేను ఊహించని ఘటన జరిగింది.

**02-12-2001 : అనుభూతి :** ఇది కల కాదు నిజమైన అనుభూతి. నేను నిండా కప్పుకొని స్వామివారిని స్మరిస్తూ పడుకున్నాను. ఇంతలో ఒక అత్యంత నల్లని భూతం ఒకటి నా గదిలోనికి ప్రవేశించినట్లనిపించింది. మరో క్షణంలో స్వామివారి రెండు పాదములు నా హృదయం పైన ఉన్నటుల అనుభూతి పొందాను. కొంచెం బరువుగా కూడా అనిపించింది. ఆయన నల్లని రెండు పాదములు ఆ పాదముల పైన స్వామివారు కట్టుకున్న బంగారు పీతాంబరము యొక్క అంచు మెరుస్తూ కనపడింది. ఉలిక్కిపడ్డాను. వెంటనే స్వామివారు తన పాదములు కింద పెట్టారు. మళ్ళీ నా ప్రక్కన (మంచము ప్రక్కన) బంగారు పీతాంబరంతో ఆయన నల్లని కాళ్ళు ఉన్నట్లు అనుభూతి కలిగింది. ఎవ్వరో ఒక వ్యక్తి నా ప్రక్కన ఉన్నట్లు, ఆయన నల్లని పాదములు కలిగి ధగధగ మెరిసే పీతాంబరమును అనగా మంచి అంచు ఉన్న ధోవతిని ధరించి ఉన్నట్లు అనిపించింది. నేను ఆయన నల్లని పాదములను, దానిపైన స్వామివారి ధోవతి అంచును స్పష్టంగా చూచాను. ఒక్కమారు ఉలిక్కిపడి లేచి నా కుడి ప్రక్క చూచాను. కాని ఏమీ లేదు. అది అంతా ఆ దేవుని లీలనే! ఈ భక్తుని కోరికను తీర్చాలని జగన్నాథుని దయ

అని తలచాను. ఒకరకంగా శ్రీవేంకటేశ్వరుడు స్వయంగా నాకు సమాశ్రయణం కావించారు. ఆ స్వామిని మనసారా ధ్యానించి కృతజ్ఞతలను తెలుపుకున్నాను.

ఈ సంఘటన తరువాత నాలో చాలా మార్పు వచ్చింది. ఈ సృష్టికి మూలం శ్రీవేంకటేశ్వరుడేనని, ఈ సృష్టిలోని సమస్త దేవీ దేవతలను, వారి వారి ఉనికిని కోల్పోయే విధంగా ఈయనలో ఇముడ్చుకున్నాడని, ఈయన ఒక్కరిని స్మరిస్తే సమస్త దేవగణమును స్మరించినట్లేనని అనిపించింది. ఆ సమయమున నేను ఎవ్వరిని చూచినా వారు శ్రీవేంకటేశ్వరుని అంశగానే భావించేవాణ్ణి. ప్రతి ఒక్కరు మూడు నామాలు పెట్టుకున్నట్లు కనబడేది. ఈ సృష్టి మొత్తంలో స్వామివారు రకరకాల రూపులతో నిండి ఉన్నాడని భావించాను. అలాంటి బలమైన భావం నాలో ఏర్పడింది.

## శ్రీ పశుపతినాథ్ ఆలయాన్ని దర్శించుట

**జనవరి 2002 :** ఈ రోజు మరో కల గన్నాను. అందులో నేను నేపాల్ వెళ్ళినానట. అక్కడ ఒక పచ్చని అక్కడక్కడ చెట్లతో కూడిన మైదానమును చూచాను. దాని కుడి ప్రక్కన ఒక పురాతనమైన భవనము కలదు. కొంతవరకు అర్ధచంద్రాకారంగా (సెమీ సర్కిల్) పెద్ద పెద్ద రౌండు స్తంభాలతో కలదు. మొదటి అంతస్తులో చిన్న చూరు (Sunshade) ఉన్నది. గోడలకు మరియు స్తంభాలకు క్రిందినుండి మూడున్నర అడుగుల వరకు ఎరుపురంగు (జాజు), ఆ పైన తెలుపురంగు, కొంత పాలపిట్ట రంగు వేశారు. పై అంతస్తు కూడా కలదు. నేను ఈ భవనమును అత్యంత ఆసక్తిగా చూచుచున్నాను. ఇంతలో అశరీరవాణి మాటలు వినబడ్డవి. ''అదే నేపాల్ పశుపతినాథ్ మందిరమని'' ఎవ్వరో వెనకనుండి చెప్పారు. మేము దాదాపు 30-40 మందిమి అక్కడి పచ్చని మైదానము నుండి చూచుచున్నాము. మాకు ఎదురుగా చాలా దూరములో ఒక బంగళా ఉన్నదట. అదే నేపాల్ రాజు యొక్క నివాసమని వెనుక నుండి నాకు ఎవ్వరో చెప్పుచున్నారు. ఆ కలలో నాకు శ్రీపశుపతినాథుని దర్శించుకోవాలని అనిపించింది. కల చెదిరింది.

ఈ విధంగా నేను ఏనాడూ చూడని మరో ఆలయం అది కూడా అత్యంత మహిమాన్వితమైన శ్రీ పశుపతినాథుని ఆలయం, దాని పరిసరాలు కనబడ్డవి. (మే 2002 లో మేము నేపాల్ దర్శించినప్పుడు ఈ ఆనవాళ్ళు కొన్ని యథావిధిగా ఉన్నాయి).

## కీ.శే. వాడ్రేవు గవర్రాజు గారితో పరిచయం

శ్రీవేంకటేశ్వరుని గురించి మరిన్ని విషయాలు తెలుసుకోవాలనే కోరిక కలిగింది. కాని స్వామి గురించిన విషయాలను తెలిపే వ్యక్తులు నాకు కనబడలేదు. నేను హైదరాబాదులోని శివం రోడ్డుకు తరచుగా వెళ్ళేవాణ్ణి. అలా వెళ్ళే క్రమంలో తిలక్ నగర్ చౌరస్తా వద్ద ''శ్రీవేంకటేశ్వర భక్తి ప్రచార పీఠం'' అనే బోర్డును చూచాను. తెలుసుకుందామనే కుతూహలంతో ఆఫీసులోకి వెళ్ళాను. అక్కడ ఆఫీస్ మేనేజరుగా 'శ్రీ పాండు రంగారావు' అనే సిద్ధిపేట వ్యక్తి ఉండుట వలన పరిచయం సులభమయ్యింది. చివరికి ఆ సంస్థ యజమాని 70 సంవత్సరాలు వయస్సు కలిగిన కీ.శే వాడ్రేవు గవర్రాజు స్వామివారితో పరిచయమేర్పడింది. నిజానికి వీరు రాజమండ్రి దగ్గరున్న కొవ్వూరు వాస్తవ్యులు. ఈ మధ్యనే హైదరాబాద్ వచ్చారు. గత 20 సంవత్సరాల నుండి శ్రీవేంకటేశ్వరుని భక్తిని ప్రచారము చేయుచు జీవనోపాధి సాగిస్తున్నారు. భక్తులకు వారి కష్టాలను తెలుసుకొని ''ఐశ్వర్య మహామంత్రం'' అనే ఒక మంత్రమును వ్రాయించుచు, కొన్ని పూజలు, ప్రసంగాలు చేయుచు, వారు ఇచ్చే సంభావనతో జీవించుచున్నారు. శ్రీవేంకటేశ్వరుడంటే అత్యంత ఆసక్తి ఉన్నవాణ్ణి కాబట్టి ఆయన చేసే పూజలు, ప్రసంగాలకు వెళ్ళేవాణ్ణి. చివరికి ఆయనతో మంచి బంధం ఏర్పడింది. వారు ప్రతి పూజలోను విష్ణుసహస్రనామం చదువుచు, ప్రతి చరణానికి మధ్యమధ్యన మూడుసార్లు ఐశ్వర్య మహామంత్రమును అనుసంధానించుచు, స్వామివారికి భక్తులందరి చేత తులసి, పత్రి మరియు పుష్పములు ఒకరి చేతుల నుండి మరొకరికి అందించుచు, చివరికి స్వామివారికి సమర్పించేవారు.

నేను గతంలో శ్రీవిష్ణు సహస్ర నామమును ఎప్పుడు మనసు పెట్టి వినలేదు. దీనిలో నా స్వామి శ్రీవేంకటేశ్వరుణ్ణి రకరకాల వర్ణనలతో కీర్తించుచు ఆరాధించుట నాకు ఎంతో నచ్చింది. పరవశించిపోయేవాడిని. కాని మధ్య మధ్యన ఐశ్వర్య మహామంత్రమును పఠించుట నచ్చేది కాదు. దీనికి బదులు స్వామివారి అష్టాక్షరీ మంత్రమును పఠించినచో బాగుండునని భావించేవాడిని.

### వారు చెప్పే ఐశ్వర్య మహామంత్రం :

**ఓం... శ్రీవత్స వక్షసం శ్రీశం, శ్రీలోలం శ్రీకర గ్రహమ్ ।**
**శ్రీమంతం శ్రీనిధిం శ్రీద్యం శ్రీనివాసం భజేనిశమ్ ॥**

ఈ మంత్రములో 8 శ్రీలు ఉన్నందున, దీనిని పఠించిన వారికి అష్టైశ్వర్యములు సిద్ధించునని చెప్పేవారు. శ్రీమాన్ గవర్రాజు గారి భక్తిబోధన మొత్తం కూడా ఈ మంత్రం చుట్టే తిరిగేది. భక్తులు భగవంతుణ్ణి కష్టాలలో మాత్రమే ప్రార్థిస్తారని భావించి ఈ మంత్రమునే బోధించేవారు. జపాన్ని కూడా ఇదే మంత్రమును వ్రాయించేవారు. ఒక్కొక్కప్పుడు ''ఓం శ్రీం వేంకటేశాయ నమః'' అనే మంత్రమును కూడా వ్రాయించేవారు.

వీరు గత 20 సంవత్సరముల నుండి ఈ పీఠమును నడుపుచున్నారు. భక్తులను బృందాలుగా తిరుపతికి తీసుకెళ్ళి, కొన్నిసార్లు వృక్షాలను నాటించుట, కొన్నిసార్లు మెట్లపై శిలాఫలకాలు పెట్టించుట, మరికొన్నిసార్లు ఈ వ్రాయించిన జపాన్ని టిటిడి డైరీఫాంలో జపహోమాదులు చేసి నిక్షిప్తం కూడా చేశారట.

నాకు శ్రీ గవర్రాజు గారిలో అన్నీ నచ్చాయి. కాని ఐశ్వర్యాల కోసం మాత్రమే శ్రీవేంకటేశ్వరుని పూజించుట నచ్చలేదు. ప్రతిభక్తుడు స్వామిని పొందాలనే భావంతో పూజించాలనే భావం నాకుండేది. మొత్తం మీద వీరి బోధన ద్వారా కొంత, పుస్తకములు చదువుట ద్వారా మరికొంత, అన్నిటికంటె ముఖ్యంగా నిరంతరం స్వామిని ధ్యానించుట ద్వారా శ్రీవేంకటేశ్వరుని తత్త్వము కొంత కొంత బోధపడుచున్నది.

నా అల్వాల్ సమస్య ఇంతవరకు సమసిపోలేదు. ఒకానొక సందర్భంలో నా సమస్యను కీ.శే. గవర్రాజు గారికి చెప్పాను. ఆయన చిక్కడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్ళి అర్చన చేయించమని చెప్పారు. ఆ విధంగా చేసినచో నాకున్న సమస్యలు తొలగిపోవునని కూడా చెప్పారు. వారి మాట ప్రకారం 17-02-2002 నాడు ఉదయం 6 గంటలకు అర్చన చేయించాను. స్వామివారిని మరీ మరీ వేడుకున్నాను. ''నాకు మీరు తప్ప మరెవ్వరూ లేరని'' తలంచి మరీ మరీ ఏడ్చాను. నా కనుల వెంట నీళ్ళు పట పట రాలినవి. ఆరోజు రాత్రి ఒక కల వచ్చింది.

18-02-2002 : కల : అందులో నేను చిక్కడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి గుడి ద్వారము ద్వారా లోనికి పోవుచున్నాను. గడప దాటి లోపలికి పోవుచున్నాను. అంటే ఒక కాలు గడప బయట మరో కాలు గడప లోన ఉండి నేను లోనికి పోవుచున్నాను. అప్పుడు గుడి లోపల అంటే నానుండి దాదాపు 20 అడుగుల దూరములో ఒకాయన నల్లగా సుమారు ఆరడుగుల ఎత్తుతో ఉండి తెల్లని లుంగీ అడ్డముగా మడుచుకుని కాకీరంగు చొక్కా తొడుకుకొని తెల్లని రుమాలుతో నాకు ఎదురుగా వచ్చుచున్నాడు. ఆయన నన్ను చూచి ఈ విధముగా అన్నారు. ''ఆ ఇద్దరు మరియు ఈయన సామాన్యులు కాదు. వీరు శ్రీవేంకటేశ్వర స్వరూపులు'' అని అన్నారు. అంటే ఆయన మాటలను బట్టి నా వెనుక ఇంకా ఇద్దరు ఉన్నారట. (వచ్చుచున్నారో లేక పోవుచున్నారో తెలియదు) కాని నేను ఆ గుడి ధ్వజస్తంభమును, గడపను, మెయిన్ డోర్ ను, గుడిలోని ప్రాంగణమును స్పష్టంగా కలలో చూచాను.

బహుశా దీనర్థం నేను శ్రీవేంకటేశ్వరుని అధీనము లోనికి పోవుచున్నానని కావచ్చు.

## స్వామిపట్ల విరహ వేదనను అనుభవించుట

**పూర్వాంగం:** రోజు రోజు నేను ఏ విధంగా ఉంటున్నానో నాకే తెలియదు. ప్రతిరోజు నాకు ఆ స్వామివారిని చూడాలనే కోరిక మితి మీరుచున్నది. ఈ కోరికను ఎలా చెప్పాలో తెలియడం లేదు. యవ్వనంలో ఉన్న ప్రేమికులు ఏ విధంగా ఒకరినొకరు విడిచి ఉండలేరో లేదా ఒకవేళ వారు వేరు ప్రదేశములో ఉన్నప్పుడు వారికి అనుక్షణము ఒకరికొకరు ఏవిధంగా గుర్తుకు వస్తారో, ఒకరినొకరు చూచుకోవాలని తపించి పోవుదురో అదేవిధంగా నేను నా స్వామిని మరియు నా స్వామియే అయిన ఆ పరమశివుణ్ణి చూడాలని తపించి పోయాను. నిద్ర పట్టుట లేదు. రాత్రి మెలకువ వచ్చుచున్నది. ప్రతి క్షణము అనుక్షణము వారే కనబడుచున్నారు. వారిని చూడకుండా ఉండలేనని ఏడ్చుచున్నాను. పొర్లుచున్నాను. ఈవిధంగా చాలా రోజులు గడిచాయి. ఒకరోజు ఇదేవిధంగా జరిగిన పిదప కల గన్నాను.

**16-03-2002 : కల :** ఇందులో కూర్చుని ధ్యానములో నున్న పరమశివుణ్ణి, మరో సన్నివేశములో ఏదో ఒక గుడిలో అర్చావతారములో ఉన్న నా స్వామిని చూచాను. ఇంతే కల. అప్పుడు కాని నా మనస్సు శాంతించి నిద్రపోయాను. ఈ పరిస్థితి నాలో చాలా రోజులు ఉంది. ప్రతిరోజు స్వామివారికై తపించిపోయేవాడిని. పిచ్చివాడిగా మారిపోయాను. స్వామివారిపై విపరీతమైన ఆకర్షణ కలిగింది. ఆయన లేని జీవితము వృథా అనే స్థితికి చేరాను.

**22-03-2002 :** ఈరోజు రాత్రి ఒక విచిత్రమైన కల వచ్చింది. స్వామివారిని చూడాలనే తపన నాలో చాలా ముదిరింది. ప్రతిక్షణము ఆయన గురించిన ఆలోచనే కలుగుచున్నది. ఆయన రూపము నా మనస్సులో అనుక్షణము మెదులుచున్నది. ఈ రాత్రి నిద్రలో స్వామిని చూచిన అనుభూతి కలిగింది. ఒక గుడిలోని స్వామి ముందు నిలబడి

వారిని చూచినట్లనిపించింది. దాని తరువాత మా అమ్మ అనగా నా తల్లి (శ్రీమతి రుక్కమ్మ) చివరి దశలో ఉన్నట్లు, ఆమెకు మాటలు రాక, స్పృహలేక తన జీవితపు చివరి దశలో ఉన్నట్లు కల వచ్చింది. నా కోసం నిరీక్షించుచున్నట్లు అ నిపించింది. తెల్లవారగనే లేచి మా తల్లిని మనసారా తలచుకొని ఆ స్వామివారిని, నా తల్లిని సరిగా చూడమని వేడుకున్నాను. స్వామీ! నా తండ్రి చాలా రోజుల క్రింద చనిపోయాడు. మా అమ్మ మాత్రము ఉన్నది. ఆమె ఆరోగ్యము బాగాలేదు. ఆమెను నా నుండి దూరము చేయకండి స్వామీ అని మరి మరీ వేడుకున్నాను. అప్పుడు మా అమ్మ రామంతపూర్ లోని మా చెల్లెలు ఇంట్లో ఉంటున్నందున, సాయంత్రము 7 ప్రాంతమున పోయి చూడవలెనని తలంచి, మామూలుగనే నా ఇతర పనులలో నిమగ్నమైయుంటిని. చివరికి సాయంత్రం మా చెల్లెలు ఇంటికి వెళ్ళాను. అప్పుడు ఆ దృశ్యమును చూచి షాక్ తిన్నాను.

మా తండ్రి చనిపోయినప్పటినుండి, మా అమ్మకు తలలో మంట ఉంటుండెను. దానికామె దాదాపు గత 10 సంవత్సరాల నుండి మందులు వాడుచున్నది. ఈ మంట ఎక్కువగా ఉన్నప్పుడు, మత్తు వచ్చి నిద్రవచ్చే ఉద్దేశముతో డాక్టర్ గారు ఒక రకమైన టాబ్లెట్స్ వ్రాసి ఇచ్చి, నొప్పి ఎక్కువగా ఉన్నప్పుడు ఒక టాబ్లెట్ వేసుకొమ్మని చెప్పెను. అయితే ఈరోజు మా అమ్మ ఆ నొప్పి తొందరగా తగ్గుతుందనే ఉద్దేశ్యముతో ఎవ్వరూ చూడకుండా దాదాపు 12-13 టాబ్లెట్స్ ఒకేసారి వేసుకుంది. ఒక ఇరవై ముప్పై నిమిషాల తరువాత బాత్ రూమ్ కి వెళ్ళి అందులో పడిపోయింది. కాళ్ళు చేతులు చల్లబడ్డాయి. నోట మాట లేదు. చలనం లేదు. స్పృహలేని స్థితిలో పడిపోయింది. దీనిని గమనించిన మా చెల్లెలు కొందరి సహాయముతో బయటకు తెచ్చి పడుకోబెట్టింది. వారికి అమ్మ టాబ్లెట్స్ మింగిన సంగతి తెలియదు. చాలా కంగారు పడ్డారు. బిపి మొత్తం తగ్గింది. మాట లేదు. స్పృహ లేదు. చివరికి ఒకరి సలహా మేరకు జావ, గంజి నోటిలో బలవంతాన పోశారట. ఈ విధంగా చివరికి 4-5 గంటల మధ్యన కొంత స్పృహ వచ్చి ఆ టాబ్లెట్స్ వేసుకున్న విషయాన్ని మెల్లగా చెప్పింది.

నేను సాయంత్రం వెళ్ళేసరికి, సరిగా మాటలు లేక సరియైన స్పృహ లేక వంకర తిరిగిన నోటితో పడివుంది. కాళ్ళు చేతులు నిర్రతొక్కబడి ఉంది. సరిగ్గా శ్రీవేంకటేశ్వరుడు కలలో చూపిన భంగిమలో ఉంది. నా కోసం నిరీక్షిస్తున్నట్లు అనిపించింది. దానిని చూచి నా స్వామిని మనసారా వేడుకున్నాను. మా అమ్మ నా గురించి వేచి చూచుచున్నది. చివరి రోజు అని అనుకుంటున్నట్లున్నది. చివరికి విషయము తెలుసుకొని స్వామిని ధ్యానించి, అరటిపండు తినిపించి కొబ్బరినీరు త్రాగించి పడుకోబెట్టాను. తెల్లవారి వెళ్ళేసరికి కొంతవరకు తేరుకుంది. ఇంకొక్క రోజు గడిచేసరికి పూర్తిగా కోలుకుంది. ఈ సహాయానికి నా స్వామివారికి కోటి కోటి ధన్యవాదాలను తెలుపుకున్నాను. స్వామివారిపైన, ఆయన లీలలపైన నమ్మకం మరింత పెరిగింది.

ఈ సంఘటన తరువాత స్వామి లీలలను పునః పరిశీలించుకున్నాను. ఆయన కలలో చూపిన విధానాన్ని నిజజీవితములో జరిగే విధానాన్ని పరిశీలించుకున్నాను. మా అమ్మకు అస్వస్థత ఉన్నదన్న విషయం రాత్రి కలలో చెప్పారు. కాని పనివల్ల ప్రొద్దున పోలేక సాయంత్రం పోయాను. నేను మా చెల్లెలు ఇంటికి సాయంత్రం పోయినప్పుడు మా అమ్మ పరిస్థితి, స్వామివారు కలలో చూపిన విధంగానే ఉన్నది. మా అమ్మకు మధ్యాహ్నం 12 నుండి అస్వస్థత ప్రారంభమైంది. అదే నేను ఉదయం వచ్చి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదు కదా! నేనెందుకు రాలేకపోయాను? మా అమ్మ కంటే పని ముఖ్యమా? ఎందుకు మరచాను? ఇలా ఎన్నో రకాలుగా నాది నేను చర్చించుకున్నాను. చివరికి స్వామివారు కలలో చూపిన ప్రతీదీ నిజంగా జరిగి తీరుతుందనే దృఢమైన అభిప్రాయానికి మరోమారు వచ్చాను.

శ్రీవేంకటేశ్వరుడు మమ్ములను అత్యంత సాధారణ జీవితమును గడపమన్నారు. అత్యంత సాధరణంగా, సంఘంలో చిన్నవానిగా జీవించాలనే భావము ఏర్పడసాగింది. మొదటి నుండి కూడా నాకు ఏకాంత జీవితం ఇష్టమున్నప్పటికీ ఈ మధ్యన ఈ భావన మరింత పెరిగింది. స్వామివారి భక్తులతో మాట్లాడుటలో ఎంతో ఆనందం పొందేవాణ్ణి. లౌకిక విషయాల పట్ల ఆసక్తి బాగా తగ్గింది. స్వామివారిని తృప్తి పరచుటే లక్ష్యంగా జీవించాలనుకున్నాను.

ఈ మధ్యన నా భార్య సురేఖ ఇష్టపడి ఒక డైమండ్ రింగ్ చేయించుకుంది. మూడు నాలుగు రోజులు మాత్రమే పెట్టుకుంది.

**పూర్వాంగం: 26-04-2002 :** కుటుంబ సమేతంగా సరదాగా డార్జిలింగ్ వెళ్ళాము. అక్కడి నుండి నేపాల్ వెళ్ళాలని భావించాము. డార్జిలింగ్ లో నాలుగు రోజులు ఉన్నాము. ఈ నాలుగు రోజులలో రెండు కలలు కన్నాను.

కల : ఈ రాత్రి కలలో, నాకు తెలిసిన హైదరాబాదులోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయ పూజారి శ్రీమాన్ రామానుజాచారి పంతులు గారు, చిన్నగుండవెల్లిలోని మా ఇంటిలోని

భవంతిలో కూర్చుని ఉన్నారు. ఆయన 3 రోజులు మా ఊరి ఆంజనేయస్వామివారి ఆలయంలో పూజ చేయుటకై నన్ను అడిగి మా ఇంటిలో ఒంటరిగా ఉంటున్నాడట. ఆయన ఇంటిలో కుర్చీలో తిరునామం ధరించి కూర్చుని ఉన్నారు. ఆయన ప్రక్కన నా ఊరి మిత్రుడు శేఖరం ఉన్నట్లు ఊహ. ఇంతలో వీరు షిరిడీ సాయిబాబా లాంటి తెల్లని పెద్ద జుట్టు ఉన్న విగ్రహమును శేఖరమునకు ఇచ్చి, దీనిని సాయిరెడ్డికి ఇవ్వమని చెప్పారు. ఇది కల.

దీని సరైన అర్థమును తెలుసుకోలేకపోయాను.

శ్రీవేంకటేశ్వరుని చూడకుండా ఉండలేని స్థితి

ఇది కూడా డార్జిలింగ్ లో ఉన్నప్పుడు వచ్చిందే.

**28-04-2002 : కల :** నేను మరియు నాతో పాటు మా ఊరివారు, మరికొందరు కలిసి ఒక శ్రీవేంకటేశ్వర ఆలయం లోనికి ఆయన దర్శనార్థం వెళ్ళాము. ఒక పెద్ద హాలు లోపల నుండి వెళ్ళాము. నేను దర్శనము క్యూలో వెళ్ళేసరికి దర్శన సమయం అయిపోయింది. తలుపులు వేశారు. ఆ తలుపుపై శ్రీకృష్ణుడు భగవద్గీ బోధన చిత్రపటముంది. (ఆ తలుపు దేవాలయపు తలుపు లాగా కాకుండా ఒక ఆఫీసు తలుపులాగా ఉంది) ఇంకా కొంత సమయం తరువాత తలుపులు తీస్తారట. నేను ఆ శ్రీవేంకటేశ్వరుని దర్శనము లేనిదే ఇక్కడి నుండి వెళ్ళలేనని తలంచి ఒక చోట కూర్చుండుకుంటు ''శ్రీవేంకటేశ్వరా'' అని గట్టిగా అరుస్తున్నాను. స్వామివారి దర్శనము లేనిదే వెళ్ళనని కరుణించమని స్వామివారిని ప్రార్థిస్తూ గట్టిగా అరుస్తున్నాను. నా ప్రక్కన మా ఊరివారు ఉన్నారు. ఇది కల. అంటే స్వామివారితో బంధం గట్టిగా ఏర్పడిందని, స్వామిని విడిచి ఉండలేని స్థితి కలిగిందని అర్థం. పైగా స్వామిని నేను మాత్రమే కాకుండా నా తోటి వ్యక్తులకు కూడా ఆయన అనుగ్రహము లభించాలనే కాంక్ష నాలో ఏర్పడిందని సూచించాడు.

డార్జిలింగ్ చూచిన పిదప అక్కడినుండి నేపాల్ కు బస్సులో వెళ్ళాము. నేపాల్ లో ఉదయం చేరే విధంగా డార్జిలింగులో రాత్రి బస్సు ఎక్కి ప్రయాణించాము. బస్సులో రాత్రి బాగా నిద్రపోయాము. తెల తెలవారుతుండనగా మెలకువ వచ్చింది. ఇక్కడ స్వామివారు ఒక చిత్రాన్ని చూపారు. మేము నిద్ర నుండి లేచి చూచేసరికి ఒకప్రక్క పెద్ద పెద్ద కొండలు, మరోప్రక్క పెద్ద పెద్ద లోయలు అత్యంత భయంకరంగా కనపడ్డాయి. పైగా మేము వెళ్ళుదారి మలుపులతో కూడి అత్యంత ఇరుకుగా ఉంది. దారి భయంకరంగా ఉంది. ఎప్పుడు ఏమి జరుగునో చెప్పలేము. ఒకవేళ క్రింద పడ్డచో ఎముకలు కూడా మిగలవు. దీనిని చూచిన నా భార్య భయపడి పోయింది. గజగజ వణికింది. మా మొత్తం కుటుంబం ప్రయాణించుచున్నాము కాబట్టి ఈ భయం మరింత ఎక్కువైంది. వెంటనే శ్రీవేంకటేశ్వరుణ్ణి అత్యంత ఆర్తితో స్మరించుట ప్రారంభించింది. మేము సుఖంగా బయట పడాలని, ఎలాంటి ఆపద కలగకూడదని, ప్రతిగా తాను ఇష్టపడి చేయించుకున్న డైమండ్ రింగును తనకు సమర్పిస్తానని వాగ్దానం చేసింది. కొంతసేపటికి భయం తగ్గింది. మేము నేపాల్ చేరాము. ఈ విధంగా తన డైమండ్ రింగును స్వామివారు లాగేసుకున్నారు.

నేపాల్ లో మూడు రోజులు ఉన్నాము. శ్రీపశుపతి నాథుడిని సుమారు 4 సార్లు దర్శించుకున్నాము. నేను చూచిన కలకు ఆ ఆలయమునకు కొంత సంబంధం కలదు. అదేవిధమైన రౌండు పిల్లర్స్ మరియు ముఖద్వారము దగ్గర అదేవిధమైన అర్ధచంద్రాకార ఆకారంలో భవనం కలదు. కాని పూర్తిగా మ్యాచ్ కానట్టు అనిపించింది. పచ్చని పచ్చిక బయలు మట్టుకు రోడ్డుకు మరోవైపు కలదు. అది కూడా దేవస్థానము భూమే. దాదాపు నేను కలలో చూచిన విధంగానే కలదు. ఇందులో పూజారులు నివాసముంటారట.

శ్రీ పశుపతినాథుని అత్యంత భక్తిపూర్వకంగా దర్శించుకున్నాము. పూజారి ''మోక్షము ప్రాప్తిరస్తు'' అంటూ దీవించాడు. నేను శ్రీ పశుపతి నాథుని దర్శించినప్పుడు కూడా నా మనస్సులో నా స్వామియే ఉన్నాడు. ''ఓం నమో శివరూపాయ, శ్రీవేంకటేశ్వరాయ నమో నమః'' అని మాత్రమే మ్రొక్కాను. నా శ్రీవేంకటేశ్వరుడే ఈ శివుడు అనే భావము నా మనస్సులో దృఢంగా ఉన్నది.

## స్వామి పాదాలపై తల పెట్టి ప్రార్థించుట

గత కొన్ని రోజుల నుండి స్వామివారి పాదములపై నా తల పెట్టి దీనంగా ప్రార్థించాలనే కోరిక కలుగుచున్నది. ఈ మధ్యన ఈ కోరిక రోజు రోజుకు పెరుగుచున్నది. కాని ఇది ఎలా నెరవేరునో తెలియదు. ఈ కోరికను నెరవేర్చమని ప్రార్థించుచున్నాను.

నేపాల్ లో శ్రీ పశుపతినాథుని దర్శించుకున్న తెల్లవారి శ్రీ బుద్ధ నీలకంఠ (స్లీపింగ్ విష్ణు) ను చూచుటకు ఖాట్మండ్ కు 30 కి.మీల దూరము వెళ్ళాము. అక్కడ స్వామివారు ఒక కొలనులోని నీటిలో శేషశయనుడై ఉన్నాడు. ఆ దృశ్యమును చూచి నేను చాలా తృప్తి చెందాను. ఆ స్వామివారి పాదములను నీటితో, గులాలుతో కడిగి ఆ పాదములపై తలపెట్టి తనివితీరా మ్రొక్కాను. అంతకుముందు నేను నా స్వామివారి పాదములు కడిగి ఆ పాదములపై నా తల

పెట్టి మ్రొక్కే అదృష్టమును ప్రసాదించమని వేడుకున్నాను. ఆ స్వామివారు ఇప్పుడు నాకు దానిని ప్రసాదించారని అనిపించింది. ఆ సమయాన నా ఒళ్ళు జలదరించింది. స్వామివారిని మనసారా వేడుకున్నాను. స్వామివారు చూపు ప్రతి లీల జరిగి తీరుతుందని నమ్మాను.

నా దశ : స్వామి వారు చూపు ప్రతి లీల జరిగి తీరుతుందన్న విశ్వాసమేర్పడింది. స్వామివారిని విడిచి ఉండలేని స్థితి కలిగింది. సృష్టిలోని సర్వ రూపాలలో శ్రీవేంకటేశ్వరుడే కొలువై ఉన్నాడనే భావం ఏర్పడింది. ఈ లోకంలో గొప్పలు సాధించిన ప్రతి వ్యక్తి యొక్క శక్తి శ్రీవేంకటేశ్వరునిదే అనే విశ్వాసమేర్పడింది. సదా స్వామిని స్మరిస్తూ ఉంటే ఆయనెంతో ఆనందించుచున్నట్లు అనుభూతి చెందేవాణ్ణి.

భాగవత ఆశీర్వాదము : తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే కేవలము మీ యొక్క ఆశీర్వాదము పొందుటకని, మరియు స్వామి సంకల్పములో మిమ్మల్ని కనీసం ఆశీర్వాద రూపకంగా నైనా భాగస్వాములుగ చేయుటకు ఈ లీలలను ప్రచురించుచున్నాము. కావున ఈ లీలలను చదివిన ప్రతి భక్తుడు వయస్సు, లింగ భేదం లేకుండా స్వామి వారిని స్మరించి సంకల్పం నెరవేరాలని ప్రార్థించుచు ఆశీర్వదించగలరని ప్రార్థన.

(సశేషం)

శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు
**పుల్లగూర్ల సాయిరెడ్డి (గోవిందదాసు)**
ఇ.నెం.1-1-53, వీధి నెం.1. హబ్సీగూడ,
హైదరాబాద్. ఫోన్: 040-27175050

# రచనలకు శ్రీ వేంకటేశం ఆహ్వానం



'శ్రీ వేంకటేశం' మాస పత్రికలో వివిధ రకాల శీర్షికలకు రచయితల నుండి, కవుల నుండి, పాఠకుల నుండి సరికొత్త రచనలను ఆహ్వానిస్తున్నాము. యాత్రానుభవాలు, భక్తుల అనుభూతులు, దైవసంబంధమైన వ్యాసాలు, కథలు, కవితలు, ఇతర అంశాలను పంపవచ్చు. అయితే ఆయా రచనలతో పాటు అందుకు సంబంధించిన ఫొటోలను వీలైనచో జత చేయండి. పరిశీలించిన తరువాత ప్రచురణకు యోగ్యమైన రచనలను ప్రచురిస్తాం.

రచనలు తిప్పిపంపగోరువారు తగు స్టాంపులు అతికించిన కవరు కూడా జతచేయాలి. ప్రచురించిన ప్రతి రచనకు తగు పారితోషికం ఉంటుంది. రచనలలో అవసరమైతే భాష, శైలిలో మార్పులు, చేర్పులు చేసుకునే స్వేచ్ఛ మా సంపాదక వర్గానికి ఉంటుందని తెలియజేయుచున్నాం.


ఈ పత్రిక ప్రపంచంలోని నలుమూలలలో గల తెలుగు ప్రజలు అంతర్జాలంలో (ఇంటర్‌నెట్) వీక్షించుదురు కావున రచయితలు తగు జాగ్రత్తలు వహించి మంచి రచనలు పంపగలరని మనవి.

మీరు పంపే ప్రతి రచన పాఠకులలో భక్తిభావం కలిగే విధంగా, వారి జీవితమునకు కొంతవరకైనా ఉపయోగకారిగా ఉండవలెనని మనవి. రచనలు తెలిసే విధంగా దస్తూరి స్పష్టంగా ఉండాలి. ఫోన్ నెంబర్ తప్పనిసరిగా వ్రాయాలి.

**గమనిక: మీ రచనలను ఆన్‌లైన్‌లో పంపాలనుకునేవారు srivenkatesham@gmail.com మెయిల్ చేయండి.**

## రచనలు పంపవలసిన చిరునామా


**శ్రీ వేంకటేశం** ఆధ్యాత్మిక మాసపత్రిక,
(శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం)
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ, హైదరాబాద్-07.
ఫోన్: 040-27175050, సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com



తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి కోట్ల జపములో భాగముగా

## 21వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

# శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర లిఖిత జపము



ఈ సంవత్సరము తిరుమల శ్రీవారికి సమర్పించబోయే 7 కోట్ల జపములో భాగస్వాములు కండి! ఆ స్వామి కరుణా కటాక్షములకు పాత్రులు కండి!!

మీ మీ కోరికలను తీర్చమని తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ప్రార్థించే భాగ్యాన్ని మాకు ప్రసాదించండి!!

### సంకల్పం

శ్రీ వేంకటేశ్వరుని కరుణా కటాక్షములకు, స్వామివారి అనుగ్రహానికి అందరూ పాత్రులు కావలెననే ఉద్దేశ్యంతో ఆయన నామస్మరణలోని మాధుర్యాన్ని అందరూ అనుభవించాలనే ఆకాంక్షతో.. ప్రతి భక్తునిచే 1,008 సార్లకు తక్కువ కాకుండా 7 కోట్ల జపమును వ్రాయించి ఒక పవిత్రమైన రోజున తిరుపతిలో, కొండపై ఇట్టి జపమును శ్రీవారి పాదముల చెంత పెట్టి, నివేదించి, ఎస్.వి. డైరీ ఫాం ఆవరణలో జపహోమాదులు నిర్వహించి 'శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం'లో స్వామివారికి సమర్పించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టబడింది.

### నిబంధనలు:

1. ఈ మహామంత్రాన్ని వ్రాయుటకు ముందు మీ మనస్సులోని కోరికలను శ్రీవారికి నివేదించి, మనసారా ధ్యానిస్తూ, నోరారా పలుకుతూ వ్రాయండి. మననం, స్మరణం స్వామివారికి ప్రియం.
2. ఈ మంత్రమును కుల మత భేదం లేకుండా అందరూ వ్రాయవచ్చును. మన ఆచారవ్యవహారాల ప్రకారం అర్హత లేని సమయములో వ్రాయకూడదు.
3. ఈ మంత్రమును మీ మీ సొంత పేపర్లపై వ్రాయండి లేదా మానుంచి స్వామివారి దివ్యమహామంత్ర లిఖిత జప పుస్తకమును పొంది వ్రాయండి. పుస్తకమును పోస్టు ద్వారా కోరువారు పోస్టు ఖర్చుల నిమిత్తం రూ. 5/– ఎం.ఓ (ఒక్కంటికి) పంపినచో మేము మీకు జప పుస్తకాన్ని పంపగలము. (రూ. 10/–కి తక్కువ కాకుండా పంపండి). 9348212354 నంబర్‌కు ఫోన్‌పే, పేటిఎం, గూగుల్‌పే ద్వారా డబ్బులు, అడ్రస్ పంపి జప పుస్తకమును పొందవచ్చును.
4. మీరు ఈ మంత్రమును 45 రోజులలో వ్రాసి 'శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం' ఇం.నెం. 1–1–53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ – 500007 చిరునామాకు మాత్రమే నేరుగా గానీ / పోస్ట్ / కొరియర్ ద్వరా గానీ పంపగలరు. జప సమర్పణోత్సవ కార్యక్రమ వివరాలతో పాటు ఆహ్వాన పత్రం అందజేయడానికి వీలుగా సొంత చిరునామా కలిగి రూ. 5/– స్టాంపు అతికించిన కవరును జతపరిచి పంపగలరు.
5. ఈ మహామంత్రమును వ్రాయునప్పుడు మీలో కలిగిన అనుభూతులను మాకు వ్రాసి పంపగలరు.
6. మీరు వ్రాయవలసిన దివ్య మహామంత్రం 'ఓం నమో వేంకటేశాయ'

### గమనిక:

మేము శ్రీవారికి 2002 నుండి ప్రతి సంవత్సరం సమర్పించదలచిన 7 కోట్ల జపములో మీరు ప్రతి సంవత్సరము పాల్గొని శ్రీవారి కృపను, ఆశీస్సులను సంపూర్ణంగా పొందగలరని ప్రార్థన.

స్వామి నామమును 1,008 సార్లు వ్రాయలేనివారు కనీసం 108 సార్లు అయినా వ్రాసి ఏడు కోట్ల జపములో భాగస్వాములు కాగలరని మనవి.

శ్రీ వేంకటేశ్వర అనుగ్రహ ప్రాప్తిరస్తు..!


**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం**

ఇం.నెం. 1–1–53, వీధి నెం. 1,
హబ్సీగూడ, హైదరాబాద్ – 500007.
ఫోన్: 040– 27175050

ఈ కార్యక్రమం గురించి పూర్తి వివరాలకు సంప్రదించండి:
**93482 12354**



# మహాభారతంలోని మహోపాఖ్యానాలు

– డా॥ పులిగడ్డ విజయలక్ష్మి

## భృగుడు

**గత సంచిక తరువాయి**

ఆ మరునాడు మహర్షులందరూ సూతమహర్షితో సహా వేదిక దగ్గరకు వచ్చారు. సూతుడు అందరినీ ఆశీర్వదించి వేదిక నలంకరించాడు. ఈరోజు ఆయన చెప్పబోయే ముఖ్య విషయం గురించి ఆలోచిస్తూ మునులందరూ తమ తమ స్థానాలలో కూర్చున్నారు. సూతుడందరివైపూ చూస్తూ –

''మునులారా! నీ కోరిక ఏమిటో చెప్పమని అడిగిన పద్ముని చూసి భృగువు తన ఆలోచనను చెప్పసాగాడు.

''సర్పరాజా! నా కోరిక ఏమిటో తరవాత చెబుతాను గాని నాకో సందేహం కలిగింది. నా ప్రార్థన మన్నించి ముందు నా సందేహాన్ని తీర్చవలసిందిగా కోరుతున్నాను అని భృగువు వినయంగా అడగడంతో ''నీ అనుమానమేమిటో చెప్పు. నేను తీర్చగలిగింది అయితే తప్పక తీరుస్తానన్నాడు పద్ముడు.

''మహాత్మా! అదేమంటే – ''నీవు సూర్య రథాన్ని మోస్తూ ప్రయాణించినప్పుడు తూర్పు నుంచి పడమటి దిశ చివరివరకు వెళ్ళావు కదా! ఆ దారిలో నీవు చూసిన విశేష దృశ్యాలు, విన్నటువంటి అద్భుతాలు ఏమైనా ఉంటే వాటి గురించి చెప్పు. తెలుసుకోవాలని ఎంతో కుతూహలంగా ఉంది'' అని భృగుడు తన కళ్ళలో ఉత్కంఠను ప్రదర్శించాడు.

పద్ముడాతనిని ఆదరంగా చూస్తూ చెప్పసాగాడు.

బ్రాహ్మణోత్తమా! నీవడిగిన ప్రశ్నకు ఎన్నో విషయాలు చెప్పాలి. సావధానంగా విను.

**"ఆశ్చర్యములకెల్ల నాస్పదం బాదిత్యు**
**డాతని వలన నభూతజాల**
**మఖిలంబు చరియించు నది యచ్చెరువు గాదె!**
**యద్దేవు నంశువులందు ప్రీతి**
**నమరులు వాలఖిల్యాది మునీంద్రులు**
**సిద్ధులు శాఖల చెందియుండు**
**విహంగ కులంబుల విధమున వసియింతు**

**రంతకంటెను నెక్కు డద్భుతంబు**

**గలదె! యమ్మహాత్ము వలనన వాయువు**

**వెడలి యతని నడిమి విపుల రశ్మి**

**పొంది వృష్టి కురియు నెందును నట్టిచో**

**ద్యములు గలవె? భూసురాగ్రగణ్య!"**

**-598 ప –షష్ఠాశ్వాసము – శాంతి పర్వం – మహాభారతం**

"నిజం చెప్పాలంటే ఆశ్చర్యాలకన్నిటికీ స్థానమైనవాడు సూర్యభగవానుడే. మార్తాండుడి నుంచి సకల జీవకోటి చైతన్యాన్ని కలిగి చరిస్తుంటాయి. ఇది ఆశ్చర్యం కాదా? భానుడి కిరణాలలో వాలఖిల్యాది మహర్షులు, దేవతలు, సిద్ధులు మొదలైనవారంతా ఎంతో ప్రీతితో చెట్ల కొమ్మలపైన ఉండే పక్షులవలె నివసిస్తుంటారు. వారందరినీ చూశాను భృగూ! ఇంతకంటే అద్భుతమైన విషయం ఇంకేదైనా ఉంటుందా చెప్పు. దేవతామూర్తి అయిన ఆ భాస్కరుని వల్లనే వాయువు, ఆ సూర్యగోళం మధ్యలో ఉండే బృహత్ కాంతితో కూడి వర్షరూపంలో కురుస్తుంది. ఎక్కడైనా ఇటువంటి చోద్యాలు ఉన్నాయా? మరొక విషయం సూర్యభగవానుడే వర్షాలు కురిపిస్తున్నాడు. ఆ చండ రశ్మే తన కిరణాలతో ప్రసాదించిన నీటినంతటినీ ఆవిరిమయం చేసి వెనుకకు లాగుతాడు. నీరంతా ఒక్కసారిగా ఆయన ప్రచండమైన వేడికి ఎండి ఏరింపులైపోతుంది. సృష్టి మొత్తంలో ఇంతకన్న గొప్ప ఆశ్చర్యాన్ని కలిగించే విషయం ఏదైనా ఉందా? ఇంకొకటి చెబుతాను విను. సూర్యుడి యొక్క వేడి గనుక తగ్గితే ప్రజలలో ఆత్మనిష్ఠ శాశ్వతంగా వెలుగుతుందట.



ఇది చిత్రమైన విషయం కాదా! చిత్రాలలో కెల్లా చిత్రమైనది ఇదే మరి. దివాకరుడి వల్లనే సమస్త జీవరాశినీ భరించే భూమి తనమీద చల్లే విత్తనాల నన్నిటినీ మొలకెత్త చేస్తోంది. విత్తనంలో పెరిగే శక్తి సూర్యకాంతి వల్లనే కలుగుతోందన్నది అద్భుతావహమైన విషయం గదా!

బ్రాహ్మణోత్తమా! అన్నిటినీ మించిన విషయం చెబుతాను చూడు.

**"పరముండు నిరంజనుడ**

**క్షరుడజరుండద్వయుండు శాశ్వతుడగు న**

**ప్పరుషుడు రవియందు వెలుగు**

**నరు దంతటి కంటె గలదె? యగ్రిమ వర్ణా!"**

**-602 ప – షష్ఠాశ్వాసము – శాంతిపర్వము – మహాభారతం**

పరమపురుషుడు, పరాత్పరుడు, పరంజ్యోతి, నిర్గుణుడు (సత్వ రజ స్తమో గుణాలతో వర్తిల్లనివాడు), అక్షరుడు (నాశనం లేనివాడు), అజరుడు (వార్ధక్యం పొందనివాడు), అద్వయుడు (తాను కాక రెండవవాడు లేనివాడు – తానొక్కడే అయి ఉన్నవాడు), శాశ్వతుడు (ఎల్లప్పుడు ఉండేవాడు) అయిన శ్రీమహావిష్ణువు (ఆ మహాపురుషుడు) సూర్యుడిలోనే వెలుగులీనుతూ ఉంటాడు. అందుకే సూర్యదేవుని సూర్యనారాయణుడని ఆరాధిస్తుంటాము. అరుదైన సంగతి ఇంతకంటే ఇంకేమీ ఉండదు.

నిష్ఠాగరిష్ఠుడవైన భృగూ! నా ప్రయాణంలో అత్యంతాశ్చర్యకరమైన ఒక వినూత్న విషయం జరిగింది. ఒకనాడు మధ్యాహ్న సమయంలో ఆకాశంలో ఒకడు వడివడిగా మాకెదురు వచ్చాడు. ఆతని ముఖంలో వర్ణనకు శక్యం గాని అఖండమైన తేజస్సు కొట్టవచ్చినట్లు కనబడింది. ఆ తేజస్సు ఎలా ఉందంటే – సూర్యప్రకాశంతో సరిసమానంగా ఉన్నదా అన్నట్లుంది. తన మహోజ్జ్వలమైన కాంతితో ఆకాశాన్నే బద్దలు చేస్తున్నాడా అనేవిధంగా సవిలాసంగా ఎదురు వస్తున్న ఆతనికి అభిముఖంగా సంతోషాతిశయంతో సూర్యుడు ఆగిపోయాడు. అప్పుడేం జరిగిందంటే – సూర్యదేవుడు తనకు ఎదురుగా అతివేగంగా వచ్చి నిలబడిన ఆ మహాతేజస్విని చూసి ఆనందంతో తన చేయి చాపాడు. ఆ వినూతన వ్యక్తి కూడా విలాసంగా సూర్యుడి చేతిని తన చేతితో పట్టుకొన్నాడు. ఇద్దరి రూపాలు ఒకదానితో మరొకటి లీనమైపోతున్నాయి. ఇద్దరి ఆకారాల మధ్య తేడా శూన్యమైపోయింది. సొంత ఇంటిలోకి ప్రవేశించేంత చనువుగా ఆ తేజోమయుడు సూర్యబింబంలోకి వెళ్ళిపోయాడు. ఆ దృశ్యానికి – సూర్యుడు మునుపు రథంలో ఉన్నవాడా? లేక ఇప్పుడు కొత్తగా

వచ్చిన వాడా? అని తేల్చుకోలేని భ్రమలో ఉండిపోయాము సూర్యరథానికి రజ్జువులమైన సర్పరాజులందరం. ఆ రెండు రూపాలలో భిన్నత లేకపోవడంతో కశ్యపాత్మజుడెవరో ఎంత ఆలోచించినా బోధపడలేదు. సర్పరాజులందరూ గుసగుసలు పోతున్న సమయంలో నేను కొద్దిగా ధైర్యం తెచ్చుకొని, వినయశీలినై, మెత్తని మాటలతో లోకనాథుడైన సూర్యభగవానుని అడిగాను. 'ప్రభూ! ఇప్పుడు మనకెదురుగా వచ్చి అదృశ్యమైపోయిన వ్యక్తి ఎవరు? అతని ప్రవర్తన అత్యంతాశ్చర్యాన్ని కలిగిస్తోంది. మీలో కలిసిపోయాడే! అతడెవరు దేవా?' అని అనిన నన్ను సూర్యదేవుడు ఆదరంతో, కరుణా దృష్టితో చూస్తూ వాత్సల్యంతో నిండిన పలుకులతో సందేహ నివృత్తి చేశాడు.

''సర్పరాజా! ఆ ఆగంతకుడు సుర యక్ష గరుడోరగులలో ఏ జాతికీ చెందినవాడు కాదు. దేనిపట్లా లౌల్యం లేనివాడు. కేవలం నేలపై రాలిన ధాన్యపు గింజలనే ఆహారంగా స్వీకరించే బ్రాహ్మణోత్తముడు. పండ్లను, కందములాలను, నీటిని మాత్రమే గ్రహించి నియమ నిష్ఠలతో తపోవృత్తిలో ఉండేవాడు. ఏ కోరికా లేనివాడు. తనకు దక్కని వస్తువుల కోసం, పదార్థాల కోసం ఆశపడనివాడు. సమస్త ప్రాణికోటి హితాన్ని అభిలషించేవాడు అయిన ఒక మునీశ్వరుడు ఈ విధమైన సిద్ధినిపొంది నాలో లీనం కాగలిగాడు అని సూర్యుడు మా అందరి అనుమానాన్ని పోగొట్టాడు. భృగూ! ఇటువంటి ఆశ్చర్యకరమైన విషయాన్ని చూడగలిగాను, వినగలిగాను'' అని పద్ముడు చెప్పడంతో ఆయా విషయాల అవగాహనతో భృగువు పరమానందభరితుడైనాడు. ఆశ్చర్యం నుంచి కొద్దిసేపటికి తేరుకున్నవాడై పద్ముని తన గురువుగా భావించాడు భృగువు.

''సర్పరాజా! ఇన్ని అద్భుత విషయాలు నాకర్థమయ్యే విధంగా చెప్పావు. చెప్పావనటం కంటె బోధించావనటం సరైనమాట. ఆత్మ నిర్దేశక విషయ బోధతో నాకు చక్కని మార్గం చూపించావు. నీవు చూపిన ఉత్తమ మార్గాన్ని అనుసరిస్తూ పుణ్యాత్ముడనై నా కోరిక సఫలమైందని సంతృప్తి చెందుతాను.

గురూత్తమా!

**"నను మఱవక పనుపం దగు**
**పనులెల్లను బనుపు శిష్యభావ శుభము నా**
**కనఘూ! కలిగెను నీ దెస**
**ననూన భద్రములు నీకు నయ్యెడు మెపుడున్"**
**-612 ప. – షష్ఠాశ్వాసము – శాంతిపర్వము – మహాభారతము**

''పాపరహితుడవైన నాగేంద్రా! నన్ను మఱచిపోకు సుమా! ఎన్ని పనులైనా సరే, అన్నిటినీ సమర్థవంతంగా చేయగల నీ శిష్యుడిక్కడ ఉన్నాడు. వత్సల భావంతో ఆ పనులను చేయమని నన్నాజ్ఞాపించు. నీ పట్ల నాకు గురు భావమేర్పడింది. నీ బోధలు సామాన్యమైనవా? నేను శిష్యుణ్ణి. నీవు నాకు గురువువి. సమస్త శుభాలు నీకు కలుగుగాక. గురువరేణ్యా! నీ వద్దకు వచ్చినందుకు, నిన్ను చూసినందుకు, నీ బోధనలను ఆకళింపు చేసుకొన్నందుకు నాకు ఎంతో సంతోషం, సంతృప్తి రెండూ కలిగాయి. పోయి వస్తాను నాకు సెలవియ్యి'' అన్న భృగువును చూసి మందహాసం చేశాడు పద్ముడు.

''అవును భూసురోత్తమా! నీ ఇష్ట ప్రకారం నన్ను చూశావు. నాతో సంభాషించావు. అది సరే. ఇంతకూ నీవు నా కడకు వచ్చిన పనేమిటో చెప్పావు కాదు. నీకొక్క సహాయమైనా చేశానా? లేదే! నీ కోరిక ఏమిటి? చెప్పు తీరుస్తాను. ఈవిధంగా చెట్టు నీడన కూర్చుని కొంతసేపు కాలక్షేపం చేసి వెంటనే నీవు వెళ్ళిపోవటం భావ్యమేనా? నీకేం కావాలో నిర్మొహమాటంగా చెప్పు. తీరుస్తాను. నిన్ను సంతృప్తి పరచటం నా ధర్మం. నీవు ఉన్నతుడవు కావాలన్నదే నా ఆశయం'' అని చెబుతూ భృగుని వైపు ప్రేమగా చూశాడు పద్ముడు'' అని చెప్పటం ఆపాడు సూతమహర్షి. ఆ అవకాశం కోసమే ఎదురు చూస్తున్న శౌనకుడు మునులందరి అభిప్రాయాన్ని ఒకటిగా చేసి విన్నవించాడు.

''మహాత్మా! సూతర్షీ! మీరు చెప్పినదంతా విన్నాం. భృగుపద్ముల సమావేశం జ్ఞాన ప్రబోధకంగా, భగవత్తత్త్వ నిరూపకంగా చాలా చక్కగా జరిగింది. అయితే ఆత్మసందర్శన కనువైన మార్గం సుగమమైనట్లేనా? భృగుడా విషయాన్ని కూలంకషంగా అర్థం చేసుకున్నాడా? మరి వెళ్ళిపోతానంటున్నాడు. పద్ముడేం చెప్పాడు? భృగువుకేమర్థమైంది?'' అని అడిగిన శౌనకుని చూసి తల పంకించాడు సూతమహర్షి.

''వెళ్ళివస్తానన్న భృగునితో పద్ముడన్న పలుకులు చిరస్మరణీయాలు''. ఏమన్నాడన్నట్లు చూశారు మునులందరూ సూతుని. సూతుడు మళ్ళీ చెప్పసాగాడు.

''అప్పుడు పద్ముడు భృగుని చూసి 'నేనొకటి చెబుతాను విని, ఎప్పటికీ గుర్తుంచుకో.

**"అనఘ! నాయందు నీవు నీ యందు నేనుఁ**
**గలము నీకు నీ సర్వలోకంబు గలదు**
**చింతకవకాశమెద్ది? నిశ్చింతభావ**
**మొందు మనియె నా దంద శూకోత్తముండు"**
**-615 ప – షష్ఠాశ్వాసము – శాంతిపర్వము – మహాభారతము**

''విప్రవర్యా! నాలో నీవు ఉన్నావు. నీలో నేనున్నాను. సమస్త జగత్తూ నీకు ఉన్నది నీకింక బాధ ఎందుకు? నిశ్చింతతో నిశ్చలంగా ఉండు'' అన్న పద్మని మాటలు విని అతనితో ఏకీభవించాడు భృగుడు. అదే విషయం తేటతెల్లం చేశాడు.

**"భోగివర! యిది యిట్టిద భూతములును**
**నీవు నేనును సర్వగతా విశిష్ట**
**విధములము వేదితవ్యంబు విదితమయ్యె**
**నిట్టి సందర్శనము వ్రతమింక నాకు"**

**-617 ప. – షష్ఠాశ్వాసము – శాంతిపర్వము – మహాభారతము**

''విజ్ఞుడవైన నాగేంద్రా! నీవు చెప్పిన విషయం వాస్తవమే గదా! తెలుసుకోవలసినది చక్కగా తెలిసిపోయింది. నీవూ, నేనూ, పంచభూతాలు, సమస్త జీవకోటీ, అందరం, అన్నీ విశ్వమంతటా వ్యాపించి ఉన్నాము. మనమధ్య ఏవిధమైన భేదమూ లేదు. అందరం ఒకటే. అంతా ఒకటే. సర్వం సమానమని తెలుసుకొని సమతాదృష్టి కలిగి ఉండటం – తత్త్వదర్శనంగా గ్రహించాలి. ఇకనుంచీ సర్వసమాన భావమే నా వ్రతమనుకో! మహానుభావా! నాకిటువంటి దృఢనిశ్చయం ఏర్పడటానికి కారణం నీ కృపాతిశయమే. కేవలం నీ బోధే నాలో ఇంత చక్కటి మార్పును తెచ్చింది. నీవు చెప్పిన మాటలు అనుక్షణం తలచుకోదగినవి. ఎన్నటికీ విస్మరించరానివి. నీవు ధన్యాతి ధన్యుడవు. నా నమస్కారాలందుకొని, నాకనుమతిస్తే నేను మా స్వస్థలానికి బయలుదేరుతాను''. సమస్త ప్రాణికోటినీ సమానదృష్టితో చూస్తూ, ఏ కోరికా లేకుండా జీవించటం అత్యుత్తమమైన ధర్మం. పరమానందాన్ని పొందటానికి ఆ ధర్మమే మూలకారణం అన్న విషయం అవగతం చేసుకోవడమే తత్త్వదర్శనం అని సర్వులు గ్రహించాలి. అదే నీవు చెప్పినా, నేను చెప్పినా. మరి నాకు సెలవిప్పిస్తే చ్యవన మహర్షి ఆశ్రమానికి వెళ్ళి వ్రతదీక్ష పూని చరితార్థుడనౌతా''ను అని చెప్పి భృగుడు నిర్మల మనస్కుడై నైమిశారణ్యాన్ని వీడి వెళ్ళాడు. భృగుని తృప్తి పరచినందుకు పద్ముడు ఆనందంతో తన మందిరానికి చేరుకున్నాడు'' అని చెప్పటం ఆపి సూతమహర్షి మునులందరివైపూ ప్రేమపూర్వకంగా చూశాడు. మునులందరూ ఆయనకు నమస్కరించి ''ఆత్మదర్శనం కలగాలంటే ఏవిధమైన ప్రయత్నం చేయాలి, ఆత్మతత్త్వాన్ని అర్థం చేసుకోవాలంటే ఏం చేయాలి, ఎలా ఉండాలి అనే సమస్త విషయాలూ బోధపడినాయి. మీ బోధతో కృతార్థులమైనాము. పద్ముడు చెప్పిన విషయాలను ఆచరణలో పెడతాము. మీ గురుత్వమే మాకు రక్ష'' అని చెప్పి సూతుడితో కలిసి ఆశ్రమాలకు బయలుదేరారు.

# నాచికేతుడు

''శౌనకాది మునులారా! అందరూ వచ్చినట్లేనా? మొదలు పెడదామా?'' అని ప్రశ్నించాడు అప్పటికే వేదిక నలంకరించిన సూతమహర్షి. మునులందరూ ఆయనకు నమస్కరించి ''అందరం వచ్చాము స్వామీ! ఈరోజు ఎవరి గురించి చెబుతారు'' అని కుతూహలాన్ని ప్రదర్శించారు.

''ఈరోజు నాచికేతుడనే ఒక మునికుమారుని గురించి చెబుతాను. శ్రద్ధాళువులై వినండి'' అంటూ మొదలుపెట్టాడు సూతమహర్షి.

''నాయనలారా! 'ఉద్దాలకి' అనే మహాముని పుత్రుడు 'ఔద్దాలకి'. ఆయన కూడా మహా మహిమాన్వితుడే. తపశ్శక్తి సమన్వితుడైన ఔద్దాలకి కుమారుడు – నాచికేతుడు. ఒకనాడు ఏం జరిగిందంటే – ఔద్దాలకి మహర్షి ఏటిలో స్నానం చేసినవాడై ఏటి ఒడ్డున దర్భలు, సమిధలు, పూలూ, కమండలము పెట్టిన విషయం మరచిపోయినవాడై ఆశ్రమానికి వచ్చేశాడు. వచ్చిన కొద్దిసేపటికి పూజార్థం వస్తువుల కోసం చూస్తే అవి కనబడక పోయేసరికి ఏటి ఒడ్డున పెట్టి ఉంచిన విషయం స్మరణకు తెచ్చుకొన్నాడు. వెంటనే కొడుకును పిలిచి 'నాయనా! నాచికేతూ! సమిధలు, పూలూ మొదలైన వాటిని ఏటి ఒడ్డున పెట్టి మరచిపోయి వచ్చాను. వెంటనే వెళ్ళి వాటిని తీసుకొనిరా!'' అని పంపించాడు. నాచికేతుడు ఏటివద్దకు వెళ్ళి, అప్పటికే ఏటి ప్రవాహం ఆ వస్తువుల నన్నటినీ తనలోకి కొట్టుకొనిపోగా, అక్కడ ఏవీ లేకపోవడంతో తిరిగి వచ్చి అదే విషయం తండ్రికి విన్నవించాడు. కాని, ఔద్దాలకి ఆకలితో, కర్మపరిపాకం తరుముకు వస్తుండగా కొడుకు కమండలాదులు తేలేదని కోపోద్రిక్తుడై – ''ఓరి! జము చూడ పొమ్మ''ని శాపమిచ్చాడు. ఆ మాటలకు నాచికేతుడు బాధపడుతూ 'తండ్రీ! కోపించకు. ప్రసన్నుడివికా' అని నమస్కరిస్తూనే ప్రాణం కోల్పోయినవాడై క్రింద పడిపోయాడు.

**"కనుగొని పశ్చాత్తాపం**
**బున నుల్లం బెరియ నిట్లు పుత్రకునేనే**
**పనికై చేసితి విగతా**
**సునిగా నని మూర్ఛ మునుగుచుంబడియె ధరను"**

**-448 ప – ద్వితీయాశ్వాసం – అనుశాసనిక పర్వము – మహాభారతము**

చేష్టలు లేక నేలపై పడిపోయిన కుమారుని చూసి ఔద్దాలకి మహర్షి బాధతో, పశ్చాత్తాపంతో – ''ఎంత పని



చేశాను? ఏ పని సాధించాలని ఇతని ప్రాణాలు తీయటానికి పూనుకొన్నాను?'' అని అనుకొంటూ మనసు మండిపోతూ ఉం డగా మూర్చిల్లి క్రింద పడిపోయాడు. కొంతసేపటికి తేరుకొన్న ఔద్దాలకి మహర్షి విగత ప్రాణుడై పడి ఉన్న కొడుకు దేహాన్ని చూడలేక, కన్నీళ్ళు ధారలు కడుతుండగా, ఉద్వేగాన్ని ఆపుకోలేక పుత్రుని ముఖాన్ని తన రొమ్ముపై చేర్చుకొని దుఃఖిస్తూ నిశ్చేష్టుడై ఉండిపోయాడు. శౌనకా! చూశావా! ఔద్దాలకి మహర్షి తపోమహిమ ఎంత గొప్పదో! అతని నోట వెంట వచ్చిన మాట యథార్థమైనదై కొడుకు చావుకే నిలయమయింది. ఆయన కోపంతో కొడుకును తిట్టాడే కాని, దుఃఖాన్ని మాత్రం దిగమ్రింగలేకపోయాడు. ఆవిధంగా పుత్రుని తన వక్షస్థలం పైన పెట్టుకొని దీనుడై ఉండగా ఆనాటి మిగిలి ఉన్న పగలు, రాత్రి గడిచిపోయాయి. తెల్లవారింది. ఔద్దాలకి కన్నీటితో ముద్దైపోయిన నాచికేతుని దేహంలో మెల్లగా చైతన్యం కలిగింది. క్రమ క్రమంగా ఆ బాలుడు తెలివిని పొంది కళ్ళు తెరిచాడు. తండ్రి వైపు భక్తితో చూశాడు.

**"తను గనుగొనియెడి సుతుతో**
**మునిపతి యిట్లనియె 'పుణ్యముల ప్రోకవు నీ**
**వనఘ! చని పుణ్యలోకము**
**కని మత్పుణ్యమున రాక కలిగెను మగుడన్"**

**-451 ప – ద్వితీయాశ్వాసము – ఆనుశాసనిక పర్వము – మహాభారతము**

తననే భక్తితో కన్నార్పకుండా చూస్తున్న పుత్రుని చూసి పరమానంద భరితుడైనాడు ఔద్దాలకి మహర్షి.

''తండ్రీ! నాచికేతూ! నీవెంత పుణ్యాలరాశివిరా! పాపరహితుడివి కనుకనే పుణ్యలోకాన్ని చూసి మళ్ళీ ఇక్కడకు రాగలిగావు. ఇదంతా నేను చేసుకొన్న పుణ్యఫలమనుకో. నిన్ను ప్రాణయుక్తుడిగా చూస్తాననుకోలేదు నాయనా! నా అపరాధాన్ని భగవంతుడు క్షమించడాన్న మాట. అది సరే! కుమారా! నీ శరీరం నుంచి ఎన్నడూ ఎరుగని దివ్యసుగంధమేదో వెలువడుతోంది. ఈ సువాసన చాలా అద్భుతంగా, ఆహ్లాదంగా, ఆశ్చర్యంగా ఉంది. ఇంతకాలం నీవెక్కడకు వెళ్ళావు? ఏమేం దర్శించావు? ఇక్కడకు తిరిగి ఎలా రాగలిగావు?'' అని ప్రేమతో అడిగిన తండ్రికి లేచి నమస్కరించాడు నాచికేతుడు.

''మహానుభావా! నీవు అఖండ తపస్సంపన్నుడవు. నీ మాట తిరుగులేనిది. నీకు పుత్రుడిగా జన్మించిన నేను ధన్యుడిని. తండ్రీ! అసలేం జరిగిందంటే –

**"నీ యాజ్ఞ చని కమనీయ విశాలమై**
**మణిమయత్వంబున మహితమగుచు**
**వెలిగెడి సమవర్తి కొలువు కూటము ప్రవే**
**శించితి నా తడు చేరఁ బిలిచి**
**యంచితాసనము పెట్టించి భవద్గౌర**
**వాతిశయంబున నర్ఘ్యముఖ్య**
**పరిపూజనముల సంభావించె నతనితో**
**'నే లోకమున వసియించువాడ**
**ననఘ! యానతి యిమ్ము నాకం'టి ననిన**
**నీవు చావవు; నీ తండ్రి నిన్ను జముని**
**చూడ పొమ్మని పనిచిన జూచి తంద**
**యరుగు మమ్ముని వగపేద' ననియె నతడు"**

**-456 ప – ద్వితీయాశ్వాసము – ఆనుశాసనిక పర్వము – మహాభారతము**

''నీవాజ్ఞాపించగా మణులతో నిర్మితమై, శోభాయమానంగా వెలిగిపోతున్న యమధర్మరాజు కొలువుకూటంలోకి ప్రవేశించాను. నన్ను చూడగానే ఆ యముడికి నీ తపోమహిమ, నీవు గుర్తకు వచ్చారు. వెంటనే నీమీద ఉన్న గౌరవాతిశయంతో సింహాసనం తెప్పించి, దానిమీద నన్ను అధివసింప చేశాడు. అతిథి సత్కారాలతో నన్ను ఎంతగానో సత్కరించాడు. అప్పుడు నేనా ధర్మరాజును చూసి 'మహాత్మా! ఏ లోకంలో నేను నివసించాలో ఆనతివ్వండి' అని అడిగాను.

దానికి ఆ దక్షిణ దిశాధిపతి ఏమన్నాడంటే –

'నాచికేతూ నీవు చావవు. నీ తండ్రి – యముని చూడటానికి పొమ్మన్నాడే గాని, మృతుడవు కమ్మని అనలేదు. ఆ మహా తపస్సంపన్నుని ఆజ్ఞ ప్రకారం ఇక్కడకు వచ్చావు. నన్ను చూశావు. ఔద్దాలకి మాట నెరవేరింది. అక్కడ భూలోకంలో పాపం ఆయన నీకోసం ఎంత దుఃఖిస్తున్నాడో గదా! నీవక్కడికే వెళ్ళి ఆ మహర్షి దుఃఖాన్ని పోగొట్టు' అని చెప్పడంతో నా మనసులోని మాటను ఆయన ముందు విన్నవించాను.

''మహాత్మా! సమవర్తీ! నీ ఆజ్ఞ ప్రకారం తప్పకుండా నేను

నా తండ్రి దగ్గరకు వెళతాను. ఈలోగా నాదొక కోరిక ఉంది. నీవు సమ్మతిస్తే వెల్లడిస్తాను. ధర్మమూర్తివైన నీ దర్శనం నాకు లభించింది. నిన్ను చూడటం వల్ల, నీ దయ నా మీద ప్రసరింపబడటం వల్ల నేను నిజంగా ధన్యుడనైనాను. పుణ్యలోకాలు ఎలా ఉంటాయో చూడాలని నాకెప్పటినుంచో కోరికగా ఉంది. నా కోరిక మన్నించి ఆ లోకాలలో ఏమేమి ఉంటాయో చూపించు స్వామీ! అని ప్రార్థించగానే యమధర్మరాజు చిరునవ్వుతో నన్ను చూసి, సరే అన్నాడు.

**"అంచిత వాహనాకలిత యానము తేరగఁ బంచి నన్ను నె**
**క్కించి సహాధిరూఢుడయి కేల్ దనకేల నమర్చి సత్కథా**
**సంచయ వర్తనుండగుచు చారుముఖాబ్జ వికాస మొప్ప వ**
**ర్తించుచు పుణ్యలోకములు ప్రీతి యెలర్పగ నాకు చూపినన్"**

**-456 ప- ద్వితీయాశ్వాసము – అనుశాసనిక పర్వము – మహాభారతము**

తండ్రీ! యమధర్మరాజు ధర్మమూర్తే కాదు, ఎంత దయామయుడో తెలుసా! నేను అడిగిందే తడవుగా వెంటనే చక్కని రథాన్ని తెప్పించాడు. ఆ రథానికి కట్టిన గుఱ్ఱాలు ఎంత బాగున్నాయనుకొన్నావు! దానిమీద నన్నెక్కించి కూర్చోబెట్టాడు. అంతటితో ఆగలేదు. తానూ రథమెక్కి నా ప్రక్కన కూర్చున్నాడు. నా చేయి తన చేతిలోకి తీసుకొని, చక్కగా తాను నవ్వుతూ, నన్ను నవ్విస్తూ, మంచి మంచి కథలు చెబుతూ పుణ్యలోకాల నెన్నింటినో చూపించాడు. నా పట్ల ఆ దిక్పాలకుడు చూపించిన ప్రేమ ఎన్నటికీ మరవరానిదయ్యా! పుణ్యలోకాలని ఎప్పుడూ చెప్పుకోవటమే తప్ప ఎన్నడూ చూసి ఎరుగము కదా! ఆ పుణ్యలోకాలు మనస్సును, కంటినీ ఎంత ఆనందపరుస్తాయనుకొన్నావు? చూసినకొద్దీ ఇంకా చూడాలనిపిస్తుందే గానీ, కనురెప్పలు అసలు మూతపడవనుకో. మణులతో పొదగబడి నిర్మితమైన మేడలు, బావులు, రకరకాల రంగులీనే ఉద్యానవనాలు ఆ లోకాలలో కనువిందు చేస్తుంటాయి. అక్కడ లేని సుందర వస్తువు ఉండదనుకో. అవి చూస్తుంటే అక్కడే ఉండిపోవాలనిపిస్తుందే గాని తిరిగి ఇక్కడికి రావాలనిపించదు. ఇక భోజన పదార్థాల సంగతి చెప్పనే అక్కరలేదు. అక్కడ దొరకని పదార్థమంటూ ఏదీ ఉండదు. కొండల వలె ఉండే పిండివంటలు, శాకపాకాలతో నోరూరించే వివిధ భోజన పదార్థాలు, ప్రవాహాలుగా ప్రవహిస్తున్న పెరుగు, పాలు, నేయి – ఒకటేమిటి – కనీ, వినీ ఎరుగని వస్తు సముదాయం పుణ్యలోకాలలో అడుగడుగునా కనపిస్తుంటుంది. సుగంధభరిత వస్తువులు, చిత్రవిచిత్ర పుష్పమాలికలు, దివ్యాభరణాలు, వినూతన వస్త్ర చయము రాసులు రాసులుగా అక్కడ పోసి ఉన్నాయంటే నమ్ము. అక్కడి సువాసనే నానుంచి నీకు సోకింది. అవన్నీ చూసిన ఆశ్చర్యంతో నేను ''స్వామీ! ఏ పుణ్యకార్యాలు చేసినవారు ఈ లోకాలకు వచ్చి ఇన్ని భోగభాగ్యాలు అనుభవించగలుగుతారు? సెలవివ్వండి'' అని యమధర్మరాజును అడిగాను తండ్రీ!

దానికాయన 'గోదానం చేసినవారు ఇక్కడి మహత్తరమైన భోగభాగ్యాలను అనుభవించ గలుగుతారు. ఏ లోపం లేనిది, ఆరోగ్యవంతమైనది, చక్కనిది అయిన గోవును వేదవేదాంగ పండితుడు, సద్ధర్మచారి అయిన విప్రునకు గనుక శాస్త్రోక్తంగా దానం చేస్తే, దాని ఫలం 'ఇంత' అని చెప్పటం బ్రహ్మదేవుడికే శక్యం కాదు. అంతేకాదు, బలం, అందం, లేతవయసు ఉన్న గనప ఎద్దును దానం చేసినా అతడు గోదాన ఫలాన్ని పొంది ఈ సకల సౌఖ్యాలు పొంది పుణ్యలోకనివాసి అవుతాడు. నాచికేతూ! పుణ్యలోకాలన్నీ చూశావు. నీ కోరిక తీరింది గదా! ఇక నీ తండ్రి దగ్గరకు వెళ్ళమని యముడు పంపగా వచ్చాను'' అని కుమారుడు చెప్పగా విని ఔద్దాలకి మహర్షి పరమానంద భరితుడయ్యాడు.

పుత్రుని చూసి ఔద్దాలకముని ''నాచికేతూ! నా తపోమహిమ వల్ల, నేను చేసిన పుణ్యకార్యాల వల్ల నీకీ అదృష్టం లభించిందన్నావు. అదొక్కటే కాదు. యమధర్మరాజు నీకు దర్శనమిచ్చి నిన్ను పుత్రసమాన ప్రేమతో ఆదరించాడంటే, అదంతా నీ పుణ్యఫలమే. జన్మజన్మలలో ధర్మమార్గాను వర్తకుడిగా ప్రవర్తిస్తూ, తపోబలాన్ని సంపాదించి ఉండబట్టే నీకా ధర్మప్రభువు దర్శనం వరరూపంలో లభించింది. నీ సద్గుణాలే నీకు మరింత ఔన్నత్యాన్ని ప్రసాదిస్తాయి'' అని చెబుతూ కొడుకుతో సహా పూజామందిరం లోకి వెళ్ళాడు'' అని చెప్పటం ఆపి మునులందరివైపూ చూశాడు సూతమహర్షి.

''మునులారా! ఒక్క విషయం గుర్తుంచుకోండి. ఎంత తపోమహిమను సంపాదించకపోతే నాచికేతుడు దైవదర్శనాన్నిపొందగలుగుతాడు?అతనికిభగవదనుగ్రహం కలిగి సకల పుణ్యలోకాలు సందర్శించ గలిగాడంటే మాటలా? ప్రతి మహనీయుడి చరిత్ర లోను ఆదర్శవంతమైన అంశాలు ఎన్నో ఉంటాయి. సత్యవంతుడిలాగా మృతి చెంది, నాచికేతుడు మరల బ్రతికాడంటే – అక్కడ సావిత్రి కారకురాలైతే, ఇక్కడ ఔద్దాలకి మహర్షి కారకుడు. రెండుచోట్లా యమధర్మరాజే అనుగ్రహించటం మరో ముఖ్య విషయం'' అని చెబుతూ సూతమహర్షి ఆసనం నుంచి లేచాడు. ఆయన ఆశ్రమోన్ముఖుడు కాగానే శౌనకాదులందరూ ఆశ్రమాల వైపు నడిచారు నాచికేతుని వృత్తాంతాన్ని మనసులలో తలపోస్తూ.

ధారావాహికం



# రామాయణ రత్నాకరం

**– రాళ్ళబండి శ్రీనివాసన్**

గత సంచిక తరువాయి

**న కర్మ కృతవా నేతత్ కాలోప హత చేతనః ।**

**జీవితాంతకరం ఘోరం రామాద్వ్యసనమాప్నుహి ।।**

''నీ బుద్ధి పాడైంది. నీకు ఆయువు తీరింది. నీది ఘోర కృత్యం. అది నీకు ప్రాణాంతకం. నీవు కష్టాల పాలవుతావు. నిన్ను చంపేస్తాడు రాముడు''.

అయ్యో కైక కోరింది ఇదే. ఇప్పుడామె మనసు కుదుట పడుతుంది. అయ్యో ఏం చేయాలి నేను. అసహాయురాలిని. రావణుడు నన్ను తీసుకుపోతున్నాడు అంటూ మృగాలకి చెప్పింది. పక్షులకి చెప్పింది. చెట్లకి చెప్పింది. కొండలకి చెప్పింది. గోదావరికి చెప్పింది. రామునికి తెల్పండి అని దీనంగా వేడుకుంది. పదే పదే నమస్కరించింది.

## జటాయువు

జటాయువును చూసింది జానకి. దుఃఖపూరిత అయ్యింది. ప్రార్థించింది. ''వీడు రాక్షసుడు. రావణుడు. క్రూరుడు. బలశాలి. దురాత్ముడు. నన్నెత్తుకుపోతున్నాడు. రామునికి చెప్పవా? లక్ష్మణునికి చెప్పవా? – గట్టిగా అరిచింది.

కునికిపాట్లు పడుతున్నాడు జటాయువు. సీత ఆక్రందన విన్నాడు. కనులు తెరచాడు. రథమ్మీద ఉన్నాడు రావణుడు. మైథిలి ఉంది. చూశాడు. అతడు పర్వతశిఖరంలా మహోన్నతుడు. మొనదేలిన ముక్కు. పక్షుల్లో శ్రేష్ఠుడు. అంటున్నాడు రావణునితో.

''దశగ్రీవా! నా పేరు జటాయువు. సనాతన ధర్మం తప్పనివాణ్ణి. సత్యవాదిని. గృధ్ర రాజుని. మహాబలవంతుణ్ణి. నీవు అపహరించిందెవరో తెలుసా? లోకనాథుడు రాముడు. అతని ధర్మపత్ని ఆమె. ఆ రాముడు సర్వప్రాణి హితుడు. ఇంద్ర వరుణులకు సమానుడు. రావణా నీవు ధర్మపరుడవేనా? ధీరులు పరభార్యల్ని తాకరు. రాజులు పరదారల్ని రక్షిస్తారు. పరస్త్రీలని పట్టుకోవడం, అపహరించడం అతి నీచం. నీ బుద్ధి మార్చుకో''.

**పాపస్వభావశ్చపలః కథం త్వం రక్షసాం వర ।**

**ఐశ్వర్యమభి సంప్రాప్తో విమానమివ దుష్కృతిః ।।**

''నీవు పాపశీలుడవు. చపలుడవు. విషయలోలుడవు. నీకు రాజ్యాధికారం ఎలా లభించింది? పుణ్యాత్ములకు స్వర్గ విమాన ప్రాప్తి. అది పాపులకు ఎలా వర్తిస్తుంది. నా వెర్రికాని – హితబోధలు నీ తలకెక్కవు. ఒకవేళ ఎక్కినా అవి అట్టేకాలం



ఉండవు. చెబుతున్నా విను. సీతను విడిచిపెట్టు. నీ దారిన పో. లేదా రాముని నేత్రాగ్ని జ్వాలలకి దగ్ధమవుతావు. విషం కక్కే తాచుపాము ఉందనుకో. దాన్ని నీ కొంగున మూట కట్టడం ఎలాగో – సీతనెత్తుకుపోవడం అటువంటిదే అని తెల్సుకో. యమపాశం నీ మెడకు తగిలించుకోవద్దు''.

''సౌమ్యుడా! జీర్ణమయ్యే ఆహారం స్వీకరిస్తారు. జీర్ణం కానిది తింటే వ్యాధిగ్రస్థులు అవుతారు. సీతాపహరణం నీకు పడదు. చస్తావు. రావణా! నేను ముసలివాణ్ణి. నీవు పడుచువాడివి. నీకు ధనుర్బాణాలున్నాయి. కవచం ఉంది. నేను నిరాయుధుణ్ణి. అయినా నేనున్నాను. నీవు వైదేహిని తీసుకుపోలేవు. అది నీకు క్షేమం కాదు. కొంచెం ఆగు. వీరుడవైతే – నాతో పోరాడు. తొడిమ నుండి పండుని తుంచినట్లు – రథం నుంచి నిన్ను పడగొడతాను. ఖరునిలా పెద్ద నిద్రలోకి పోతావు'' అని జటాయువు అంటూ రథం వెంట పడ్డాడు.

విన్నాడు రావణుడు. చూశాడు పక్షిరాజుని. కోపించాడు. నేత్రాలు జ్యోతుల్లా జ్వలించాయి. పోరుకి సిద్ధపడ్డాడు. పక్షిరాజుకి, రాక్షస రాజుకి ఘోర యుద్ధం జరిగింది. పది బాణాలు వేశాడు రావణుడు. తిప్పి కొట్టాడు జటాయువు. రావణుని వీపు మీద వాలాడు. గోళ్ళతో రక్కాడు. గాయపరచాడు. జానకిని చూశాడు గృధరాజు. ఏడుస్తోందామె. రావణుని మీద పడ్డాడు. కాళ్ళతో విల్లు విరిచాడు. బాణాల్ని ముక్కుతో ముక్కలు చేశాడు. అతడు మరో విల్లందుకున్నాడు. వేల కొద్ది బాణాలు వేశాడు. గూటిలో పక్షిలా కనిపించాడు జటాయువు. రెక్కలు విసిరాడు. బాణాల్ని ఎగరగొట్టాడు. విల్లు మీద వాలాడు. దాన్ని విరగ్గొట్టాడు. కవచాన్ని చీల్చాడు. గాడిదల్ని కొరికాడు. అవి చచ్చాయి. రథాన్ని పడగొట్టాడు. సారథి తల తుంచాడు.

విల్లు విరిగింది. రథం కూలింది. కంచర గాడిదలు చచ్చాయి. సారథికి తల లేదు. మొండెం కింద పడింది. వైదేహిని చంకన చేర్చాడు కిందికి దూకాడు రావణుడు. ఆ దృశ్యం చూశాయి – సర్వభూతాలు. బలే బలే అన్నాయి. మెచ్చుకున్నాయి జటాయువుని.

పక్షిరాజు వృద్ధుడు. అలసిపోయాడు. అది కనిపెట్టాడు రావణుడు. సీతతో ఆకాశానికి ఎగిరాడు. జటాయువూ ఎగిరాడు. వాడికి ఎదురుగా నిలిచాడు. ''ఓరీ అల్పబుద్ధీ! రాముని బాణాలు వజ్రతుల్యాలు. అవి నీ జాతి నిర్మూలనకే. బంధుమిత్ర సపరివారంగా నాశనమవుతావు. దప్పిగొన్నవాడు – విషపానం చేసినట్లుగా ఉన్నావు. నీవు మృత్యుపాశ బద్ధుడవే. రావణా! నీవు పిరికివాడివి. సీతాదేవిని దొంగలా ఎత్తుకెళ్తున్నావు. వీరులెవ్వరూ చేయని పని అది''.

విన్నాడు రావణుడు. ఆగలేదు. పోతూనే ఉన్నాడు. చూశాడు పక్షిరాజు. వాడి వీపుపై దాడి చేశాడు. అదుపు తప్పింది ఏనుగు. అంకుశం తీశాడు మావటివాడు. పొడిచాడు దాన్ని. అలా ముక్కుతో పొడిచాడు జటాయువు. కరిచాడు. జుట్టుపీకాడు. గోళ్ళతో రక్కాడు. అనేక విధాల హింసించాడు. బాధపడ్డాడు వాడు. పెదవులు కంపించాయి. వైదేహిని ఎడమ చంకకు మార్చాడు. కుడిచేయి పైకెత్తాడు.

బలంగా మోదాడు. భయపడలేదు. బాధపడలేదు పక్షిరాజు. అదను చూశాడు. ఎడమ భుజం మీద వాలాడు. పది చేతులు తెంచాడు. అవి కింద పడ్డాయి. పుట్టల్లోని పాముల్లా మళ్ళీ పుట్టుకొచ్చాయి. సీతమ్మని కిందికి దింపాడు దశగ్రీవుడు. కోపంతో ఊగిపోయాడు. గృధరాజుని లాగాడు. పిడికిళ్ళతో పొడిచాడు. కింద పడేశాడు. కాళ్ళతో తొక్కాడు.

ఇద్దరి మధ్య భయంకరమైన యుద్ధం. ఆ పోరు రెండు గడియలు (48 నిముషాలు) సాగింది. ఖడ్గం తీశాడు రావణుడు. పైకెత్తాడు. జటాయువు రెక్కలు నరికాడు. పార్శ్వభాగాలు నరికాడు. కాళ్ళు నరికాడు. కిందపడ్డాడు పక్షిరాజు. నెత్తురులో పొర్లాడుతున్నాడు.

చూసింది సీత. అతడు ఆప్తబంధువు. ఆపదల పాలైనాడు. గాయాల పాలైనాడు. దగ్గరికి పరిగెత్తింది. ఎత్తుకుంది. కౌగలించుకుంది. ఎలుగెత్తి ఏడ్చింది. దగ్గరలో రామలక్ష్మణులున్నట్లు భావించింది. రామా! లక్ష్మణా! రండి. రక్షించండి అరిచింది గట్టిగా. భయం భయంగా చూసింది.

రావణుడు వస్తున్నాడు. ఏం చేస్తాడోనని భయం. లేచిందామె. వణికిపోయింది. ఓ చెట్టును గట్టిగా పట్టుకుంది. రామా రామా అని పిలుస్తోంది. కాలాంతకునిలా ఉన్నాడు రావణుడు. చెట్టుని వదలిపెట్టు – గద్దించాడు. వదల్లేదామె. గట్టిగా కౌగలించుకుంది చెట్టుని. దగ్గరకెళ్ళాడు దశాననుడు. ఆమె కేశాలు పట్టాడు.

**"జీవితాంతాయ కేశేషు జగ్రాహాంతక సన్నిభః"**

అలా జుట్టు పట్టుకోవడం తన వినాశనానికే అని తెలియదా మూర్ఖునికి.

సీతాదేవికి జరిగింది అవమానం. చూశాయి సర్వభూతాలు. స్తంభించాయి. చీకట్లు కమ్ముకున్నాయి. గాలి వీచలేదు. వెల వెలబోయాడు సూర్యుడు. దివ్యదృష్టితో చూశాడు బ్రహ్మదేవుడు. 'కృతం కార్యం' – అన్నాడు. పని అయిపోయింది. దేవకార్యం నెరవేరింది. రావణుడు చస్తాడు అని భావార్థం. ఆకాశంలోనే ఎగిరాడు. చంకలో సీత ఉంది. పోతున్నాడు రావణుడు.

కారునలుపు రంగులో ఉన్నాడు దశగ్రీవుడు. బంగారు రంగులో ఉంది సీతాదేవివవ. నీలమేఘంలో మెరుపుతీగెలా కనపడిందామె. ఆమె కొప్పునుంచి రాలాయి పూలు. వైదేహి కాలి అందె – రత్నఖచితమైంది. జారిపడింది. ఆమె తేజస్సు తోకచుక్కలా ఉంది. ఆభరణాలు అగ్నివర్ణాలు. అన్నీ చెల్లాచెదరై పడుతున్నాయి. నక్షత్రాలు రాలి పడుతున్నట్లు వుందంటాడు వాల్మీకి. ముత్యాలహారం పడుతుంటే ఆకాశగంగ జారుతున్నట్లు ఉందిట.

స్త్రీకి అర్ధరాత్రి కాదుగదా – తన ఇంటిలో – వీధిలో పట్టపగలు స్వేచ్ఛ లేకుండా పోతోంది. భయం భయంగా బతుకుతోంది నారీలోకం. ఏ నిముషానికి ఏం జరుగుతుందో ఊహించలేకపోతున్నారు. పోలీసులకి చెబుతారని భయం. అక్కడికక్కడే పెట్రోల్ పోసి తగలబెడుతున్నారు. నేరస్థుల్ని ఎప్పుడో పట్టుకున్నా – విచారణలు సంవత్సరాల పాటు జరుగుతున్నాయి. వెన్వెంటనే ఉరిశిక్షలు అమలవటం లేదు. పదేళ్ళలోపు జైలు శిక్షలు. ఇంతేకదా అని నేరస్తుల ఆగడాలకు ఊతమిస్తున్నాయి శిక్షలు. నేరం చేయాలంటే భయపడే విధంగా శిక్షలుండాలి. స్త్రీ పురుష సమానత్వం అనేది ఒక నినాదంగా మిగిలిపోతోంది. పురుషాధిక్యం పతాకస్థాయిలో ఉంది. శిక్ష అమలుకు అది అవరోధం. నేరతీవ్రతని బట్టి కొన్ని హక్కులు స్వేచ్ఛలు నేరస్థులకి ఉండరాదు. రాజ్యాంగంలో మార్పులు తీసుకురావాలి. వస్త్రధారణ విషయంలో స్త్రీ దృక్పథం మారాలి. ఎక్కడ స్త్రీ గౌరవింపబడుతుందో పూజింపబడుతుందో అక్కడ శాంతి పరిఢవిల్లుతుంది. ఆ దేశం సస్యశ్యామలం అవుతుంది – అది ఆర్యోక్తి.

ఒక ఆడదాని వల్ల రోమ్ సామ్రాజ్యం పతనమైంది. ఒక నారీరత్నం వల్ల రామ రావణ యుద్ధం జరిగింది. రావణుడు సబాంధవంగా అంతమైనాడు. ఒక స్త్రీ రత్నం వల్ల భారతయుద్ధం జరిగింది. 18 అక్షౌహిణుల సేనలు హతమైనాయి. నూర్గురు కౌరవుల్లో ఒక్కడూ మిగలలేదు. స్త్రీ శక్తి స్వరూపిణి. ఆ శక్తిని చెణకరాదు. చరిత్ర నుంచి పురుషలోకం ఎపుడు పాఠం నేర్చుకుంటుందో?

ఒక స్త్రీని రక్షించటానికి జటాయువు ఎంతో సాహసానికి పూనుకున్నాడు. రావణుని జయించలేనని తెలిసి కూడా పోరాడినాడు. తన శక్తి సామర్థ్యాలు సరిపోతాయా లేదా అని ఆలోచించలేదు. పర స్త్రీ రక్షణ తన ధర్మమని తలచాడు. ఒక పక్షి తన ప్రాణాలకి తెగించింది. ఇక మనుషులమైన మనం జటాయువు నుంచి నేర్చుకోవాలని వాల్మీకి సూచిస్తున్నాడు. గూటిలోని పక్షిలా ఉన్నాడట జటాయువు. తన గూటిలో తనకి రక్షణ ఉంటుంది. అన్ని బాణాలు తగిలినా గూటిలోని పక్షిలా వుండటం అంటే ధర్మమార్గంలో ఉంటే ఆ ధర్మమే రక్షిస్తుందని అర్థం.

రక రకాల పక్షులు కూస్తున్నాయి. అమ్మా భయపడకు అన్నట్లున్నాయి అరుపులు. తామర కొలనులోని చేపలు చూశాయి. మైథిలి దురవస్థని గమనించాయి. భయపడ్డాయి. నిట్టూరుస్తున్నట్లున్నాయి. సింహాలు పులులు చూశాయి. సీతమ్మ నీడ పడుతోంది. నేలమీద నీడవెంట పరుగులు తీశాయి. జింక పిల్లలు చూశాయి. తలలు పెకెత్తాయి. కన్నీరు

కారుస్తున్నా యి. సమస్త భూతగణాలు చూశాయి. ధర్మం లేదు. సత్యం లేదు. దయ లేదు – అంటూ ఏడ్వసాగాయి. జానకి ఆక్రందిస్తోంది. ఆమె కురులు చెదిరాయి. బొట్టు చెదిరింది. చుట్టూ చూస్తోంది. రామ లక్ష్మణులు కనపడలేదు. భయంతో కుంగిపోయింది. దీనవదన అయ్యింది.

## పరుషోక్తులు

సీతమ్మతో వెడుతున్నాడు రావణుడు. ఆమె భయపడుతోంది. వణికిపోతోంది. ఆమె ఏడుపు కోపంగా మారింది. అంటోంది ''రామలక్ష్మణుల్లేని సమయం చూశావు. వచ్చావు. నన్ను దొంగిలించావు. పారిపోతున్నావు. దుర్మార్గుడా! పిరికివాడా! రామునికి భయపడ్డావు. మారీచుణ్ణి ఉసిగొల్పావు. నా భర్తని దూరం చేశావు. మరిదిని దూరం చేశావు. జటాయువును చంపావు. నన్ను అపహరించావు. ఎంత పాడు పని? సిగ్గు లేదా నీకు? శూరుడవని అహంకరించావు. శౌర్యం లేదు నీలో. ఒక వృద్ధ పక్షిని చంపావు. నీది మగతనమా? నీది బలమా? నీది పరాక్రమమా? నీ చరిత్ర తగలబడిపోను. ఆడదాన్ని నేను. ఏమీ చేయలేను. నిజంగా నీకు ధైర్యం ఉందా? ఉంటే రెండు గడియలు ఆగు. రామలక్ష్మణులు వస్తారు. వారు రాజపుత్రులు. వీర్యవంతులు. శౌర్యవంతులు. వారి కంటపడితే చస్తావు. నీ మంచి చూసుకో. నన్ను వదిలిపెట్టు. నీచుడా! కుటిల బుద్ధి నీది. నీకు చావు మూడింది. నూకలు చెల్లిపోయాయి నీకు. వినాశకాలంలో విపరీతబుద్ధి పడుతుంది. నీవు చిరకాలం



బతకవు'' అలా పరుషంగా పలికింది జానకి. భయం దుఃఖం పెనవేసుకున్నాయి ఆమెలో. విపరీతంగా విలపించింది.

## నగలమూట

కొండలు నదులు దాటిపోతున్నాడు రావణుడు. దుఃఖిస్తోంది సీతమ్మ. తనని ఆదుకునేవారు లేరు. కానరారు. బాధపడుతోంది. అంతలో ఓ పర్వత శిఖరం – దానిమీద వానరులు. ఐదుగురు కనిపించారు. ఒకవేళ రాముడు వస్తే – వాళ్ళు చెప్పవచ్చు – అనుకుందామె. బంగారు రంగు ఉత్తరీయం తీసింది. చించింది. ఆభరణాలు తీసింది. కొంగున మూట కట్టింది. జార విడిచింది. అది వానర ప్రముఖుల మధ్య పడింది. రామా! రామా! అని బిగ్గరగా అరిచింది. తేనెరంగు కన్నులున్న వానరులు చూశారామెని. రెప్పలార్పలేదు. తేరిపార చూస్తూనే ఉన్నారు మైథిలిని. ప్రయాణ సంరంభం – లంక చేరాలనే ఆత్రుత – రాముడు వస్తాడేమోనని భయం – అది రాక్షసరాజు స్థితి. సీత చర్యని గమనించలేదు వాడు.

పంపా సరస్సు దాటాడు. వింటి నుంచి విడిచిన బాణంలా – దూసుకుపోతున్నాడు లంకేశ్వరుడు. కొండలు నదులు సరస్సులు అడవులు దాటాడు. సముద్రం సమీపించాడు. అది తిమింగలాలకు నెలవు. అది మొసళ్ళకి నిలయం. అది నదులకి గమ్యస్థానం. సీతతో ఉన్నాడు దశాననుడు. చూసింది సముద్రం. భయపడింది. క్షోభించింది. అలలు ఆగాయి. మహాజలచరాలు చూశాయి. భయపడ్డాయి. సముద్రంలోపలికి వెళ్ళి దాక్కున్నాయి. సిద్ధులు చూశారు. చారణులు చూశారు. ''వీడి పని అయిపోయింది. ఇది వీడికి చరమావస్థ'' అనుకున్నారు. రావణుని చంకలో ఉంది జానకి. జారిపోవాలనుకుంది. తప్పించుకుపోవాలనుకుంది. పెనుగులాడింది. ఆమె ఒక మృత్యు దేవత. అది ఎరుగడు వాడు. అక్కున చేర్చుకున్నాడు. గట్టిగా పట్టుకున్నాడామెని. సముద్రం దాటాడు.

## లంకా నగరం

అది లంకానగరం. రాజవీధులు కిటకిటలాడుతున్నాయి. అంతఃపురంలో దిగాడు. అది రాజ భవనం. దించాడు సీతాదేవిని. రాక్షసాంగనల్ని పిలిచాడు. వచ్చారు వాళ్ళు. పిశాచ ముఖాలు వాళ్ళవి. భయంకరంగా ఉన్నారు. అంటున్నాడు ''నా అనుమతి లేకుండా – ఏ పురుషుడు ఏ స్త్రీ లోపలికి రాకూడదు. ఈమెని చూడరాదు. మీరు కావలి ఉండాలి. ఈమె ముత్యాలడిగిందా – ఇవ్వండి.

రత్నాల డిగిందా – ఇవ్వండి. ఆభరణాలడిగిందా – ఇవ్వండి. తెలిసి కాని తెలియక కాని – ఈమెతో అప్రియంగా మాట్లాడరాదు. మాట్లాడితే ప్రాణాలు ఎగిరిపోతాయి – అది రాక్షసేంద్రుని ఆదేశం.

భవనం నుంచి బయటకు వచ్చాడు రావణుడు. రాక్షసుల్ని పిలిచాడు. ఎనిమిది మంది వచ్చారు. వాళ్ళు నరమాంస భక్షకులు. మహావీరులు. బలగర్వితులు. ''యోధులారా! సాయుధులు కండి. జనస్థానం వెళ్ళండి, అక్కడ మన మహాసేన నాశనమైంది. ఖర దూషణులు హతమైనారు. అది ఒక్కడి పని. వాడు మానవుడు. రాముడు. నాకు పరమ శత్రువు. వాడి కదలికలు పసికట్టండి. వెన్వెంటనే సమాచారం అందించండి. అదను చూడండి. వాణ్ణి వధించండి'' అది రాక్షసరాజు ఆజ్ఞ. విన్నారు. దండకారణ్యానికి ప్రయాణమైనారు వాళ్ళు.

## ప్రలోభం

సీతను తెచ్చాను. కార్యం సాధించాను – అలా అమితానందం పొందుతున్నాడు రావణుడు. అది వాడి అజ్ఞానం. రామునితో వైరం కొని తెచ్చుకున్నాడు. మనసు సీత మీదికి పోయింది. మన్మథ ప్రేరితుడైనాడు. మైథిలిని సమీపించాడు. బాధపడుతోందామె. కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరుగుతున్నాయి. మహా సముద్రంలో మునిగే నావలా ఉందామె. మందలోంచి తప్పిపోయిన జింకలా ఉంది. అడవి కుక్కల మధ్య ఉన్నట్లుంది. శోక పరాయణయై ఉంది. చూశాడు రావణుడు. ఆ దీనురాలిని ఆ వివశురాలిని రమ్మన్నాడు. రాలేదామె. కదల్లేదామె. రాక్షస స్త్రీలు వచ్చారు. బలవంతాన తీసుకెళ్ళారు.

తనసంపదతనదర్పంతనభోగంచూపించాలనుకున్నాడు లంకేశ్వరుడు. నడిపించాడామెని. బహుసుందర హర్మ్యాలు ప్రాసాదాలు నానావిధ రత్నాలు స్ఫటికాలు వైడూర్యాలు పొదిగిన ద్వారాలు, స్వర్ణ స్తంభాలు, మోగుతున్న దివ్య దుందుభులు, మేలిమి బంగారు మెట్లు, బంగారు కిటికీలు, దిగుడు బావులు, కోనేరులు, నానావిధ వృక్షాలు – ఒక్క మాటలో అది బంగారు లంక. చూపిస్తున్నాడు. వర్ణిస్తున్నాడు రావణుడు. విముఖురాలైంది సీతాదేవి.

''సీతా ఇక్కడ 32 కోట్ల మంది రాక్షసులున్నారు. అందరూ భయంకరులు. క్రూరకర్ములు. అందరికీ ప్రభువున్నేను. వేయి మంది నాకు సేవలు చేస్తారు. ఇది నా రాజ్యం. నీ స్వాధీనం చేస్తున్నాను. నా జీవితం నీ అధీనం. నా ప్రాణం నీ అధీనం. నీవు నా ప్రాణం కన్నా మిన్న. వేలమంది పరిచారికలున్నారు.



ఎందరో భార్యలున్నారు. అందరూ నిన్ను సేవిస్తారు. నాకూ వాళ్ళకీ నువ్వే ఈశ్వరివి. యజమానురాలివి. నన్ను అనుగ్రహించు.

నా లంకా రాజ్యం వేయి యోజనాల విస్తీర్ణం. వేలకొద్ది పరిరక్షకులున్నారు. సురాసురులు – దేవేంద్రుడు వచ్చినా – నా రాజ్యాన్ని ముట్టడించలేరు. దేవతలు గంధర్వులు నాతో సమానులు కారు. రాముడు రాజ్యభ్రష్టుడు. తాపసుడు. మానవ మాత్రుడు. శక్తిహీనుడు. ఈ లంకకు రాలేడు. వాడితో నీకేం లాభం? వాడు నిన్ను తీసుకెళ్ళలేడు. ముల్లోకాల్లో ఎవ్వరూ రాలేరు. ఇక్కడ మనమే. సీతా! నేను నీకు తగినవాణ్ణి. భర్తగా స్వీకరించు.


''యౌవనం హ్యధ్రువం భీరు! రమస్వేహ మయా సహ''

''భయస్వభావురాలా! యవ్వనం క్షణికం. దాన్ని వృథా చేయకు. నాతో రమించు. సుఖించు. ఆనందించు''.

''నా అన్న కుబేరుడు. వాణ్ణి జయించాను. వాడి పుష్పకవిమానం తెచ్చాను. అది రమణీయమైంది. విశాలమైంది. సూర్యకాంతి సదృశమైంది. ఆ విమానంలో విహరించు. ఆనందించు''.

మైథిలి చీరకొంగు తీసుకుంది. ముఖానికి కప్పుకుంది. ఏడుస్తోంది. రామ ధ్యాన పరాయణ అయ్యింది. దీన అయ్యింది. కాంతిహీన అయ్యింది. అస్వస్థురాలైంది. అవేమీ పట్టించుకోలేదు రావణుడు. పాపిష్ఠివాడు. తన ధోరణిలోనే ఉన్నాడు.

**(సశేషం)**



# ఒక అక్షరము మూడు ఉపదేశములు

: చిల్లర సీతారామారావు

ఉపదేశమునకు హితబోధ యని అర్థము. ఏది చెడు, ఏది మంచి అను విషయమును వివరిస్తూ చెప్పేదే హితబోధ. ఉపదేష్ట ఉపదేశములు సన్మార్గము వైపు నడిపిస్తాయి. ప్రాచీన కాలమున మహర్షులు, మునులు మున్నగువారు పురాణాలను పఠించెడివారు. శ్రవణము గావించెడివారు. యజ్ఞ యాగాదులు చేసెడివారు. తాము గ్రహించిన ధర్మములను, నీతులను నిత్య జీవనమున ఆచరించెడివారు. తాము ఆచరించిన ధర్మములను, నీతులను ప్రజలకుపయోగార్థము ఉపదేష్టలుగా మారి బోధించెడివారు. మహర్షులు ఆచరించిన వాటినే బోధిస్తారని తెలియజేయు ఒక కథ ప్రచారములో ఉన్నది.

పూర్వము ఒక మహర్షి ఉండేవారు. ఆయన ప్రతిరోజూ సాయంకాలము ధర్మోపదేశములు గావించెడివారు. ఒకనాడు ఒక స్త్రీ తన కొడుకును తీసుకుని ఆయన దగ్గరకు వచ్చింది. స్వామీ! ఈ అబ్బాయి నా కొడుకు. ప్రతిరోజూ అతిగా బెల్లం తింటాడు. ఎంత చెప్పినా వినడం లేదు. మీరు చెబితే వింటాడని మీ దగ్గరికి తీసుకువచ్చాను అని పలికింది. అది విని మహర్షి ఆలోచనలో పడ్డాడు. కాసేపు అయిన తరువాత ఆ స్త్రీతో – 'తల్లీ! వారము రోజులు గడిచిపోయిన తర్వాత వచ్చినట్లైతే మీ అబ్బాయికి నచ్చచెబుతాను అని పలికాడు. మహర్షి మాటలు విని ఆ స్త్రీ తిరిగి మహర్షి దగ్గరకు వచ్చింది. మహర్షి ఆ పిల్లవాడికి అతిగా బెల్లము తినడం వలన కలుగు కష్టనష్టాలను వివరించి అతిగా బెల్లమును తినవద్దని బోధించాడు. అలాగేనని ఆ పిల్లవాడు తలూపాడు. వెళ్ళిపోతున్న సమయమున ఆ స్త్రీ మహర్షితో – స్వామీ! ఈ ఉపదేశమును మొదటిసారి వచ్చినప్పుడే ఇవ్వవచ్చును గదా! దీనికోసం వారం రోజులు గడువును ఎందుకు తీసుకున్నారు అని ప్రశ్నించింది. దానికి సమాధానమిస్తూ మహర్షి – తల్లీ! నీవు అన్నట్లు ఈ ఉపదేశమును ఆనాడే ఇవ్వవచ్చును. కాని నాలో కూడా ఒక లోపమున్నది. నేను కూడా మీ అబ్బాయి లాగానే బెల్లమును అధికముగా తీసుకుంటాను. నేను తింటూ తినవద్దని ఎలా ఉపదేశింపగలను? అందుకే వారము రోజుల గడువును తీసుకున్నాను. ఈ వారము రోజులలో నేను బెల్లమును తినడము మాని వేశాను. దాని

వలన కలుగు ఫలితములను మీ అబ్బాయికి ఉపదేశించాను' అని పలికాడు.

పూర్వకాలమున విద్యార్థులు గురుకులములకు వెళ్ళి విద్యనభ్యసించెడివారు. గురుకులములందు విద్య నభ్యసించు విద్యార్థులు బ్రహ్మచర్య వ్రతమును పాటించవలెనన్న నియమము ఉండేది. విద్యాధ్యయనము ముగిసిన తరువాత సమావర్తన మహోత్సవములు జరిగెడివి. సమావర్తనము అనగా విద్యార్థులు విద్యను పూర్తి గావించుకున్న తరువాత గురువుగారి అనుమతితో తమ గృహములకు తిరిగి వెళ్ళు సమయమున జరుగునొక వేడుక.

ప్రజాపతికి దేవతలు, దానవులు, మానవులు అను ముగ్గురు తనయులున్నారు. వారు ఉపనయనము అయిన తర్వాత విద్యాధ్యయనము కొరకు తండ్రి గారి గురుకులమునందు చేరారు. విద్యాధ్యయనము పూర్తయింది. సమావర్తన మహోత్సవ సందర్భముగా ప్రజాపతి దేవతలకు 'ద' యను అక్షరమును బోధించారు. కొంత సమయము గడిచిన తరువాత ప్రజాపతి దేవతలను ప్రశ్నించాడు. దేవతలారా! మీకు 'ద' యను అక్షరోపదేశము గావించాను. ఆ అక్షరము యొక్క విశేషతను మీరు అర్థము చేసుకున్నారా? అందుకు దేవతలు సమాధానముగా ఆచార్యా! మీరుపదేశించిన 'ద' అక్షరము యొక్క అర్థమును గ్రహించాము. ఈ అక్షరము 'దమము'ను తెలియచేయుచున్నది. దమము అనగా బాహ్యేంద్రియ నిగ్రహము, తపము, సాధనము మున్నగు వాటి వలన కలుగు కష్టములను భరించుట. స్వర్గలోకములు భోగభరితములు. భోగలాలసత్వమునకు అలవాటు పడినవారుపుణ్యము క్షీణించగానే స్వర్గ లోకము నుండి చ్యుతము కాక తప్పదు. కనుక భోగ లాలసతను త్యజించి 'దమము'ను పాటించండి అని పలికారు. దేవతల సమాధానమునకు సంతుష్టుడైన ప్రజాపతి వారిని ఆశీర్వదించాడు.

ప్రజాపతి దేవతలకు ఉపదేశించడం దానవులు గమనించారు. వారు ప్రజాపతిని దర్శించుకొని వందనమాచరించి ఆచార్యా! మీరు దేవతలకు ఉపదేశించడం మేము గమనించాము. మాకు కూడా ఉపదేశించి మమ్ములను కృతార్థులను గావించండి అని ప్రార్థించారు. వారి ప్రార్థనలకు ప్రసన్నుడైన ప్రజాపతి వారికి ఏకాక్షరోపదేశము గావించాడు. వారుపదేశించిన అక్షరము –'ద'. కొద్ది సమయము గడిచిన తర్వాత ప్రజాపతి దానవులతో దానవుల్లారా! మీకు 'ద' యను అక్షరమును ఉపదేశించాను కదా! దానినుండి మీరు ఏమైనా గ్రహించగలిగారా? అని ప్రశ్నించాడు. దానవులు జవాబిస్తూ – ఆచార్యా! మీరుపదేశించిన 'ద' అక్షరము నుండి దయాగుణమును అలవరచుకొనమని మీరు మాకుపదేశించారు. స్వభావరీత్యా దానవులు కోపస్వభావులు. హింసా పరాయణులు. నిర్దయులు. ఈ దుర్గుణముల నుండి వారు బయట పడవలెనన్న దయాగుణము ఒక్కటే సహాయపడుతుంది. దయాగుణము ద్వారానే దుష్కర్మలను విడిచి పాపమయ జీవితము నుండివిముక్తులు గావడము జరుగుతుంది అని బోధించారు అని పలికారు. దానవుల సమాధానమునకు ప్రజాపతి ఆనందించి వారిని ఆశీర్వదించాడు.

ప్రజాపతి దేవతలకు, దానవులకు ఉపదేశము గావించుటను గమనించిన మానవులు ప్రజాపతిని దర్శించుకొని గురువర్యా! మాకు కూడా ఉపదేశించండి అని ప్రార్థించారు. ప్రజాపతి వారికి 'ద' యను అక్షరము ఉపదేశించారు. కొంతకాలము గడిచిన తరువాత ప్రజాపతి మనవులను – నేను ఉపదేశించిన అక్షరము నుండి మీరేం గ్రహించారు అని ప్రశ్నించాడు. దానికి మానవులు ఆచార్యా! మీరుపదేశించిన 'ద' అక్షరము నుండి దాన గుణమునకు అలవాటు పడవలెనని గ్రహించాము. మానవులకు సహజముగా ధనార్జన యందు ఆసక్తి మెండు. ధనముతో పాటు కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములను దుర్గుణములు వచ్చి చేరుతాయి. దాని ఫలితముగా మానవుడు పెడమార్గము వైపు పయనము సాగిస్తాడు. అధోగతి పాలవుతాడు. వీటినుండి విముక్తులు కావలెననుకుంటే దాన గుణమును అలవరచుకోవాలి. ఆర్జించిన ధనంలో సంసార వ్యయమునకు కొంత భాగము పోగా, మిగిలిన ధనమును దానము చేయాలి. దానివలన సమస్త సుఖములు ప్రాప్తిస్తాయి. ఆత్మానందము కలుగుతుంది అని పలికారు. మానవుల సమాధానమునకు సంతుష్టుడై ప్రజాపతి వారిని ఆశీర్వదించాడు.

భోగములకు అలవాటు పడిన దేవతలు దమమును పాటించవలయునని, నిత్యము దుర్గుణములవైపు ఆకర్షితులవుతున్న దానవులు దయాగుణము పాటించవలయునని, ధన వ్యామోహముతో పాప పుణ్యములను మరచిపోతున్న మానవులు దానగుణమును అలవరచుకొనవలయునని, అలా చేసినందువలన సమస్త పాపములకు దూరమై సుఖమయ జీవితమును గడిపెదరన్న భావనతో ప్రజాపతి వారందరికీ ఏకాక్షరోపదేశము గావించాడు. ఈ మూడు గుణములను ఆచరణ లోనికి తెచ్చుకొని జీవితమును సార్థకము చేసుకుందాము.



# గురు పూర్ణిమ

- డా. దేవులపల్లి పద్మజ

**గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుదేవో మహేశ్వరః**
**గురుసాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః**
**సదాశివ సమారంభాం శంకరాచార్య మాధ్యమాం**
**అస్మదాచార్య పర్యంతాం వందే గురుపరంపరాం !!**
**తల్లి జన్మనిచ్చి చల్లగా పెంచును**
**తండ్రి వెంట నిలచి దన్ను నిచ్చు**
**గురువు విద్యనేర్పి గుణములు గరపును**
**ప్రకృతి పలుకునిచ్చు ప్రజ్ఞ మనకు !!**

మానవ జీవిత చరితార్థానికి, భగవదర్శనానికి బాటలు వేసేవారు గురువులు. గురుపూర్ణిమ, ఆషాఢ పూర్ణిమ, వ్యాసపూర్ణిమ ఏదైనా పవిత్రమైనదే. ఈ రోజు వ్యాసభగవానుని జన్మదినము. అష్టాదశ పురణాములను మనకు అందించిన మహనీయుని జన్మదినం కారణంగా గురుస్థానములో ఆ వ్యాసభగవానుని స్మరిస్తూ చేసుకునే పవిత్రమైన రోజు. ఆషాడ పూర్ణిమను గురుపూజతో ఉత్సవం చేయటం మన భారతీయ సంస్కృతిలో భాగమైనది. గురువుని త్రిమూర్తిస్వరూపంగా భావిస్తాము. మానవ చరిత్రలోనే అపూర్వమైన ఆధ్యాత్మిక పర్వదినంగా నిలచినది వ్యాస జన్మతిథి. ముందుగా ఈ తిథికి సంబంధించిన ఒక చక్కని కథను తెలుసుకుందాము.

ఒక శిష్యుడు తన గురువుగారిని వెదుకుతూ చివరికి ఆయనను కలుసుకుంటాడు. కొంత కాలం తరువాత శిష్యుడు సెలవు తీసుకుంటూ తిరిగి ఎప్పుడు దర్శనమిస్తారు అని గురువుగారిని అడుగుతాడు. అప్పుడు గురువుగారు యిలా చెబుతారు --

**శృణు విప్ర తపేచ్చా చేత్ దర్శనార్థం తదా త్వయా**
**పూజనీయో విశేషేణ, కథంవాచయితా స్వయం !**

బ్రాహ్మణోత్తమా! నీవు నన్ను దర్శించాలని

కూతూహలంగా ఉన్నావు గనుక విను. ఎవరైనా పురాణగాథలను, వేదగాథలను వ్యాఖ్యానం చేస్తూ వాటి రహస్యాలను ఉపదేశిస్తుంటారో వారే నా నిజ స్వరూపం అని తెలుసుకుని, అతనిని సాక్షాత్తు వ్యాసమూర్తిగా భావించి పూజింపవలసినది. నేను ఎల్లప్పుడూ ఇటువంటి పౌరాణికులందరిలోనూ ఉంటాను అని అంటారు. అందువలన పౌరాణికులు, కథకులు, బోధకులు గురువులుగా పిలవబడతారు. పురాణాలలో నిగాఢంగా నిహితం చేయబడిన విషయాలను మానవజాతి జ్ఞానం సంపాదించాలంటే వ్యాస మహర్షి అనుగ్రహం అవసరము. అందుచేత మనం వ్యాస పూర్ణిమ నాడు పౌరాణికులను, మన గురువులను ధూపదీప నైవేద్యాలతో పూజించి తగిన విధంగా సత్కరించాలి. గురువులకు గురువుగా ఖ్యాతి గడించిన మహనీయుడు వ్యాసమహర్షి. అందువలన లోకంలో అందరూ శ్రీ వ్యాసమహర్షిని పూజించి, గౌరవించాలి. హిందూమతంలోభగవంతునితెలుసుకోవటానికిముఖ్యమైన ఆలంబనగా గురువును భావిస్తారు. తమ జీవితాలకు సరైన మార్గ నిర్దేశనం చేయటానికి కావలసిన సాధన సంపత్తి గురువు ద్వారా లభిస్తుందని అందరి విశ్వాసం. గురువులుగా ప్రసిద్ధిగాంచిన , ఆదిశంకరులు, దత్తాత్రేయుడు, శ్రీషిరిడీ సాయినాథుడు మొదలైనవారిని ఈరోజు కొలుస్తారు. ఈ గురుపూర్ణిమ ఉత్సవాన్ని శ్రీ ఆదిశంకరులే ప్రారంభించారని కూడా చెబుతారు. అజ్ఞానమనే చీకటిని తొలగించి, జ్ఞానమనే జ్యోతిని వెలిగించేవారు గురువు. మనం జన్మించిన తరువాత మన కన్న తల్లిదండ్రులు ప్రథమ గురువులు కాగా, మిగిలిన జీవితం మొత్తం మార్గనిర్దేశనం చేసేవారు గురువు.

గురుపూర్ణిమ నాడు ఉదయమే మేల్కొంచి, శుచియై తమ ఇంటిలోని పూజామందిరాన్ని శుభ్రం చేసుకోవాలి. ఇంటి ముఖద్వారానికిచక్కటిమామిడితోరణాలనుఅలంకరించాలి. ఒక కొత్త వస్త్రాన్ని పరచి అందులో బియ్యం పోసి, మధ్యలో తమలపాకు నుంచి, వాటి మధ్యలో గురు ప్రతిమనుంచాలి. ఉత్తరం వైపుగా కంచు దీపం వెలిగించి, తులసిమాల ధరించి పూజ నిర్వహించాలి. షోడశోపచారములతో పూజలు నిర్వహించి, తీర్థప్రసాదములను స్వీకరించాలి. ఈ విధంగా నిర్వహించటం వలన సకల ఈతి బాధలు తొలగిపోతాయని నమ్మకం.

ఈ రోజు దేవాలయాలలో కూడా విశేష పూజలు నిర్వహిస్తారు. ఉదయం పాలాభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తారు. రోజంతా గురుప్రార్థనలు చేస్తారు. సాయంకాలం చక్కటి ఆధ్యాత్మిక ప్రసంగాలు ఏర్పాటు చేస్తారు. భక్తులందరూ ఎంతో భక్తిశ్రద్ధలతో పాల్గొని ఆనంద పరవశులౌతారు. శ్రీ గురుచరిత్ర, సాయిచరిత్ర వంటి పుస్తకాలను, ఉడకబెట్టిన శెనగలను అందరికీ పంచిపెడతారు.

పూర్వకాలంలో గురుకులాలుండేవి. శిష్యులందరూ ఈరోజు అమితమైన భక్తిశ్రద్ధలతో గురువును పూజించి వారి ఆశీర్వాదాన్ని స్వీకరించేవారు. గురువులు కూడా శిష్యులను తమ కన్న పిల్లలవలె చూసుకునేవారు. అందుకే ఆనాటి గురు శిష్య పరంపర, సంబంధ బాంధవ్యాలు అవిచ్ఛిన్నంగా కొనసాగేవి. కాని నేటి తరంలో అటువంటి స్థితిగతులు కానరావటం లేదు. సాక్షాత్తు దేవదేవుడైన శ్రీరాముడు విశ్వామిత్రుని వద్ద విద్యను అభ్యసిస్తారు. శ్రీకృష్ణుడు కూడా తన చిన్నతనంలో గురు ఆశ్రమంలో విద్యనభ్యసించి, గురువుకు గురుదక్షిణ చెల్లిస్తాడు. ఆయనకు ఆసాధ్యమైనది ఏదీ లేకపోయినప్పటికి, సర్వం ఆయన సృష్టి అయినప్పటికి, ఆచారాలను పాటించాలని, అందరకూ మార్గనిర్దేశనం చేయటానికి ఆవిధంగా చేస్తాడు.

**కామధేనువు మరి కల్పవృక్షము కూడ**
**గురువు మనసునందు కొలువుయుండు**
**గురువునకు సరియగు గురుదేవులే సుమా**
**ప్రకృతి పలుకునిచ్చు ప్రజ్ఞ మనకు !!**

సమస్త ప్రకృతిలో నిండి నిబిఢీకృతుడై జానానందాన్ని, ప్రేమను పంచటానికి గురువు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారు. ఆ మహత్తర జ్ఞానాన్ని అందుకోవటానికి శిష్యులకు చిత్తశుద్ధి అవసరం. మనిషిలో గుప్తంగా దాగియున్న జ్ఞానాన్ని, విశేష శక్తియుక్తులను వెలికితీసి మార్గనిర్దేశనం కలిగించేవాడు గురువు. ''గురువు లేనివాడు బరువగు నేలకు''.

**తల్లి దండ్రి గురువు ధరణిలో పూజ్యులు**
**మరువకున్న దైవ కరుణ కలుగు**
**మరచిపోవువారు పరమ హీనులు సుమా**
**ప్రకృతి పలుకునిచ్చు ప్రజ్ఞ మనకు !!**

మనమందరమూ గురువుకు తగిన గౌరవమర్యాదలు కలిగిస్తూ, వారి అడుగుజాడలలో పయనిద్దాం. విశ్వమానవ సౌభ్రాతృత్వానికి బాటలు వేద్దాం. గురువులు కూడా సత్ప్రవర్తన కలిగి, ఉన్నత ఆశయాలతో, నిష్కల్మష ప్రేమనందిస్తూ శిష్యులద్వారా లోకోన్నతికి కృషి చేయాలి. అందరం కలసి ఈ శుభదినాన ప్రతిన చేద్దాం. విశ్వమానవ శాంతికి బంగారు బాటలు వేద్దాం.

**ఓం శ్రీ గురుభ్యోనమః**

# శ్రీ వేంకటేశ సహస్ర నామావళి

సేకరణ : కె.వి.రాఘవాచార్యులు

గత సంచిక తరువాయి

## 211. స్వామితీర్థ నివాసకాయ నమః

ప్రపం చములోని సరస్సులన్నింటికి స్వామినియైన స్వామిపుష్కరిణి తీరమున నివసించి యున్న వేంకటేశునకు నమస్కారము.

పూర్వము బ్రహ్మావర్త దేశమున (ఆర్యావర్తము) ప్రవహించుచున్న సరస్వతీ నది యొక్క అధిదేవత యై న సరస్వతీ దేవి గంగానది కంటె తీర్థరాజములలో శ్రేష్ఠత్వమును, స్వామిత్వమును కోరి తపస్సు చేయుచుండెను. ఒకనాడు పులస్త్య మహర్షి సరస్వతీ నదీతీరమున తపస్సు చేయుటకై వచ్చాడు. సరస్వతీ దేవి పుత్ర భావముచే (పులస్త్యుడు. బ్రహ్మ కుమారుడగుటచే) పులస్త్య మహర్షిని పూజించ లేదు. అతిథిగా గౌరవించలేదు. అందుకు పులస్త్యుడు కోపించి సరస్వతీ నీవు ఏ కోరికతో తపస్సు చేయుచుంటివో ఆ కోరిక నదీ రూపమున నీకు ఎన్నడూ సిద్ధింపదు. విష్ణు పాదోద్భవ యైన గంగానదియే నదులన్నింటికి స్వామిత్వమును పొందగలదు, తీర్థరాజముగ గౌరవింపబడును అని శపించాడు.

పులస్త్యుని మాటలు విని సరస్వతీ దేవి కోపించి పులస్త్యుడా! నీ వంశము రాక్షస వంశము అగు నని శపించింది.

మరల సరస్వతీదేవి నదులలో గంగానది కంటె అధికమైన శ్రేష్ఠత్వమును, స్వామిత్వమును కోరి తీవ్రమైన తపస్సు చేసింది. శ్రీమన్నారాయణుడు ఆమె తపస్సుకు సంతుష్టి పొంది ఒక శుభదినమున ప్రత్యక్షమైనాడు. అంత సరస్వతి భగవంతునికి నమస్కరించి దేవా! పురుషోత్తమా! పులస్త్యుని శాపముచే నా కోరిక విఫలమైంది. భూలోకమున నాకు నదీ శ్రేష్ఠత్వము, తీర్థ స్వామిత్వము గలుగునట్లుగా వరము కోరుచున్నాను. ఆ వరమును ప్రసాదించమని ప్రార్థించింది.


నదీ రూప సరస్వతి ప్రార్థనను విని నారాయణుడు సరస్వతీ! పులస్త్యుని శాపము నీ నదీ రూపమునకే గాని పుష్కరిణి (కోనేరు) రూపమునకు కాదు. కనుక నీవు వేంకటాద్రికి వెళ్ళి అక్కడ పుష్కరిణీ (తామరల కొలను) రూపమున వుండుము. నేను నీకు దక్షిణ భాగమున నివసించెదను. ప్రతి సంవత్సరం ధనుర్మాసమున శుక్ల పక్షమున ద్వాదశినాడు అరుణోదయ కాలమున (సూర్యోదయమునకు పూర్వం) సర్వ తీర్థములు తమ పాప విమోచనమునకై నీయందు సంగమించును. ఆ తీర్థములన్నియు నీకు సేవకులై నిన్ను తీర్థ రాజముగా అభిషేకించును. నీవు స్వామిపుష్కరిణి అను పేరుతో కీర్తింపబడుదువు అని వరమొసంగి అదృశ్యుడయినాడు. అనంతరం సరస్వతీ నది బ్రహ్మావర్త దేశమున అదృశ్యమై వేంకటాద్రిపై స్వామిపుష్కరిణిగా వెలసింది. ఈ కలియుగ ప్రారంభములో భగవన్నారాయణుడు అర్చామూర్తిగా శ్రీనివాసుడను పేరుతో స్వామిపుష్కరిణికి దక్షిణమున వెలసినాడు.

వేంకటాద్రిపై నున్న సరోవరమునకు సమస్త తీర్థములకు స్వామిని యగుటచే "స్వామినీ చాసౌ పుష్కరిణీ చ – సమస్త తీర్థములకు స్వామిని అను వ్యుత్పత్తి చేత స్వామిపుష్కరిణి అను పేరు సార్థకముగ వున్నది. సమస్త తీర్థములకు స్వామిని అయినందున పూర్వులు దీనిని స్వామిపుష్కరిణి అని పిలుచుచున్నారు. దీనికి దక్షిణ దిక్కున భగవన్నారాయణుడు అర్చామూర్తిగ శ్రీనివాసుడను పేరుతో వెలసినాడు. భగవంతుని సాన్నిధ్యముచే స్వామిపుష్కరిణి ఇతోధికమగు మహిమతో వర్ధిల్లుచున్నది. సరస్వతీనదికి వరమిచ్చుటచే విష్ణుదేవుడు వైకుంఠమును వదిలిపెట్టి వేంకటాద్రిపై స్వామిపుష్కరిణీ తీరమున లక్ష్మీదేవితో విహరించుచున్నాడు. శ్రీవేంకటేశ 108 నామములలో 115. త్యక్త వైకుంఠ లోకాయ నమః – వైకుంఠమును వదలి వేంకటాద్రికి వచ్చిన వేంకటేశునకు నమస్కారము – అను నామము గలదు.

## 212. లక్ష్మీ సరః కేళి లోలాయ నమః

తిరుచానూరులో వున్న పద్మసరస్సులో పద్మావతితో (అలమేలుమంగతో) లక్ష్మీదేవితో జలక్రీడలందు ఆసక్తి కలవాడు అగు వేంకటేశునకు నమస్కారము.

వినా వేంకటేశం న నాథో న నాథః
సదా వేంకటేశం స్మరామి స్మరామి





అన్ని నామాలూ నీవే అయిన
ఓ వేంకటేశా! నీకు నమస్కారము

భృగు మహర్షి త్రిమూర్తులలో సత్వగుణ సంపన్నుడు ఎవరు? అను పరీక్ష చేయువేళలో వైకుంఠమునకు భృగువు వెళ్ళి యోగ నిద్రలో నున్న విష్ణువును చూచి కోపించి, అతని వక్షః స్థలమును తన కాలితో తన్నినాడు. అంత విష్ణువు భృగువుపై కోపము ప్రదర్శించక శాంతముతో అతనికి అర్ఘ్య పాద్యాదులు ఇచ్చి గౌరవించి పంపినాడు. భృగువు దుశ్చర్య కంటె అతనిని గౌరవించి పంపిన విష్ణువు యొక్క సాత్విక భావము బాధింపగా లక్ష్మీదేవి విష్ణుదేవునితో ప్రణయ కలహము పెట్టుకొని వైకుంఠమును వీడి భారత దేశములోని కరవీర పురము (మహారాష్ట్రము లోని నేటి కొల్హాపూర్) చేరింది. పిమ్మట విష్ణుదేవుడు లక్ష్మి లేని వైకుంఠముపై విరక్తి పొంది సువర్ణముఖి నది సమీపమున నున్న వేంకటాద్రి నివాసి అయినాడు. శ్రీనివాసుడను పేరుతో వకుళామాలికచే సేవింపబడినాడు. ఆమె రాయబారము ఫలముగ శ్రీనివాసుడు ఆకాశరాజు కమార్తె పద్మావతిని (పూర్వ జన్మలో వేదవతిని) వివాహమాడి గృహస్థ జీవితము గడిపినాడు. కొంత కాలమునకు లోకయాత్ర సఫలమగుటకు, భక్తుల కోరికలను తీర్చుటకు తనవివాహమునకై కుబేరుని వద్ద చేసిన అప్పు తీర్చుటకు, లక్ష్మీదేవి తన చెంత వుండవలెనని నిశ్చయించుకొన్నాడు.

శ్రీనివాసుడు కరవీరపురము చేరి అక్కడ అగస్త్య మహర్షి ప్రతిష్ఠించిన లక్ష్మీదేవి విగ్రహమును కొంత కాలము పూజించినాడు. శ్రీనివాసుడు కరవీరపురము చేరునప్పటికి లక్ష్మీదేవి కరవీర పురమును వీడి పాతాళ లోకమున కపిలముని ఆశ్రమము చేరింది. భక్తుడు, హితుడు అగు కపిల మునిచే పూజింప బడుచు కపిల ముని ఆశ్రమంలో

నివసించి యున్నది. ఒకనాడు కరవీరపురములో నున్న శ్రీనివాసునికి ఆకాశవాణి లక్ష్మీదేవిని చూడగోరుచున్న విష్ణుదేవా! మన్నించు. నీవు ఇచటి నుండి దక్షిణ దిశగా ప్రయాణము చేసి సువర్ణముఖరీ నదిని చేరుము. ఆ నదీ తీరమున . ఉత్తర దిశలో ఒక సరస్సును నిర్మించి, అందు బంగారు పద్మములను దేవలోకము నుండి తెప్పించి నాటుము. ఆ స్వర్ణ కమలములతో లక్ష్మీదేవిని పూజించుచు లక్ష్మి మంత్రము జపించుచు ఆ సరస్తీరమున పంద్రెండు సంవత్సరములు తపస్సు చేయుము. అప్పుడు లక్ష్మీదేవి నీకు ప్రత్యక్షమగును. నీ కోరిక నెరవేరును అని పలికింది.

ఆకాశవాణి మాటలను వినిన రాజకుమారుని వేషమున నున్న శ్రీనివాసుడు (విష్ణువు ) కరవీర పురము వీడి దక్షిణ దిశగా ప్రయాణము చేసి సువర్ణముఖరీ నదిని చేరినాడు. ఆ నదీ తీరమున ఉత్తర దిశలో బల్లెముతో భూమిని త్రవ్వి చిన్న సరస్సును నిర్మించినాడు. అది నీటితో నిండింది. పిమ్మట విష్ణువు వాయుదేవుని పిలిచి, దేవలోకము నుండి స్వర్ణకమలములను తెప్పించి సరస్సులో నాటినాడు. కొంతకాలమునకు పూలు పూసినవి. ఆ స్వర్ణకమలములు ఎల్లప్పుడు వికసించి యుండుటకు కమలాప్తుడగు సూర్యుని విగ్రహమును తూర్పు దిశలో ప్రతిష్ఠించినాడు. విష్ణుదేవుడు లక్ష్మీదేవి అనుగ్రహమును పొందుటకై ఆ పద్మ సరోవరములో నిత్యము స్నానము చేసి, అందలి స్వర్ణ కమలములతో లక్ష్మీదేవిని పూజించుచు, లక్ష్మీ మంత్రము జపించుచు తపస్సు చేసినాడు. ఇట్లు పంద్రెండు సంవత్సరములు గడచి పోయినవి.

పదమూడవ యేట మార్గశిర మాసమున శుక్లపక్షమున పంచమీ శక్రువారం నాడు ఉత్తరాషాఢ నక్షత్రమున మైత్రము అనెడు శుభ ముహూర్తమున లక్ష్మీదేవి విష్ణుదేవుని తపస్సునకు ఫలముగా పద్మసరోవర మధ్యనున్న సహస్రదళ పద్మమున ఆవిర్భవించింది. అంతట అందరు చూచుచుండగా లక్ష్మీదేవి తన చేత నున్న కల్హార మాలను తీరమున నున్న విష్ణు దేవుని మెడలో వేసి నిలుచుంది. తత్ క్షణమే విష్ణుదేవుడు ఆమెను వక్షఃస్థలమున నిలిపికొన్నాడు. శ్రీనివాసుడను పేరు సార్థకమయింది.

శివుని వివాహమాడుట కొరకు పార్వతి తపస్సు చేసింది. తత్ ఫలముగా ఆమె శివుని అర్ధాంగి అయింది. విష్ణుదేవుడు ప్రణయ కలహము పెట్టుకొని తనపై అలిగి వైకుంఠమును వీడి కపిలముని ఆశ్రమమున వున్న లక్ష్మీదేవి అనుగ్రహమును సంపాదించి మరల ఆమెను పొందుటకు పంద్రెండు ఏండ్లు తపస్సు చేసినాడు. తపమునకు ఫలముగా లక్ష్మీదేవిని పొంది, వక్షఃస్థలమున నిలిపికొని శ్రీనివాసుడను పేరుతో ప్రఖ్యాతిని పొందినాడు. విష్ణుదేవుడు సత్వగుణ సంపన్నుడు కాగా శివుడు తమోగుణ సంపన్నుడు.

తిరుచానూరులో నున్న పద్మసరోవరములో విష్ణుదేవుడు నిత్యము స్నానము చేసి పంద్రెండు యేండ్లు లక్ష్మీదేవిని పొందుటకు తపస్సు చేసి అభీష్టసిద్ధిని పొందినాడు. లక్ష్మీదేవితో కలిసి పద్మ సరోవరములో జలక్రీడలు ఆడలేదు. పద్మ సరోవరములో లక్ష్మితో జలక్రీడలు ఆడుటకు ఆపేక్ష గలిగియున్నాడు. అంత మాత్రమే. విష్ణుదేవుని ఈ కోరిక ఫలించినట్లు లేదు! లక్ష్మిసరస్సు అనగా పద్మసరస్సు, పద్మసరోవరం అని అర్థం చెప్పుకోవాలి. లక్ష్మిసరః కేళిలోలుడైన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

(సశేషం)

ధారావాహికం



వరాహ పురాణాంతర్గతం

# శ్రీ వేంకటాచల మాహాత్మ్యం

డా॥ విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి, 9491579452

**గత సంచిక తరువాయి**

## 4. ధర్మసంగ్రహం :

ఏ విధంగానైనా మానవుడు తన దేహాన్ని దృఢంగా చేసుకొని ఎల్లప్పుడూ వేంకటేశ్వరుని కైంకర్యం చేయాలి. భగవంతుని సేవించటమే జీవుని కర్తవ్యం. మానవజన్మ వచ్చింది అందుకే. మానవుడిగా పుట్టి కూడా భగవంతుని సేవించనివాడు స్వామిద్రోహి అవుతాడు. ఇందుకు సందేహం లేదు. కావున వివేకియైనవాడు – నిత్య నైమిత్తిక కర్మలను, శాస్త్ర విరుద్ధం కానివి, భగవంతునికి ప్రీతికరమైన కర్మల నాచరించాలని పూర్వం వేంకటాచలంపై వరాహస్వామి భూదేవికి చెప్పాడు.

శరీరధారణం, భోగం, జ్ఞానం, సామర్థ్యం, క్షేత్రం, గృహం, ధనం, ధాన్యం మొదలైన తన సర్వస్వాన్ని శ్రీవేంకటనాథునికి సమర్పించి వెంటనే ఆయన ఆధీనం చేయాలి. బుద్ధిమంతుడు ఈ జగత్తును అశాశ్వతమైనదిగా దర్శిస్తాడు. పాపాల నాచరించేవాడు నరకంలో పడతాడు. ఇందుకు సందేహం లేదు. పుణ్యకర్మల నాచరించేవాడు సుఖాన్ని పొందుతాడు. ఇది నిశ్చయం.

కావున బుద్ధిమంతుడైనవాడు ఎల్లప్పుడూ మనస్సులో వేంకటేశ్వరుని చింతించాలి, ధ్యానించాలి, స్మరించాలి. గురువులను సేవిస్తూ ధర్మశాస్త్రాల నభ్యసించాలి. యోగి జితేంద్రియుడై తన భార్యయందే రమించాలి. ఎల్లప్పుడు సాధుసజ్జనులను అడిగి తన హితం గురించి తెలుసుకోవాలి. వేదార్థాలను విచారించాలి. ఎప్పుడూ వేదాంతాన్ని అధ్యయనం చేయాలి. పెక్కు మాటలేల? శాస్త్ర విహితమైన కర్తవ్య కర్మలను వదలరాదు. నిషిద్ధ కర్మల నాచరించరాదు. ఇదే సకల ధర్మ సార సంగ్రహం.

## 5. శ్రీవేంకటేశ్వర అష్టోత్తర శతనామావళి :

శౌనకాది మునులు సూత మహర్షిని 'ఓ సూత మహర్షీ! సర్వ శాస్త్రార్థ విశారదా! వేదవేదాంగ పారంగతా! శ్రీమద్వేంకట నాయకుడు ఏ విధంగా ఆరాధిస్తే వెంటనే ప్రసన్నుడై సర్వాభీష్టాలను ప్రసాదిస్తాడో ఆ విధానాన్ని మాకుపదేశించండి'అని ప్రార్థించారు. అప్పుడు సూతమహర్షి క్షణకాలం ధ్యానించి 'ఓ మునులారా! చెబుతాను వినండి' అని ఇలా చెప్పనారంభించాడు.

పూర్వం ఆదిశేషుడు మహాత్ముడైన కపిలునికి శ్రీవేంకటేశ్వర అష్టోత్తర శతనామావళిని ఉపదేశించాడు. అది పరమ రహస్యమైనది, భగవంతునికి ప్రీతి కలిగించేది, పుణ్యప్రదమైనది, పవిత్రమైనది, పాపపరిహారకమైనది. పూర్వం బ్రహ్మదేవుడు ఆకాశగంగ (స్వర్గగంగ) నుండి బంగారు

పద్మాలు తెచ్చి, మునులు పూజించిన దివ్యములైన అష్టోత్తర శతనామాలతో శ్రీవేంకట నాయకుని అర్చించి తన అభీష్టాన్ని పొందాడు. కాబట్టి మీరు కూడా ఈ నామాలతో, పద్మాలతో శ్రీవేంకటేశ్వరుని చక్కగా పూజించండి. ఆ శేషనగాధీశుని మనస్సుకుల్లాసం కలిగించే శ్రీవేంకటాద్రివాసుని అష్టోత్తర శతనామాలను చెబుతాను. ఈ నామావళి మానవులకు ఆయురారోగ్యాలను, ధనధాన్యాలను, సుఖాన్ని ప్రసాదిస్తుంది. విశేషంగా జ్ఞానాన్ని, గొప్ప ఐశ్వర్యాన్ని కలిగిస్తుంది.

శ్రీవేంకటేశుని పదాంకితాలైన ఈ దివ్య నామాలతో శ్రీనివాసుని అర్చించాలి. ఈ అష్టోత్తర శతనామాలకు బ్రహ్మదేవుడు ఋషి. అనుష్టుప్ ఛందస్సు. వేంకటేశ్వరుడు దేవత. నీల గోక్షీర సంభూతుడు బీజం. శ్రీనివాసుడు శక్తి. వేంకటాధీశ్వరుడు హృదయం. అభీష్టార్థ సిద్ధిని పొందటంలో వినియోగం.

అమృతైశ్వర్య ప్రదాత, పాపాలను దహించేవాడు, శేషాద్రి నిలయుడైన వేంకటేశ్వరునికి నమస్కారం. ధర్ముడైన వృషునికి దర్శనమిచ్చిన విష్ణువుకి, అంజనాద్రీశునికి, వృషాద్రిపతికి నమస్కారం. మేరుపర్వత పుత్రుడైన వేంకటాద్రి కధిపతియైన వేంకటేశునికి, స్వామిపుష్కరిణీతీర్థంలో నివసించే శ్రీనివాసునికి నమస్కారం. కుమారస్వామిచే సేవించబడేవానికి, ఇంద్రునికి దర్శనమిచ్చిన వానికి, సువర్చలా కుమారుడైన విష్వక్సేనునికి సైన్యాధిపత్యాన్ని ప్రసాదించిన వేంకటేశునికి నమస్కారం. శ్రీరాముడు, పద్మనాభుడు, ఎల్లప్పుడూ వాయుదేవునిచే స్తుతించబడేవాడు, వైకుంఠ లోకాన్ని వదిలినవాడు, శ్రీవేంకటాద్రిలోని మనోహరాలైన లతానికుంజాల్లో లక్ష్మీదేవితో పాటు విహరించేవాడు, హరిచందన వృక్షాలతో నిండిన శ్రీవేంకటగిరికి స్వామియైన శ్రీవేంకటేశ్వరునికి నమస్కారం.

శంఖ మహారాజుకు దర్శనమిచ్చినవాడు, ఉపరిచర వసువును పాతాళం నుండి రక్షించినవాడు, అర్చారూపంగా వెలసిన శ్రీకృష్ణునికి ఎల్లప్పుడూ నమస్కారం. సముద్రతనయా పరిష్వంగం గల వక్షఃస్థలం గలవాడు, 'వేంకట' నామధేయుడు, సనకాది మహాయోగులచే పూజింపబడే వేంకటేశునికి నమస్కారం. దేవజిత్తు మొదలైన ప్రముఖ రాక్షస సమూహాలను ధ్వంసం చేసినవాడు, శ్వేతద్వీపంలో నివసించే ముక్త పురుషులచే పూజింపబడే పాదపద్మయుగళం కలవాడు, ఆదిశేషుని పర్వతరూపంగా అవతరింపజేసినవాడు, గరుడునిచే క్రీడాపర్వతాన్ని వైకుంఠం నుండి భూలోకానికి తెచ్చినవాడు, ఆ గరుడాద్రిపై నివసించేవాడైన వేంకటేశ్వరునికి నమస్కారం.

బ్రహ్మాది దేవతలకు దివ్య విమానంలో దర్శనమిచ్చి,



తరువాత దానిని కనబడకుండా మాయం చేసినవాడు, గరుడుని వీపుపై ఎక్కి విహరించేవాడు, అనంతమైన శిరస్సులు కలవాడు, అనంతమైన నేత్రాలు కలవాడు, అనంత చరణాలు కలవాడు, శ్రీపర్వతంలో నివసించేవాడు బ్రహ్మాది దేవతలకు కూడ దర్శించటానికి దుర్లభమైన విశ్వరూపుడవైన నీకు నమస్కారం. వైకుంఠం నుండి వచ్చిన బంగారు దివ్య విమానంలో ఉన్నవాడు, అగస్త్య మహర్షి అభ్యర్థన మేరకు అశేష జనానికి దృష్టిగోచరుడైన వేంకటేశ్వరునికి నమస్కారం.

సర్వవ్యాపకుడు, సర్వాంతర్యామి, సర్వజీవ హృదయనివాసి అయిన దేవునికి, భక్తుల పాపాలను హరించే శ్రీహరికి, పంచతీర్థాలలో నివసించే వేంకటపతికి నమస్కారం. వామదేవుని యెడ ప్రీతి చెందినవాడు, జనకునికి అభీష్టాలనిచ్చినవాడు, మార్కండేయునికి స్వామిపుష్కరిణీ స్నానం వలన సకల తీర్థాలలో స్నానం చేసిన మహాఫలాన్ని ప్రసాదించినవాడు, బృహస్పతికి బ్రహ్మజ్ఞానాన్నుపదేశించటం ద్వారా బ్రహ్మత్వాన్నిచ్చినవాడు, చంద్రునికి లావణ్యాన్ని, సౌందర్యాన్ని అనుగ్రహించినవాడు, నారాయణగిరికి అధిపతి, బ్రహ్మచేత మహోత్సవం చేయబడిన వేంకటేశునికి నమస్కారం.

పాంచజన్యమనే శంఖాన్ని, సుదర్శనమనే చక్రాన్ని రెండు చేతులలో ధరించి, ఒక చేత్తో వరదానం చేస్తూ, మరొక చేత్తో అభయప్రదానం చేస్తూ చతుర్భుజాలతో ప్రకాశించేవాడు,

కరిగిన కస్తూరి అలదిన దివ్యమంగళ విగ్రహం గల శ్రీనివాసునికి నమస్కారం. 'కేశి' యనే రాక్షసుని సంహరించినవాడు, నిత్యయౌవనమూర్తి, భక్తుల కోరికలను తీర్చి, అభీష్టాల ననుగ్రహించేవాడు, ఈ బ్రహ్మాండంలోని తీర్థాలన్నింటి పాపాలను పోగొట్టి వాటికి పావనత్వాన్ని చేకూర్చేవాడు, తీర్థాలన్నింటికి స్వామినియైన స్వామి పుష్కరిణిలో స్నానం చేసే భక్తజనులకు అభీష్టాల నిచ్చేవాడు, కుమార ధారా తీర్థంలో తపస్సు చేసిన కుమారస్వామికి తారకాసుర వధ వలన కలిగిన బ్రహ్మహత్యా దోషాన్ని పోగొట్టి, ఆయనకు సకలాభీష్టాలు ప్రసాదించిన శ్రీనివాసునికి నమస్కారం.

పూర్వం వసువనే బోయవానికి, తొండమానునికి – ఇద్దరికీ పుట్టలో సగభాగం దాగి, మాకాళ్ళ పైభాగం మాత్రం కనబడేటట్లు దర్శనమిచ్చిన వరాహ రూపుడైన స్వామికి, క్షీరసాగర మథనంలో మందర పర్వతాన్ని మోయటానికై కూర్మావతారాన్ని ధరించినవానికి, గోపీనాథుడనే వైఖానస మునిశ్రేష్ఠునిచే పూజింపబడినవానికి, సింహాచలంలో నివసించేవానికి, శ్రీమన్నారాయణునికి నమస్కారం. సద్భక్తుడైన నీలకంఠునిచే పూజింపబడిన నృసింహ రూపుడు, దుర్మేధసుడనే అసురుని సంహరించటానికై కుముదాక్షుడనే పారిషదునికి గణాధిపత్యాన్ని, విష్వక్సేనునికి సైన్యాధిపత్యాన్ని ప్రసాదించినవాడు, దుర్మేధసుడనే అసురుని సంహరించినవాడు, నిత్యానపాయినియైన లక్ష్మీదేవిని వక్షస్థలంలో ధరించినవాడు, దుష్ట క్షత్రియులను సంహరించటానికై పరశురామావతారాన్ని దాల్చినవాడు, వేదాల నపహరించిన సోమకాసురుని సంహరించి, వేదోద్ధరణ చేయటానికి మత్స్యావతారం ధరించిన శ్రీవేంకటేశ్వరునికి నమస్కారం.

పాండవుల శత్రువులైన కౌరవులను సంహరింపచేసినవాడు, భక్తులకు లౌకిక, పారలౌకిక సంపదలనిచ్చేవాడు. వేంకటాద్రి సమీప ప్రదేశంలో (పర్వత పాదంలో) ఉన్న శంకరునిచే ధ్యానంచబడేవాడు, శ్రీ శుకపురంలో బంగారు పద్మాలు గల సరోవర తీరంలో శ్రీమహాలక్ష్మి కొరకు తపస్సు చేసినవాడు, ఆ తపస్సు చేత సంతుష్టురాలైన లక్ష్మీదేవి యొక్క ప్రకాశిస్తున్న కరకమలాలచే ప్రీతితో కంఠంలో సమర్పించబడిన కలువపూలమాల కలవాడైన శ్రీనివాసునికి నమస్కారం.

సాలగ్రామమనే దివ్యక్షేత్రంలో సాలగ్రామ శిలలలో నివసించేవాడు, పద్మసరోవర తీరంలో తపస్సు చేస్తున్న శుకమహర్షికి సాక్షాత్కరించినవాడు, నారాయణుడనే విప్రుని కోరికపై జనులందరికీ దర్శనమిస్తున్నవాడు, వేటాడడంలో ఆసక్తి కలవాడు, వృషభాసురుణ్ణి సంహరించినవాడు, అంజనాద్రినాథుడు, వృషభాచల నివాసి అయిన వేంకటేశ్వరునికి నమస్కారం.

అంజనాదేవికి పుత్రుని ప్రసాదించినవాడు, మాధవుని పాపాన్ని పోగొట్టినవాడు, ప్రియంగు ధాన్యాన్ని ప్రీతితో ఆరగించేవాడు, పాతాళం నుండి భూమినుద్ధరించిన శ్వేతవరాహ రూపుడు, నల్లని ఆవుల పాలచే అభిషేకింపబడి ఆవిర్భవించిన దివ్యమంగళ విగ్రహం కలవాడు, శంకరునికి ప్రియమిత్రుడు, చోళరాజ పుత్రుడైన తొండమానుని యందు ప్రీతి కలవాడైన వేంకటేశునికి నమస్కారం.

కృష్ణశర్మ అనే బ్రాహ్మణుని భార్య సుధర్మిణి చనిపోగా ఆమెని బ్రతికించి మరల చైతన్యాన్ని ప్రసాదించినవాడు, మధువనే రాక్షసుని సంహరించినవాడు, కృష్ణశర్మ అనే బ్రాహ్మణునికి తరువాత జన్మలో వేదాంత దేశికులుగా ప్రసిద్ధి చెందేటట్లు వరమిచ్చినవాడు, వరహాచలనాథుడు, బలభద్రరూపుడు, త్రివిక్రముడు, మహంత్ కంటే కూడా గొప్పవాడు, హృషీకేశుడు (ఇంద్రియాలకు అధిపతి, నియామకుడు), అచ్యుతుడు, నీలాద్రి నివాసి అయిన శ్రీనివాసునికి నమస్కారం.

క్షీరాబ్ధినాథుడు, వైకుంఠాచలవాసి, ముకుందుడు (మోక్షప్రదాత) అనంతుడు (అంతము లేనివాడు), బ్రహ్మదేవుడు ప్రార్థించగా భయంకరమైన తన శ్వేతవరాహ రూపాన్ని ఉపసంహరించి, సౌమ్యరూపాన్ని ధరించిన శ్రీనివాసునికి నమస్కారం.

సువర్ణముఖరీ నదిలో స్నానం చేసేవారికి అభీష్టాలనిచ్చి అనుగ్రహించేవాడు, వేంకటాద్రిలోని హలాయుధ తీర్థంలో స్నానం చేసిన ఫలాన్నిచ్చేవాడు, భూమి నుద్ధరించిన గోవిందుడు, మహాలక్ష్మికి నివాసమైన వక్షస్థలము కల శ్రీనివాసునికి నమస్కారం.

ఈ నూట ఎనిమిది నామాలను అర్థాన్ని అనుసంధానం చేసుకుంటూ ప్రతి నామం చివర చతుర్థీ విభక్తిని చేర్చి 'నమః' అని చెబుతూ శ్రద్ధతో, భక్తితో పఠించేవారికి, వినేవారికి శ్రీవేంకటేశ్వరుడు ప్రసన్నుడవుతాడు. ఇది నిశ్చయం.

విశేషించి పూజలో ఈ అష్టోత్తర శతనామాలను చెప్పాలి. ఈ నామాలు చెబుతూ వేంకటేశ్వరుని పూజించాలి. శ్రీవేంకటాద్రి నివాసియైన వేంకటేశ్వరుని ఈ నామాలతో (శ్రీవేంకటేశ్వరుని అష్టోత్తర శతనామాలతో) అర్చించేవారికి ముక్తి తప్పక లభిస్తుంది. ఇందుకు సందేహం లేదు.

''ఇది చాలా రహస్యమైన స్తోత్రం. దీనిని శ్రద్ధ లేనివారికి చెప్పరాదు. శ్రద్ధాభక్తులు కలవారికి మాత్రమే చెప్పాలి. ఉపదేశించాలి'' అని ఆదిశేషుడు కపిల

మహామునికుపదేశించాడు. ఆ కపిల మహాయోగి పుంగవులు దీనిని నాకుపదేశించాడు. శ్రీహరికి వెంటనే ప్రీతిని కలిగించే ఈ అష్టోత్తర శతనామావళిని నేనిప్పుడు మీకుపదేశించాను'' అని సూతమహర్షి శౌనకాది మహా మునులకు చెప్పాడు.

## 6. వేంకటాచలానికి మహర్షుల రాక :

సూతమహర్షి శౌనకాది మునులతో 'ఓ తపోధనులారా! మీరింకా ఏమి వినాలనుకుంటున్నారో చెప్పండి. నేను పూర్తిగా చెబుతాను. మీరడగటానికి సంకోచించవద్దు' అనగా శౌనకాది మునులంతా 'పరమపూజ్యా! భగవద్భక్తి అనే క్షీరసాగరం నుండి పుట్టిన చంద్రుడా! పాపవిదూరా! సూతమహర్షీ! మీరు వేంకటేశ్వరుని మహాత్మ్యాన్ని చెప్పారు. ఆ దేవదేవుని దివ్య చరిత్ర బహు విచిత్రమైంది. ఉదారమైంది. సాటిలేనిది. ఆయన రహస్య నామాలు, ఆ వేంకటేశ్వరుని దివ్య లీలామృతం మా వీనుల విందుగా గ్రోలాము (చెవులారా విన్నాము). ఇప్పుడు మా రెండు నేత్రాలతో ఆ భగవంతుని దివ్యమంగళ విగ్రహాన్ని కనులారా దర్శించాలనే కోరిక అధికమవుతున్నది. కావున మీరు మమ్మల్ని ఆ వేంకటేశ్వరుని సేవించటానికి అనుమతించండి.

ఆ శేషాద్రి యొక్క, దాని అధిపతియైన వేంకటేశ్వరుని యొక్క రహస్య నామాలను, స్వామిపుష్కరిణీ తీర్థ మాహాత్మ్యాన్ని మాకు తెలియజేశారు. కలియుగంలో శ్రీహరి మాహాత్మ్యం అత్యద్భుతం, దివ్యమైంది. ఓ ముని శ్రేష్ఠా! మీరు చెప్పినదంతా శ్రద్ధగా విన్నాము. శ్రీవేంకటేశ్వరుని కథామృతం కర్ణపేయంగా ఉంది' అని చెప్పగా సూతమహర్షి శౌనకాది మునులతో 'ఓ మునులారా! మీరు నెమ్మదిగా శ్రీవేంకటాచలానికి వెళ్ళి పవిత్రం, పుణ్యప్రదమైన ఆ పర్వతానికి ప్రదక్షిణం చేయండి. ఆ చుట్టుప్రక్కల, పర్వత పరిసర ప్రాంతాలలోని తీర్థాలలో స్నానం చేసి, అక్కడి దేవతలను సేవించండి.

ఆ తరువాత శుక కోకిలల మంజుల ధ్వానాలతో సుమనోహరంగా ఉండే రత్నసానువులు గల ఆ దివ్య పర్వతాన్ని అధిరోహించండి. ఆ పైన పద్మవనంలోని సుగంధ వాయు పరిమళంతో హృదయంగమంగా ఉండే స్వామి పుష్కరిణికి వెళ్ళి, ఆ తీర్థంలో స్నానమాచరించండి. అటుపిమ్మట దర్శనమాత్రం చేతనే పాపాలను పోగొట్టే, హృదయానందకరమైన, శరీరాన్ని పులకింపచేసే భగవంతుని దివ్య విమానానికి ప్రదక్షిణం చేసి, లోపలికి ప్రవేశించి, ముందుగా భూవరాహస్వామిని దర్శించి, ఆయనకు నమస్కరించాలి.

అనంతరం శ్రీదేవి భూదేవులతో సంతోషంగా కూడియున్నవాడు, శంఖచక్రధారి, పుండరీకాక్షుడు, మందస్మిత వదనారవిందుడు, దయామృత సాగరుడు, చిరునగవుతో మనోహరంగా విలసిల్లే శ్రీవేంకటేశ్వరుని చక్కగా దర్శించి, నమస్కరించి, వివిధ నామాలతో స్తుతించి, పద్మాలతో పూజించి, దుర్లభాలైన అభీష్టాలను పొంది, కృతకృత్యులై తిరిగి రండి' అని సూతమహర్షి వారికి అనుమతిచ్చాడు.

ఆ మహర్షులంతా సూతుని అనుజ్ఞ పొంది సంతోషంతో వేంకటాచలానికి బయలుదేరారు. భరద్వాజుడు, కౌశికుడు, జాబాలి, కాశ్యపుడు, క్రతువు, దక్షుడు, పులస్త్యుడు, గౌతముడు, పులహుడు, అంగీరసుడు, దేవలుడు, దేవదర్శనుడు, కౌత్సుడు, కణ్వుడు, మృకండుడు, శతానందుడు, మైత్రేయుడు మొదలుగాగల మాననీయ తపోధనులందరూ కలిసి సామూహికంగా 'గోవిందా! గోవిందా!' అని బిగ్గరగా నామస్మరణ చేస్తూ, గంగను దాటి, ఆ తరువాత గోదావరిని, కృష్ణవేణిని దాటి, అక్కడక్కడ ఆయా మహానదుల్లో స్నానాలాచరిస్తూ వచ్చి వేంకటాద్రిని సమీపించారు.

ఆ వేంకటాద్రి మేలిమి బంగారు వర్ణంతో శోభిస్తున్నది. అది సకల తీర్థాలు కలది. పుణ్యప్రదమైనది. సిద్ధపురుషులందరు దానిని సేవిస్తూ ఉన్నారు. మత్తెక్కిన మయూరాలు చేసే మంజుల కేకా రవాలతో మనోహరంగా ఉంది. దివ్యజలాలతో ప్రవహించే సెలయేళ్ళతో నిండి ఉంగి. అక్కడి వృక్షాలు ఫలపుష్పాలతో శోభిస్తున్నాయి. అటువంటి అప్రాకృతమైన దివ్యపర్వతాన్ని ఆ మహర్షులు దర్శించారు.

వారంతా సూతమహర్షి చెప్పిన సేవాక్రమాన్ని అతిక్రమించకుండా పరమ పావనమైన శ్రీవేంకటేశుని సేవనాచరించారు. అక్కడి సెలయేళ్ళలోను, సరస్సులలోను మంత్రపూర్వకంగా స్నానం చేశారు. సుందరాలు, మణిమయాలైన పర్వత సానువులను చూస్తూ, శ్రవణానంద జనకాలైన పక్షుల కలకూజితాలను వింటూ, సామగానం చేస్తూ, స్తోత్రాలను పఠిస్తూ, సంభ్రమంతో నృత్యం చేస్తూ, ఆనందంతో కేకలు పెడుతూ, హర్షాతిరేకంతో గంతులు వేస్తూ నెమ్మది నెమ్మదిగా చక్కగా గిరిప్రదక్షిణ మాచరించారు.

ఆ తరువాత కపిలతీర్థంలో స్నానం చేసి, శివుని దర్శించి నమస్కరించారు. ఆ పైన సిద్ధులు, గంధర్వులు సేవించే మేరుపర్వతం వంటి వేంకటాద్రిని చూచి నమస్కరించి 'ఈ వేంకటాచలం అత్యద్భుతమైన రత్నసానువులు గల మేరుపర్వతం కంటే కూడా అద్భుతంగా ఉంది. ఇటువంటి

దివ్యపర్వతాన్ని ముందెన్నడూ చూడలేదు' అనుకుంటూ వారంతా భగవంతుని పరమోత్తమమైన దివ్యవిమానాన్ని దర్శించారు. స్వామితీర్థంలో స్నానం చేసి, దేవదేవుడైన ఆ లక్ష్మీపతిని దర్శించారు.

## 7. మహర్షులు భగవంతుని స్తుతించుట :

శ్రీనివాసుడు కోటి మన్మథుల సౌందర్యంతో విరాజిల్లుతున్నాడు. శిరస్సు పైన ధరించిన కిరీటం ప్రకాశిస్తున్నది. వక్షఃస్థలంలో లక్ష్మీదేవిచే ఆక్రమించబడిన ముత్యాల హారంతో శోభిస్తున్నాడు. చతుర్భుజుడు, ఉన్నత శరీరుడు, శంఖచక్రధారి, నీలమేఘశ్యాముడు, పీతాంబరధారి, అచ్యుతుడు, శ్రీదేవి భూదేవి సహితుడు, విష్ణుమూర్తి, లక్ష్మీదేవిచే పూజింపబడిన పాదపద్మాలు గల భగవంతుని దర్శించి నమస్కరించారు. వెంటనే ఆనందంతో, వికసించిన నేత్రాలతో, వేదమంత్రాలతో, వేదసమ్మతమైన స్తోత్రాలతో భగవంతుని ఈ విధంగా స్తుతించారు –

భూమిమీద ఉండే ఇసుక రేణువులనైనా లెక్కించవచ్చు గాని, శ్రీమహావిష్ణువు యొక్క కళ్యాణగుణాలను పూర్తిగా లెక్కించడం ఎవరి తరం కాదు. భూమిపై ధర్మస్థాపనకై త్రివిక్రమావతారం ధరించి మూడు పాదాలతో త్రిలోకాలను ఆక్రమించిన శ్రీమహావిష్ణువైన నీకు నమస్కారం.

చరాచరాల కంటె పదంగుళాల పరిమాణం అధికుడవై వ్యాపించి యున్న పరమ పురుషుడవు. భూత భవిష్యత్కాలాలను వ్యాపించి ఉన్న మహావిష్ణువైన నీకు నమస్కారం. నీవు ఈ విశ్వం ఒక పాదం గాను, ఆకాశం మూడు పాదాలు గాను వ్యాపించి ఉన్నావు. నీ ముఖం నుండి ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వణవేదం ఆవిర్భవించాయి. అట్టి పరబ్రహ్మవైన నీకు నమస్కారం.

నీ ముఖం నుండి బ్రాహ్మణులు, భుజాల నుండి క్షత్రియులు, తొడల నుండి వైశ్యులు, పాదాల నుండిశూద్రులు, ముఖం నుండి అగ్ని–ఇంద్రుడు, మనస్సు నుండి చంద్రుడు, నేత్రాల నుండి సూర్యుడు సృజించబడ్డారు. అట్టి పరబ్రహ్మవైన నీకు నమస్కారం. నీ కళ్యాణ గుణాలనంతాలు. మానవులు నీ గుణాలిన్నని లెక్కించలేకున్నారు. బుద్ధి బలహీనత వల్ల నీ గుణాలను వర్ణించలేక విరమిస్తున్నారు. అలాగే వేదాలు కూడా నీ అనంత కళ్యాణ గుణాలను పూర్తిగా వర్ణించలేకపోయినాయి.

ఈవిధంగా శ్రావ్యాలు, సుమనోహరాలైన స్తోత్రాలతో భగవంతుని అనేక విధాల స్తుతించి, పద్మపత్రాలతో వేంకటేశ్వరుని శ్రీపాదాలను సూతమహర్షి చెప్పిన నామాలతో భక్తితో, నిర్మల చిత్తంతో పూజించారు. అప్పుడు జగత్ప్రభువైన వేంకటేశ్వరుడు సంప్రీతుడై వారితో ఇలా అన్నాడు –

'అక్కడ నైమిశారణ్యంలో ఉన్నప్పుడే నేను మీ విషయంలో సంప్రీతుణ్ణయ్యాను. ఓ మునులారా! బుధులారా! శ్రీవేంకటాచల మాహాత్మ్యాన్ని వినటం వల్ల మిమ్మల్ని అనుగ్రహించాను. చిరకాల తపస్సు వలన పొందదగిన ఫలితాన్ని మీకు ప్రసాదించాను. మీకు సర్వాభీష్టాలనిచ్చాను. వేంకటాచల మాహాత్మ్యాన్ని చాలా దూరం నుండి విన్నా, వినిపించినా, శ్రద్ధతో చదివినా, విశేషించి కన్యామాసంలో చేస్తే వారిని నేను సులభంగా అనుగ్రహిస్తాను. వారికి ధనాన్ని, ధాన్యాన్ని, భూమిని, పుత్ర పౌత్రులను ప్రసాదిస్తాను. సర్వాభీష్టాలను తీరుస్తాను. చివరకు దేహాంతంలో నా పరమపదాన్ని ప్రసాదిస్తాను'.

ఆ తపోధనులంతా ఈవిధంగా వరాలను పొంది, వేంకటాద్రిపై 5 సంవత్సరాలుండి, అక్కడి తీర్థాలన్నింటిలో స్నానమాచరించి, ఆశ్చర్యకరాలైన విశేషాలన్నింటినీ దర్శించి, మాధవుని చక్కగా ఆరాధించి, మరల నైమిశారణ్యానికి వెళ్ళారు.

వారు ముని సమూహాలతో సేవించబడుతున్న నైమిశ తపోవనానికి వెళ్ళి శ్రీ సూతమహర్షిని సమీపించి "ఆహా! మహాత్మా! మీ విజ్ఞానం అనంతం. మీ సామర్థ్యం అసామాన్యం. వేంకటాద్రిపై నివసించే శ్రీమహావిష్ణువు యొక్క రూపం, ఔదార్యం అన్నీ మీరు చెప్పినట్లే ఉన్నాయి. ఆ వేంకటాచలం కూడా మీరు వర్ణించినట్లే ఉంది. ఆహా! ఏమి ఆ వేంకటాచల వైభవం! ఓ మహర్షీ! మీ దివ్యానుగ్రహం వల్ల మేమందరం కృతార్థులమయ్యాం. మీరు ఆ వేంకటేశ్వరుని సంస్థానాన్ని, వేంకటాద్రిని దర్శించారా? లేక వాటి వైభవాన్ని గురించి విన్నారా?" అని అడిగారు.


అప్పుడు సూతమహర్షి "ఓ తపోధనులారా! వ్యాసమహర్షి దివ్యానుగ్రహం వల్ల నేనిదంతా తెలుసుకొన్నాను. శ్రీవేంకటాచల మాహాత్మ్యాన్ని వందల కోట్ల కల్పాలకు గాని, వేల సంవత్సరాలకు గాని, వేలమంది ఆదిశేషులకు కూడా వర్ణించడానికి సాధ్యం కాదు. అయినప్పటికీ కొంత మాహాత్మ్యాన్ని మీకు చెప్పాను. ఈ ఉత్తమోత్తమమైన శ్రీవేంకటాచల మాహాత్మ్యం పవిత్రమైంది, పుణ్యప్రదమైంది, ఆయుష్కరమైంది. దీనిని ఎవరు భక్తితో చదువుతారో, వింటారో, వ్రాస్తారో వారు సర్వాభీష్టాలను సర్వ శుభాలను పొందుతారు" అన్నాడు.

**ఇది శ్రీవేంకటాచల మాహాత్మ్యం లోని**
**వరాహ పురాణభాగం సమాప్తం**

ధారావాహికం

# ముకుందమాల

భువనేశ్వరి మారేపల్లి (9550241921)



**చిన్తయామి హరిమేవ సంతతం**
**మందమంద హసితాననామ్బుజం ।**
**నందగోప తనయం పరాత్పరం**
**నారదాది మునిబ్బంద వందితం ॥**

మందస్మితముతో కూడిన ముఖపద్మము కలవాడు, నందగోపుడి కుమారుడు, పరాత్పరుడు, నారదాది ముని సమూహాల చేత సేవించబడేవాడు, అయిన శ్రీహరిని సదా ధ్యానించెదను. ఈశ్లోకంలో మన కులశేఖరాళ్వార్లు “నందగోప తనయం” అంటూ కీర్తిస్తున్నారు. పరమ సాత్వికము అలాగే పరాక్రమము కలిగిన నందగోపుడి కుమారుడా! అని స్మరిస్తున్నారు. ఇలాగే మన గోదా అమ్మవారు కూడా ...

“కూర్వేల్ కొడుందోళిలన్ నందగోపన్ కుమరన్” పరమ సాత్వికుడైన నందగోపుని కుమారుడిగా మన వద్దకు వచ్చాడు కదా పరమాత్మ అంటూ పాడతారు. అటువంటి కన్నయ్య ఎలాంటివాడు? పరాత్పరుడు అంటున్నారు.

ఏమిటి పరాత్పరః అంటే,

**“మత్తః పరతరం నాన్యత్కిఞ్చిదస్తి ధనంజయ ।**
**మయి సర్వమిదం ప్రోతం సూత్రే మణిగణా ఇవ ॥”**

అన్నిటికన్నా పెద్దవాడు. పరము, పరతరము కూడా పరమాత్మే. తనకంటే ఇంకా పై వారు ఎవరు లేరు కాబట్టి పరాత్పరుడు అన్నారు. ఐతే మరి అంత పెద్దవాడు ఐతే చిన్నవారిని పట్టించుకోకపోతే ఏమైనా ఉపయోగం ఉంటుందా అంటే ఉండదు. కానీ పరమాత్మ అలాంటి వాడు కాదు ఆయన ఎంతటి పరాత్పరుడో అంతటి సులభుడు కూడా! శ్రీమన్నారాయణుడు, వైకుంఠధాముడు అయినా పరాత్పరుడు తన సౌలభ్యమును చూపించడానికి నందగోపుడి కుమారుడిలా వచ్చి అందరిచేత లభ్యం అయ్యే విధంగా ఉన్నాడు. కడితే కట్టించుకున్నాడు, కొడితే కొట్టించుకున్నాడు. ఇంతటి సౌలభ్యం ఎక్కడైనా ఉండునా. కాబట్టి పరత్వ సౌలభ్యముల యందు నిన్ను మించినవాడు లేరు అని కీర్తిస్తున్నారు.

అటువంటి పరమాత్మ మోమును వర్ణిస్తారు “మందమంద హసితాననామ్బుజం” పద్మము వంటి ముఖము కలిగి అత్యంత సుందరమైన స్వల్పమైన చిరుమందహాసముతో ప్రకాశించే వాడా! అటువంటి నిన్ను నిద్రలేచిన సమయము నుండి తిరిగి నిద్రకు వెళ్లె వరకూ సదా నిన్ను స్మరించేలా అనుగ్రహించుము. ఇలా మందహాసముతో అనడానికి ఇంకొక సంప్రదాయ రహస్యం ఏమిటంటే ఎవరైనా సరే అత్యన్తాశ్చర్య సమయంలో కాని, అత్యంత కోపము సమయంలో మనము ఏమి చెప్పినా కూడా చెవికి సరిగ్గా ఎక్కదు. అదే మందహాసముతో ఉండి మనఃప్రసాద కాలము అత్యంత సంతోష కాలం కాబట్టి పెరుమాళ్ అలా వుండే సమయం చూసి చెప్తున్నారు.

అటువంటి నీ కృష్ణ రూపమును దర్శించి మహర్షులు సేవించుకున్నారు. నారదుడు తరుచు వచ్చి సేవించి స్తోత్రము చేస్తారు. ఇంద్రుడు కామధేనువుతో వచ్చి దానియొక్క క్షీరముతో అభిషేకము చేసి ప్రార్థించారు కదా నీ యొక్క పరత్వమును.

“పరాత్పరం నారదాది మునిబ్బంద వందితం”

అనడం చేత పరమాత్మ యొక్క పరత్వమునకు నారదాది మునిబృందములు సాక్షులు అని తెలుపుతున్నారు.

"చిన్తయామి హరిమేవ సంతతం" అటువంటి నిన్ను స్మ రించినంత మాత్రాన నాలో ఉండే పాప పంకిలమైన మనస్సునందు శుద్ధత ఏర్పడి తిమిరాంధకారములో ఉన్న నా మనస్సు నీ యొక్క నామస్మరణ చేత పునీతమై జ్ఞానజ్యోతి ప్రకాశించి మనస్సుయందు సుస్థిరమై సదా నీ ధ్యానములో ఉండేలా అనుగ్రహించుగాక! పాపపంకిలమైన మనస్సును స్వప్రయత్నంచేత శుద్ధత కలుగదు. చీకటిని పోగొట్టడానికి ఎన్ని ప్రయత్నాలు చేసిన అంధకారం పోదు, అగ్ని భగవానుడే వచ్చి పోగొట్టవలసిందే. అలాగే అజ్ఞానాంధకారాన్ని నువ్వు మాత్రమే పోగొట్టే వాడివి కనుకనే "హరిః"

అటువంటి ఓ శ్రీహరి నిన్ను ఎల్లప్పుడూ స్మరిస్తూ ఉండేలా కటాక్షింపుడు అని నమస్కరిస్తున్నారు మన కులశేఖరాళ్వార్లు. నారదాది మునీశ్వరులచే సేవింపబడుచుండు వానిని, పరాత్పరుని, నందగోప కుమారుని, నవ్వు రాజిల్లెడి మోమువానిని, కృష్ణుని ఎల్లప్పుడూ నేను ధ్యానించు చుందును.

(నాల్గవ శ్లోకం నుండి ఇంతవరకు అనన్య ప్రయోజనము గా సర్వదేశ సర్వకాల సర్వావస్థల యందు అవిచ్ఛిన్నముగా ఆటంకములు లేక హరి స్మరణమే తనకు కావలెనని కులశేఖరులు కోరినారు. ఆ కోరికను అనుసరించి లభించిన హరిని అనుభవించి తృప్తితో ఈ శ్లోకమును చెప్పుచున్నారు)

"చిన్తయామి హరిమేవ సంతతం" అంటూ ఎల్లప్పుడూ ఆ గోపాలుని స్మరణలోనే తన జీవితాన్ని సార్ధకం చేసుకున్న భక్తాగ్రేసరుడు క్షేత్రయ్య.

అదొక పల్లెటూరు.

ఆ వూరి నడిబొడ్డున ఒక దేవాలయం.

ఎప్పుడూ ఆలయంలో ధ్యానంలో ఉంటూ ఉండడమో, లేక స్వామిపై పదాలను కూర్చుతూ కాలము గడిపేవాడు ఓ భక్తుడు. అర్చకులకు కూడా తన గేయాల ద్వారా అత్యంత ప్రీతిపాత్రుడైన ఆ భక్తుడు ఓసారి ధ్యానంలో ఉండగా ఆలయ ప్రధానార్చకులు అతనిని ఆలయంలోనే ఉంచేసి తాళం వేసి వెళ్ళిపోయారు.


కాసేపటికి అతను కళ్ళు తెరిచి చూసేసరికి స్వామి దగ్గరికి ఆయన దేవేరి పేరుందేవి తాయరు స్వామి వారి ఏకాంతసేవకై వచ్చి నారట. ఆ దృశ్యాన్ని చూసి పులకించిపోయిన ఆ భక్తుడు ఆసువుగా కొన్ని పదాలను అప్పటికప్పుడు రచించాడు. మరునాడు అర్చకులు ఆలయ ద్వారాలు తెరిచే సరికి ఆనందపారవశ్యాలతో పదాలు పాడుకుంటున్న ఆ భక్తుణ్ణి చూసి ఆశ్చర్యపోయారట. అతను చెప్పిన సంగతులు విని ఆహా! ఏమి ఈ భక్తుని అదృష్టం అనుకున్నారట. ఆనాటి నుండీ అతనంటే గౌరవభావం అందరికీ ఇంకా ఎక్కువయ్యింది.

ఆ వూరు సంస్కృతీ నిలయమని పేరుమోసిన కృష్ణా మండలంలో లోని మొవ్వ గ్రామం. ఆ ఊరిలో వెలసిన వేణుగోపాలస్వామి ఈయన ఇష్టదైవం. ఆ యువ భక్తుడు ఆంధ్రకళాసరస్వతికి స్వర్ణ నీరాజనం పట్టిన ప్రఖ్యాత పదకర్త క్షేత్రయ్య. క్షేత్రయ్య అతని ప్రజ్ఞా నామం. అసలు పేరు మొవ్వ వరదయ్య.

వరదయ్య కృష్ణాజిల్లా మొవ్వ గ్రామంలో నివసించేవాడు. ఉదయం వేళలలో గోవులను కాసుకోవడం, సాయంత్రం వేళల్లో అక్కడి వేణుగోపాలస్వామిని సేవించుకోవడం... ఇదే ఆయన దినచర్యగా ఉండేది. ఇదంతా 17వ శతాబ్దం నాటి సంగతి. వరదయ్య నివసిస్తున్న మువ్వ సమీపంలోనే కూచిపూడి గ్రామం ఉంది. కర్ణాటక సంగీతంలో పేరెన్నకగన్న వాగ్గేయకారులలో క్షేత్రయ్య (1595-1660) ఒకరు. ఈయన అసలుపేరు "అర్భకం వరదయ్య". ఇంటిపేరు "మొవ్వ". క్షేత్రయ్య పదాలలోని "వరద" అనే ముద్ర స్వనామ ముద్రగా భావించి, అసలు పేరు 'వరదయ్య'గా నిర్ణయించారు. కృష్ణా జిల్లాలోని "మొవ్వ" గ్రామాన్ని-మువ్వ, మూవ, మవ్వ అని కూడా అంటారు.

సుమారు ఒక నెల రోజులపాటు కంచిలో నివసించాక తంజావూరు సంస్థానంలో కళలకు ఉన్న ఆదరాభిమానాల గురించి విని తంజావూరు వెళ్ళాలని నిర్ణయించుకుని వరదరాజ స్వామి వద్ద సెలవు తీసుకుని మరల స్వామి దర్శనార్థం తప్పక వచ్చెదనని నిర్ణయించుకుని వేణు గోపాలుని మధుర భక్తి ప్రచారానికై తంజావూరు బయలుదేరాడు వరదయ్య. ఆ సమయంలో తంజావూరిని రఘునాథ నాయకుని కుమారుడైన విజయరాఘవుడు పరిపాలించు చున్నాడు. విజయరాఘవుడు కూడా తండ్రి వలెనే మంచి కళాపోషకుడు, స్వయంగా ఆయనే గొప్పకవి కూడా సుమారు 40 కావ్యాలు రచించాడు. కూచిపూడి నాట్య కళాకారులకు అచ్యుతరాయపురం అగ్రహారాన్నే బహుమానంగా ప్రకటించిన కళాపిపాసి.

కంచిలో ఉండగానే పేరుప్రఖ్యాతులు ఆర్జించిన వరదయ్యని విజయరాఘవుడు ఎంతో ఆదరంగా స్వాగతించినప్పటికీ అతని ఆస్థానంలోని ఇతర కవులు మాత్రం వరదయ్య తమ ఆస్థానానికి ఎప్పుడు వస్తాడా, వారిని ఎప్పుడు ఓడించి రాజుగారి ముందు అవమాన



**క్షేత్రయ్య పదాలలో ఆనాటి తెలుగు భాష, జాతీయాలు పుష్కలంగా కనిపిస్తాయి. వాటితో పాటుగా మొవ్వ గోపాలుని ప్రస్తావనా వినిపిస్తుంది. మువ్వ గోపాలుడంటే సామాన్యుడా! ముద్గలుడు అనే రుషికి స్వయంభువుగా ఇసుకదిబ్బలలో దొరికినవాడు. తాను ఏ క్షేత్రంలో తిరుగుతున్నా, క్షేత్రయ్య మనసు మొవ్వలోని మువ్వగోపాలుని మీదే లగ్నమై ఉండేది.**

పరుద్దామా అని ఎదురుచూస్తూ ఉన్నారు. అదే ఆస్థానంలో రంగాజమ్మ అనే నర్తకి ఉండేది, ఆవిడ గొప్ప కవయిత్రి కూడా, ఉషా పరిణయము ఆమె రచించిన కావ్యము. ఆవిడ మాత్రం వరదయ్య యందు అభిమానము కలిగి ఉండేది. ఇంకా ఈ ఆస్థానంలో చతుర్దండి, ప్రకాశిక వంటి కావ్యాలను రచించిన శ్రీవేంకటముఖి, ప్రముఖ కవి, విజయరాఘవుని గురువులు అయిన శ్రీనివాస తాతాచార్యుల వారు కూడా ఉండేవారు.

విజయరాఘవ మహారాజు, వరదయ్య మంచి మిత్రుల వలే ఉండేవారు. ఇద్దరూ ఎన్నో చర్చా ఘోష్ఠులలో పాల్గొనే వారు. ఈయన దగ్గర ఉండగా వరదయ్య సుమారు 1000 పదాలు రచించాడు. వరదయ్య మహారాజుని ఏకవచనంతోనే సంబోధించేవాడు. వీరి స్నేహంపై అసూయ పెంచుకుని వారి మైత్రిని సహించలేని కొందరు సభికులు ఓనాడు... రాజు గారిని ఏకవచనంతో సంబోధించడం అవమానం అనీ, వరదయ్య పదాలలో భాష మామూలు మాట్లాడుకునే భాషలా ఉంది కానీ, అందులో కవిత్వపు ఛాయలే లేవని అవమానించారు. దానికి జవాబుగా వరదయ్య ఈవిధంగా చెప్పాడు. "నేను మహారాజుని ఓ రాజుగా గౌరవించినా కవిత్వం చెప్పేటప్పుడు ఓ స్నేహితునిగా ఆతనిని ప్రేమిస్తాను. అందుకే పదాలు వినిపించేటప్పుడు అలా సంబోధిస్తాను" అని అతి వినయంగా సమాధానం చెప్పి, తన పదాలు పండితులకే కాదు పామరులకి కూడా అర్థం కావాలి అని తాను భావించాడు కాబట్టే సరళమైన వాడుక భాషలోనే రచించాననీ, ఇది వేణుగోపాలుని సంకల్పం అనీ తాను నిమిత్తమాత్రుణ్ణి అని చెప్పి ఓ పదాన్ని సగమే రాసి మిగిలినది సభికులను పూర్తి గావించమని చెప్పి తంజావూరు నుంచి రామేశ్వరం బయలుదేరాడు.

తన మిత్రురాలు మోహనాంగికి ఇచ్చిన వాగ్దానం ప్రకారం కంచిలో ఉండగా ఆమెను రమ్మని మొవ్వకి కబురు పంపాడు. కానీ ఆమె వచ్చే లోపే తంజావూరు బయలుదేరాడు వరదయ్య. కాని ఆమె కంచిలో కొన్నాళ్ళు వేచి చూసి వరదయ్య రాకపోవడంతో ఆలయ అర్చకుల సలహా మేరకు తంజావూరు బయలుదేరింది. తంజావూరుకు వచ్చిన ఆమెకి అక్కడ కూడా నిరాశే ఎదురయ్యింది. ఎందుకంటే ఆమె తంజావూరు వచ్చే సరికి వరదయ్య రామేశ్వరం బయలుదేరాడు. అయితే తంజావూరులో ఆమె వరదయ్య శిష్యురాలిగా పరిచయం చేసుకోవడంతో ఆమెకు రంగాజమ్మ గారితో పరిచయం ఏర్పడింది. ఆమెను రంగాజమ్మ గారు ఆహ్వానించి ఆతిథ్యం ఇచ్చారు. వరదయ్య తప్పక తిరిగి తంజావురు వస్తాడని, పండితులకు పూరించమని ఇచ్చిన పద్యం కోసమైనా వరదయ్య తప్పక ఇక్కడికి తిరిగి వస్తాడని అప్పుడు కలుసుకో గలవని చెప్పి మోహనాంగికి తన ఇంట్లోనే ఆతిథ్యం ఇచ్చారు రంగాజమ్మ.

ఇక రామేశ్వరం బయలుదేరిన వరదయ్య మార్గంలో భూలోక వైకుంఠంలా విరాజిల్లే శ్రీరంగం వెళ్ళి అక్కడ శేషశయనుడైన శ్రీమన్నారాయణుని దర్శించి, వారిపై కొన్ని పదాలను కూడా రచించి, రామేశ్వరం బయలుదేరారు. రామేశ్వరంలో రామునిచే ప్రతిష్ఠ గావించబడిన రామేశ్వరుని దర్శించి... కొంతకాలం స్వామి సన్నిధిలో గడిపాక తిరిగి తంజావూరు, గోల్కొండ మీదుగా మొవ్వ వెళ్ళాలని నిర్ణయించుకున్నారు.

ఇక్కడ తంజావూరులో వరదయ్య రాకకి నిరీక్షిస్తున్న, మోహనాంగికి ఈవార్త కొందరు యాత్రికుల ద్వారా తెలియపరిచినారు రంగాజమ్మ గారు. ఆ వార్త విని అత్యంత సంతోష భరితమైన స్థితిలో ఉన్న మోహనాంగి తంజావూరు ఆస్థానంలో నాట్య ప్రదర్శన ఇవ్వవలిసినదిగా కోరారు రంగాజమ్మ. ఆమె అందుకు అంగీకరించగా ఓనాడు



విజయరాఘవ మహా రాజు గారి ఎదుట వరదయ్య పదాలకు మోహనాంగి అద్భుతంగా నాట్యం చేసింది. వరదయ్య వేణుగోపాలుని రాకకి నిరీక్షిస్తూ సాగిన ఆ పదాన్ని వరదయ్య కోసం తన నిరీక్షణ ప్రతిబింబించేలా నర్తించింది. అదే సమయంలో వరదయ్య కూడా ఆస్థానానికి వచ్చాడు. వరదయ్య దర్శనంతో మోహనాంగి తరించింది. సభలో ఇతర కవులు కూడా వరదయ్య తమకి పూరించమని ఇచ్చిన పదాన్ని పూర్తి చేయలేక పోయామని ఆ పని కేవలం కారణజన్ముడైన వరదయ్య వలనే సాధ్యం అని, తమ అజ్ఞానానికి మన్నించమని కోరగా, వరదయ్య అసంపూర్ణంగా మిగిలిఉన్న ఆ పదాన్ని పూర్తి చేశాడు. వరదయ్య అపారమైన ప్రతిభకి ఆయనకు "క్షేత్రజ్ఞుడు" అన్న బిరుదును, ఇన్ని.. క్షేత్రాలు దర్శించి ఇంతమందిని తన రచనల ద్వారా తరింపచేస్తున్న వరదయ్యకి "క్షేత్రయ్య" అన్న బిరుదుని రాజుగారు, మిగిలిన పండితులు కలిసి ప్రదానం చేశారు.

రాజుగారి దగ్గర, అందరి దగ్గర సెలవు తీసుకుని మోహనాంగితో మొవ్వకు ప్రయాణ మయ్యాడు. ముందుగా వారు కంచి చేరగా అక్కడ వరదరాజుని పునః దర్శించుకున్న వరదయ్య ఓ అద్భుతమైన పదాన్ని సమకూర్చగా దానికి మోహనాంగి అంతే అద్భుతంగా ఆనంద నాట్యము చేసిందట. ఆలయములోని వారందరూ ఆ నాట్యానికి, ఆ రచనకీ ముగ్ధ మనోహరులై వారిద్దరినీ సత్కరించారట. కంచి నుండి తిరిగి గోల్కొండ రాగా అప్పటికే క్షేత్రయ్య రాకకై ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్న నవాబు గారు క్షేత్రయ్యను ఎంతో ఘనంగా స్వాగతించి సత్కరించారు.

గోల్కొండ నవాబుగారి ఆస్థానంలో తులసిమూర్తి అనే పండితుడు ఉండేవాడట. ఆయన నవాబు గారికి క్షేత్రయ్యపై లేనిపోనివన్నీ చెప్పి ఆయనపై చెడు అభిప్రాయాన్ని కలిగించాలని చూసేవాడు. తులసిమూర్తి కుటిలబుద్ధిని గ్రహించిన గోల్కొండ నవాబుగారు అతనికి బుద్ధి చెప్పాలని, ఒకరోజు సభలో అందరి ఎదుట క్షేత్రయ్యకి 40రోజుల గడువులో 1500 పదములను సమకూర్చమని ఆదేశించెను. ఇది కూడా మొవ్వ గోపాలుని ఆదేశంగా స్వీకరించిన క్షేత్రయ్య సరే అన్నాడు. అయితే క్షేత్రయ్య మనసుని అపవిత్రం చేసి అతని ఆలోచన మువ్వ గోపాలుని నుండి మళ్ళిస్తే అతను నిర్ణీత సమయంలో పదాలు రచింపలేడని దుష్ట ఆలోచనతో తులసిమూర్తి ఆస్థాన నర్తకి కమలతో కలిసి ఓ దుష్ట పన్నాగము పన్నాడు. కమల కూడా క్షేత్రయ్య తనను తిరస్కరించాడన్న ఆలోచనతో సరే అని తులసిమూర్తి తో చేతులు కలిపింది. కానీ క్షేత్రయ్య మనసు ఆ మొవ్వ గోపాలునకే అంకితం అయ్యెనని తెలుసుకోలేకపోయెను.

**మొవ్వ గోపాలుని ప్రార్థించుచూ క్షేత్రయ్యకు సేవ చేస్తూ ఉండగా.. ఉన్నట్టుండి క్షేత్రయ్య లేచి కూర్చుని మొవ్వ గోపాలుని ధ్యానము ప్రారంభించెను. ఆయనలో ఏదో నూతన శక్తి ప్రవేశించి, తెల్లవారే లోగా 1500 పదాలనూ పూర్తి చేసెను. మోహనాంగి, క్షేత్రయ్య ఈ సంఘటనతో చాల ఆనందాశ్చర్యాలకు లోనయ్యారు.**

కమల ఒకనాడు క్షేత్రయ్యను తన నాట్యప్రదర్శనకు ఆహ్వానించి ఆయనకు వశీకరణ ద్రవమును పండ్ల రసములో కలిపి ఇచ్చెను. క్షేత్రయ్య మనసు వికలితమై ఇంటికి చేరెను. క్షేత్రయ్యలో మార్పును గమనించిన మోహనాంగి వివరాలడుగగా క్షేత్రయ్య, కమల ఇంటికి వెళ్ళి, పండ్లరసమును తాగెనని చెప్పి, ఏదొ శక్తి తనని ఆమె వైపుకు లాగుతున్నదని చెప్పి తనకు తెలియకుండానే ఆమె ఇంటికి వెళ్ళుటకు సిద్ధమయ్యెను. విషయమును గ్రహించిన మోహనాంగి శ్రీ సిద్ధేంద్ర యోగి ద్వారా క్షేత్రయ్యకు ఆ వశీకరణమునకు విరుగుడు మందుని ఇప్పించెను. కానీ క్షేత్రయ్య ఆరోగ్యము కుదుటపడుటకు చాలా రోజులు పట్టెను. ఈలోగా నవాబు గారిచ్చిన నలభైరోజుల గడువు ముగియుటకు కేవలం ఒక్క రోజే ఉందనగా మోహనాంగి చాలా బాధపడెను.

మొవ్వ గోపాలుని ప్రార్థించుచూ క్షేత్రయ్యకు సేవ చేస్తూ ఉండగా.. ఉన్నట్టుండి క్షేత్రయ్య లేచి కూర్చుని మొవ్వ గోపాలుని ధ్యానము ప్రారంభించెను. ఆయనలో ఏదో

నూతన శక్తి ప్రవేశించి, తెల్లవారే లోగా 1500 పదాలనూ పూర్తి చేసెను. మోహనాంగి, క్షేత్రయ్య ఈ సంఘటనతో చాల ఆనందాశ్చర్యాలకు లోనయ్యారు. తమ మొవ్వగోపాలుడే ఈ పని చేయించగలిగిన సమర్థుడని గ్రహించి ఇంక ఆలశ్యం చేయకుండా వెంటనే మొవ్వకి బయలుదేరాలని నవాబు గారి దగ్గరకు వెళ్ళారు. విషయం తెలుసుకున్న తులసిమూర్తి, కమల తమ అజ్ఞాన్ని మన్నించమని క్షేత్రయ్యని వేడుకున్నారు. నవాబు గారు క్షేత్రయ్యని ఘనంగా సన్మానించి, సత్కరించి, క్షేత్రయ్య నీకు, ఆ మొవ్వ గోపాలునికి తేడా లేదు..నువ్వే ఆ మొవ్వ గోపాలుడివి నీకు ఆతిథ్యం ఇచ్చిన నేను ధన్యుడిని అని ఆయనను సాదరంగా మొవ్వకి సాగనంపారు.

అమితానందంతో మొవ్వకు బయలుదేరిన క్షేత్రయ్య మార్గమధ్యంలో భద్రాచల రాముడినీ, తిరుపతి శ్రీవేంకటేశ్వరుణ్ణీ దర్శించుకొనెను. ఏడుకొండలు ఎక్కి ఆ తరువాత ఆ స్వామి దర్శనం చేసుకుని ఆ వేంకటపతిపై కొన్ని పదములు కూర్చి పాడెను. క్షేత్రయ్య తన యొక్క తనువు, మనస్సు, ధనాన్నీ అన్నిటినీ మొవ్వ గోపాలుని పాదాల చెంత సమర్పించిన మహాభక్తుడు. అందుకే ఆయనకు ఏ దైవాన్ని చూసినా ఆ మొవ్వ గోపాలుడే కనిపించేవాడు.

మొవ్వ వదిలిపెట్టి వెళ్ళిన తరువాత తిరిగి మొవ్వ చేరేలోపు సుమారు పది సంవత్సరాల కాలంలో క్షేత్రయ్య కాపిగిరి, తిరుపత్తూరు, చక్కిరపురం, కొవిటూరు, చిదంబరం, తిరువల్లూరు, వేదనారయనపురం, కాంచీపురం, తిరుపతి, పాలగిరి, శ్రీశైలం, హంపి, మధురై, శ్రీరంగం, మహాదేవపట్నం, రామేశ్వరం, భద్రాచలం మొదలైన పుణ్య క్షేత్రాలన్ని దర్శించి తరించాడు. ఆ రోజులలో ఇన్ని క్షేత్రాలు దర్శించ గలిగాడంటే, ఇది కేవలం మొవ్వ గోపాలుని ఆశీర్వాద బలం తప్ప ఇంకేమీ కాదు.

ఈ పుణ్య క్షేత్రాలన్నీ దర్శించి ఓ కృష్ణాష్టమి రోజుకి మొవ్వ గ్రామం చేరుకున్నాడు క్షేత్రయ్య. గ్రామంలో ప్రజలందరూ ఘన స్వాగతం పలికి ఎంతో ఆదరాభిమానాలతో మన క్షేత్రయ్యని ఆహ్వానించారు. మొవ్వ గోపాలునుని దర్శించుకున్న క్షేత్రయ్య, మోహనాంగి ఇద్దరూ ఆనంద భాష్పాలతో ఆ స్వామిని అర్చించారు. క్షేత్రయ్య పాడగా, మోహనంగినాట్యంచేస్తూ ఉంటేఅందరికళ్ళకీరాధాకృష్ణులు సాక్షాత్కరించినట్లుగా అనిపించిందట. అలా అందరూ చూస్తూ ఉండగానే క్షేత్రయ్య ఆత్మ ఆ పరమాత్మలో ఐక్యం చెందింది... ఈ సంఘటన చూసిన మరుక్షణం మోహనాంగి కూడా క్షేత్రయ్య పాదాల చెంత ప్రాణం వదిలింది...వారిని ఏ పనికోసం ఇక్కడికి ఆ మొవ్వ గోపాలుడు పంపించాడొ ఆ పని ముగియగానే తనలోకే ఐక్యం చేసుకున్నాడు ఆ గోపాలుడు. ఈ విధంగా క్షేత్రయ్య ధన్యుడయ్యాడు.

క్షేత్రయ్య పదాలలో ఆనాటి తెలుగు భాష, జాతీయాలు పుష్కలంగా కనిపిస్తాయి. వాటితో పాటుగా మొవ్వ గోపాలుని ప్రస్తావనా వినిపిస్తుంది. మువ్వ గోపాలుడంటే సామాన్యుడా! ముద్గలుడు అనే రుషికి స్వయంభువుగా ఇసుకదిబ్బలలో దొరికినవాడు. తాను ఏ క్షేత్రంలో తిరుగుతున్నా, క్షేత్రయ్య మనసు మొవ్వలోని మువ్వగోపాలుని మీదే లగ్నమై ఉండేది.

క్షేత్రయ్య తన జీవితకాలములో మొత్తంగా 4500 పదాలు రచించినట్లుగా తెలియచున్నది. మధురలో 2000 పదాలు, తంజావూరులో 1000, గోల్కొండ నవాబు గారి దగ్గర 1500 ఇలా రచించినప్పటికీ, 1950లో శ్రీ విస్సాఅప్పారావు గారు రచించిన "క్షేత్రయ్య పదాలు" పుస్తకంలో లభ్యమవుతున్నవి 330 అయితే తరువాత గిడుగు సీతాపతి గారి పుస్తకంలో లభ్యమవు తున్నవి 380. ఆయన రచనలలో చాలా పదాల్లో మొవ్వ గోపాల అన్న ముద్ర కనిపించగా, కొన్ని పదాలలో విజయరాఘవ, ఇభరాజవరద మొదలగు ముద్రలు కూడా కనిపిస్తాయి.

క్షేత్రయ్య ఈ పదాలన్నీ నాయకీ-నాయక భావనతో రచించడం వలన, పల్లవి, అనుపల్లవి, చరణం అను భాగాలుగా రచించడం వలన మరియు రచనలన్ని మోహన, కాపి, ఆనందభైరవి వంటి రక్తి రాగాలలోనే కొనసాగడం వలన, చక్కటి తాళములలో కూర్చడం వలన అభినయానికి చక్కటి ఆస్కారం కలిగి, ఈనాటికీ నృత్య ప్రదర్శనలలో విరివిగా ప్రదర్శించ బడుతున్నాయి. అసలు క్షేత్రయ్య పదాలకు బహుళ ప్రాచుర్యం కలిగించిన వారు సుప్రసిద్ధ వీణ విద్వాంసులు వీణా ధనమ్మాళ్, తంజావూరు బృందం వారు. దక్షిణ భారతదేశం లో కూచిపూడి, భరతనాట్యం మొదలగు అన్ని ప్రక్రియలలో విరివిగా ప్రదర్శించ బడుతున్నాయి.

**కొన్ని బహుళ ప్రాచుర్యం పొందిన క్షేత్రయ్య పదాలు:**

1. ''ఎంత చక్కని వాడే నా సామి వీడెంత చక్కని వాడ''
2. ''ఇంత ప్రొద్దాయె ఇంక వాడేమి వచ్చేని''
3. ''ఇంక నిన్ను బోనిత్తునా ఇభ రాజ వరదా''
4. ''అలుక దీరెనా నేడైన నీ అలుక దీరెనా''
5. ''అలిగితే భాగ్యమాయె మరేమి వాడలగితే భాగ్య మాయె''

జీవించినంత కాలం ఆ మొవ్వ గోపాలుని స్మరణలోనే తన జీవితాన్ని సార్థకం చేసుకున్న భక్తాగ్రగణ్యుడు క్షేత్రయ్య.

**ఓం నమో భగవతే వాసుదేవాయనమః**

# తిరుమల సర్వస్వం




– పల్లపోతు వాణిశ్రీ

**గత సంచిక తరువాయి**

## త్రోవ నరసింహాలయం

మరికొన్ని మెట్లు ఎక్కిన తరువాత – 2,850 మెట్టుపై – మార్గానికి ఎడమప్రక్కగా శాఖోపశాఖలుగా విస్తరించి ఉన్న వటవృక్షం చుట్టూ పూలమొక్కలు పెంచి, నయనానందకరమైన విశ్రాంతి స్థలంగా తీర్చిదిద్దారు. దాని తరువాత వచ్చేదే ''త్రోవ నరసింహాలయం''. దీన్ని చాలా శక్తివంతమైన నారసింహ క్షేత్రంగా చెబుతారు. హిరణ్యకశిపుడి వధ ఇక్కడే జరిగినట్లు, తదనంతరం చెంచులక్ష్మి ఉగ్రనరసింహుణ్ణి ఈ ప్రదేశంలోనే శాంతింప చేసినట్లు కొన్ని పురాణాల్లో చెప్పబడింది. ఈ మధ్యనే పునరుద్ధరింపబడిన ఈ ఆలయ గర్భాలయంలో స్వయంభువుగా వెలసిన, సాలగ్రామ శిలారూపుడైన నారసింహుడు లక్ష్మీదేవిని ఎడమ తొడపై కూర్చుండబెట్టుకుని దర్శనమిస్తాడు. ఈ ప్రదేశంలో కనకధారా స్తోత్రం పఠిస్తే లక్ష్మీదేవి కటాక్షం శీఘ్రంగా లభిస్తుందని భక్తులు నమ్ముతుండడంతో ఇక్కడ తి.తి.దే వారు ఆ స్తోత్రం చెక్కబడిన ఉన్న గ్రానైట్ పలకలను అమర్చారు. ఈ ఆలయాన్ని యాత్రికులకు మార్గమధ్యంలో దుష్టశక్తుల నుండి రక్షణ కల్పించే ఉద్దేశంతో సాళువ నరసింహరాయలు 1485వ సంవత్సరంలో పునరుద్ధరించాడు. ఈ ప్రాంతాన్ని సప్తగిరుల్లో ఒకటైన ''వృషభాద్రి'' పర్వతంగా భావిస్తారు. ఈ ఆలయాన్ని గురించిన ఇంకా అనేక పౌరాణిక కథనాలు ప్రాచుర్యంలో ఉన్నాయి.

ఈ ఆలయం వెనుకనున్న మరో చిన్న ఆలయంలో యోగ నరసింహస్వామి 'లింగస్వరూప' ధారియై దర్శనమిస్తాడు. ఈ ఆలయాన్ని దాటిన వెనువెంటనే, దర్శన సమయం నిర్దేశించి ఉన్న టోకెన్ పై తి.తి.దే వారు అధికారిక స్టాంపు ముద్రిస్తారు. ఆ ముద్ర ఉంటేనే శ్రీవారి దర్శనానికి అనుమతిస్తారు.

అక్కడి నుండి కొన్నిమెట్లు దిగిన తరువాత, కొండపై నుండి వాహనాలు దిగివచ్చే రహదారిని వ్యతిరేకదిశలో కలుపుతూ నూతనంగా నిర్మించిన బడ్డ తోరణం ఉంది. ఆ తోరణం గుండా వాహనమార్గం లోనికి ప్రవేశించిన తరువాత, అక్కడినుండి మెట్లులేని, సుమారు 2 కిలోమీటర్ల దూరం ఉండే నడకదారి ప్రారంభమవుతుంది.

## అవ్వాచారి కోన

శ్రీ వ నరసింహాలయం సందర్శించుకుని, కొన్ని మెట్లు దిగి, తోరణం గుండా వాహనమార్గం లోనికి వ్యతిరేకదిశలో ప్రవేశించగానే కొద్దిదూరంలో మనకు కుడిప్రక్కగా ప్రప్రథమ వీక్షణంలో భీతి గొలిపించే, సువిశాలమైన కొన్ని వందల అడుగుల లోతైన, పచ్చదనంతో పరిఢవిల్లే అగాధం కనిపిస్తుంది. ముందు జాగ్రత్త చర్యగా ఆ లోయ అంచులకు లోహపు కంచె వేయబడింది. ఆ లోయలోకి దృష్టి సారించగానే, ప్రకృతి శోభతో మనసు పులకరించి పోతుంది, లోయకు అవల ఉన్న సమున్నతమైన శిఖరాలపై నెలకొల్పబడిన గాలిమరలు గిరగిరా తిరుగుతూ, విష్ణుమూర్తి ఆయుధమైన సుదర్శన చక్రాన్ని తలపిస్తాయి. సమస్త వృక్షజాతులకు ఆలవాలమైన ఈ లోయలో ఇప్పటికీ అనేక క్రూరమృగాలు సంచరిస్తాయని స్థానికులు విశ్వసిస్తారు. ఎడమవైపున ఆకాశాన్ని చుంబించే శిఖరాలు, కుడివైపున పాతాళం స్పృశించే లోయ సృష్టిలోని సోయగమంతా ఇక్కడే ప్రోగుపడినట్లు అనిపిస్తుంది. రహదారికి ఎడమ ప్రక్కన ఉన్న శిఖరపు టంచులలో పెరుగుతున్న నిమ్మగడ్డి సువాసనలు ఆ ప్రదేశమంతా గుబాళిస్తాయి.


## సప్త మాతృకలు

ఆ నడక దారిలోనే రహదారికి ఎడమప్రక్కగా ఒక చిన్న తలుపులు లేని ఆలయంలో, ఏడు రాతి విగ్రహాలు పూజ లందు కుంటుంటాయి. ఈ ఏడుగురు అమ్మవార్లను "సప్తమాతృకలు" లేదా "శ్రీవేంకటేశ్వరుని అక్కగార్లు" గా పిలుస్తారు. ఇక్కడ రోడ్డు మార్గం వేసేటప్పుడు కొన్ని దుర్ఘటనలు సంభవించి, ఎంతకూ రోడ్డు పూర్తికాక పోవడంతో, ఎక్కడో కీకారణ్యంలో చెట్టు క్రింద ఉన్న ఈ ఏడుగురు అమ్మవార్లను ఈ ప్రదేశానికి తెచ్చి పూజించడంతో రోడ్డు కార్యక్రమం సజావుగా సాగి పోయిందని చెబుతారు. ఈ దేవతలందరూ బ్రహ్మచారిణులు అని, ఆకాశరాజు తన కుమార్తె-అల్లుని రక్షణ నిమిత్తం ఈ ఏడుగురు యువతులను అలమేలు మంగమ్మ వారితో పాటుగా పంపించారని, వారు పగలంతా ఈ ఆలయంలో నివసిస్తూ, రాత్రి వేళల్లో సూక్ష్మరూప ధారులై సప్తగిరి శిఖరాలను కాపు కాస్తుంటారని – ప్రజలు విశ్వసిస్తారు. కొందరైతే, ఈ ఏడుగురు సాక్షాత్తు స్వామివారికి అక్కగార్లని, తమ ముద్దుల తమ్ముణ్ణి నిరంతరం కనిపెట్టుకుని ఉంటారని కూడా విశ్వసిస్తారు. వీరిని దర్శించుకుని వెళితే, ఆ దేవతల అనుగ్రహంతో శ్రీవారి దర్శనం సజావుగా జరుగుతుందని భక్తుల నమ్మకం. తిరుపతి పట్టణపు గ్రామదేవత అయిన గంగమ్మతల్లి శ్రీవారికి మరో అక్కగారని భావిస్తారు. అందుకే, ప్రతిసంవత్సరం స్వామివారి ఆలయం నుండి ఆ దేవతకు సకల లాంఛనాలతో పుట్టింటి కానుకలను పంపించే సాంప్రదాయం ఈనాటికీ ఉంది.

'అవ్వాచారి కోన' అందాలను ఆస్వాదిస్తూ, సప్తమాతృకలను సందర్శించుకుని, దాదాపు రెండు కిలోమీటర్ల దూరం నడవగానే మనకు ఎడమ ప్రక్కగా "మోకాలిమిట్ట గోపురం" దర్శనమిస్తుంది.

## మోకాలిమిట్ట గోపురం లేదా అచ్యుతరాయ గోపురం

మోకాలి మిట్ట ప్రారంభంలో, 2910వ మెట్టు వద్ద మూడు అంతస్తులు, ఏడు కలశాలు, రెండు ద్వారబంధాలతో నిర్మించబడ్డ అద్భుతమైన గోపురాన్ని "మోకాలిమిట్ట గోపురం" లేదా "అచ్యుతరాయ గోపురం" గా పిలుస్తారు. 16వ శతాబ్ది ప్రథమార్ధంలో "తుళువ" వంశపు చక్రవర్తి,



శ్రీకృష్ణదేవరాయలు తమ్ముడు అయిన అచ్యుతరాయలు ఈ గోపురాన్ని నిర్మించాడు. అయితే, ఈనాడు మనం చూస్తున్న గోపురం మాత్రం, తిరుపతికి సమీపాన ఉన్న కొత్తూరు గ్రామంలోని ఒక శిథిలమైన ఆలయానికి చెందినది. 1998వ సం. లో, ఆ గోపురాన్ని ఇక్కడకు తరలించి, పూర్తిగా శిథిలమైపోయిన అసలు గోపురం స్థానంలో దానిని

పునఃస్థాపించారు. ఇప్పుడున్న మెట్లదారి నిర్మించడానికి ముందు అంటే దాదాపు 150 సంవత్సరాల క్రితం సప్తమాతృకల ఆలయ సమీపం నుండి పెద్ద లోయ లోనికి దిగి, మళ్లీ ఎత్తైన మెట్లెక్కితే ఈ గోపురాన్ని చేరుకునేవారు. ఇక్కడి నుండి ప్రారంభమయ్యే మెట్లు చాలా ఎత్తుగా, ఎక్కడానికి క్లిష్టంగా ఉండేవి. ఆ మెట్లను మోకాళ్ళపై చేతులు ఆన్చి, ఆపసోపాలు పడుతూ ఎక్కాల్సి వచ్చేది. అందువల్ల ఇది "మోకాలిమిట్ట గోపురం" గా ప్రసిద్ధికెక్కింది. అయితే, నూతన మెట్లమార్గం నిర్మించిన తరువాత, ఇప్పటి మెట్లు అంత కష్టంగా లేవు. అయినప్పటికీ మెట్లు నిటారుగా ఉండటం వల్ల, మధ్య మధ్యలో నడకబాట అతి తక్కువగా ఉన్నందువల్ల, ఇప్పటికీ ఈ మెట్లను అధిరోహించడం కొద్దిగా శ్రమతో కూడుకున్నదే!

సాక్షాత్తు శ్రీనివాసుడు కొలువై ఉండే, సప్తగిరులలో ఒకటైన వెంకటాద్రిపర్వతం ఇక్కడే ప్రారంభ మవుతుందని చెబుతారు. అందుచేత ఈ మెట్లు అత్యంత పవిత్రమైనవి. అన్నమాచార్యుడు తన బాల్యంలో మొట్టమొదటిసారిగా తిరుమలక్షేత్రాన్ని దర్శించుకున్నప్పుడు తెలియనితనంతో, పాదరక్షలు ధరించి ఈ మోకాలిపర్వతం మెట్లు ఎక్కడం ప్రారంభించగానే సొమ్మసిల్లి పోయాడు. ఆ క్షణంలో అలమేలుమంగ అమ్మవారు అన్నమయ్యకు సాక్షాత్కరించి సాలగ్రామశిలగా వెలసిన శ్రీనివాసుడు నివసించే వెంకటాద్రి పర్వతాన్ని పాదరక్షలతో అధిరోహించ రాదని నచ్చజెప్పింది. దాంతో తన తప్పు తెలుసుకొన్న అన్నమయ్య పాదరక్షలను విసిరివేసి, ఆ శ్రీనివాసుని స్తుతిస్తూ శ్రీవేంకటేశ్వరశతకం అనే నూరు పద్యాలు కలిగిన సంకలనాన్ని ఆశువుగా కీర్తించాడు. తరువాతి కాలంలో ఇంకెందరో మహానుభావులు కూడా ఈ పర్వతాన్ని మోకాళ్ళతో అధిరోహించారు. అంతటి పరమ పవిత్రమైన ఈ పర్వతం మెట్లలో, కనీసం కొన్నింటినైనా, ఇప్పుడు కూడా చాలామంది మోకాళ్ళతో అధిరోహిస్తారు. మరికొందరు సుమారు ఆరు వందలకు పైగా ఉన్న ఈ మెట్లన్నింటినీ పసుపు కుంకుమలతో పూజిస్తూ, వాటికి కర్పూరహారతి నిస్తూ, కొండ పైకి చేరుకుంటారు. ఈ మెట్లు ఎక్కుతున్నంత సేపు తిరుమల క్షేత్రంలో లౌడ్ స్పీకర్ల ద్వారా ప్రసారమయ్యే అన్నమయ్య కీర్తనలు చాలా దగ్గరగా వినిపిస్తుంటాయి. ఉదయం ఎంత త్వరగా బయల్దేరినప్పటికీ మోకాళ్ళ పర్వతం చేరుకునేటప్పటికి దాదాపు మధ్యాహ్నం కావటంతో, ఈ మెట్లెక్కు తున్నప్పుడు చలికాలంలో కూడా చిరుచెమటలు పడతాయి. అయినా ఎప్పటికప్పుడు మెట్ల సంఖ్యను చూస్తూ, జోరుగా వినవస్తున్న గోవిందనామాలలో వంత కలుపుతూ, కొండను సమీపిస్తున్నా మనే ఆనందంతో శారీరకబాధను మరచిపోతాం.

## త్రోవ భాష్యకారుల సన్నిధి

"మోకాళ్ళ పర్వతాన్ని" మోకాళ్ళతో అధిరోహించిన వారిలో అగ్రగణ్యుడు శ్రీమద్రామానుజాచార్యుల వారు. ఆ



విధంగా పర్వతాన్ని ఎక్కుతున్నప్పుడు మోకాళ్ళకు గాయమవ్వ దంతో, మార్గమధ్యంలో కొంతసేపు విశ్రమించాడు. ఆ విషయం తెలియగానే తిరుమలలో నివసించే, వారి గురువుగారైన తిరుమలనంబి, శిష్యుడైన అనంతాళ్వార్ పరుగు పరుగున కొన్ని మెట్లు దిగివచ్చి, విశ్రాంతి తీసుకుంటున్న రామానుజాచార్యుల వారిని పరామర్శించి, కొండపైకి స్వాగతం పలికారు. వారు కొండపై నుంచి వస్తూ, కొన్ని ఆమ్రఫలాలను శ్రీవారి ప్రసాదంగా తెచ్చి రామానుజునుకి ప్రసాదించారు. వాటిని అత్యంత భక్తితో స్వీకరించిన రామానుజులవారు, ఉచ్చిష్టాన్ని (ఫలం తినగా మిగిలిన మామిడి టెంకలు) అక్కడే వదిలివేశారు. కొన్నాళ్ళకు ఆ టెంకలు మొక్కలుగా మొలచి, వృక్షాలై తియ్యటి ఫలాలను ప్రసాదిస్తూ, బాటసారులకు నీడనిచ్చేవి. ప్రస్తుతం ఇక్కడ ఉన్న మామిడి చెట్లు కూడా, ఆ చెట్ల సంతతికి చెందినవే!

ఆ విషయం తెలుసుకున్న తరువాతి తరాలవారు అక్కడ నమస్కార ముద్రలోనున్న రామానుజుల విగ్రహాన్ని ప్రతిష్ఠించడంతో, ఆ ప్రదేశం "భాష్యకార్ల సన్నిధి" గా పేరు గాంచింది. కొండకు వెళ్ళే త్రోవలో ఉండటం వల్ల దీన్ని "త్రోవ భాష్యకార్ల సన్నిధి" గా కూడా పిలుస్తారు. ఈ మధ్యకాలంలో అక్కడ, 3,260వ మెట్టు వద్ద, రామానుజుల వారికి దేవాలయాన్ని కూడా నిర్మించారు. ఈ సన్నిధికి ఎదురుగా ఉన్న శిలపై పాదపద్మాలు చెక్కబడి ఉన్నాయి. అవి రామానుజులవారు పూజించుకునే "శ్రీవారిపాదాలు" అని కొందరు, "రామానుజుల వారి పాదాలు" అని మరికొందరు భావిస్తారు.

## అమ్మవారి సారె పెట్టెలు

రామానుజుల వారికి నమస్కరించుకుని మరికొన్ని మెట్లెక్కగానే మనకు కుడిప్రక్కగా 3302వ మెట్టుపై; నాలుగు భుజాలతో కోణాలతో తీర్చిదిద్దినట్లున్న, చారలు కలిగిన, పూర్వకాలంలో ఉపయోగించుకునే "కావడిపెట్టలు (40– 50 ఏళ్ళ క్రితం మనం ఉపయోగించుకున్న ట్రంకు పెట్టెలు)" లేదా "భోషాణం పెట్టెల" ఆకారంలో కొన్ని రాతి శిలలు అస్తవ్యస్తంగా కనిపిస్తాయి. వీటికి సంబంధించి, ఆసక్తికరమైన కథనాలున్నాయి:

**ఒక కథనం ప్రకారం:** సీతారామలక్ష్మణులు వనవాసానికి వెడలు తున్నప్పుడు కైకేయి, ఏడువారాల నగలు తనతో తోడ్కొని వెళ్ళటానికి సీతమ్మవారిని అనుమతించింది. ఆ నగల పెట్టెలను సీతమ్మవారు వనవాస సమయంలో ఇక్కడ భద్రపరిచగా, సీతమ్మవారు వాటిని తిరిగి తీసుకోక పోవడంతో అవే కాలాంతరంలో శిలలుగా మారాయి. అయితే, సీతారామలక్ష్మణులు వనవాస సమయంలో తిరుమలక్షేత్రానికి వచ్చినట్లు ఏ రామాయణకావ్యంలోనూ ఉటంకించక పోవటంవల్ల ఈ కథనం సందేహాస్పద మనిపిస్తుంది.

**మరో కథనం ప్రకారం:** పద్మావతి పరిణయానంతరం, ఆకాశరాజు తనయ పద్మావతితో పాటుగా; విశేషమైన ధనకనకాలను, వజ్రఖచిత ఆభరణాలను, వస్తు విశేషాలను, ఖాద్యసామగ్రినీ పెద్ద పెద్ద కావడి పెట్టెలలో సర్ది, సారెగా పంపించాడు. వందలాది ఏనుగులు, గుర్రాలు ఈ పెట్టెలను తమపై కెక్కించుకొని, అలిపిరిమార్గం ద్వారా తిరుమలకు చేరుకుంటూ, మోకాలి పర్వతాన్ని సమీపించాయి. అంతకు కొద్ది సమయం ముందే "శ్రీవారిమెట్ల" మార్గం ద్వారా ఆనందనిలయానికి చేరుకున్న శ్రీనివాసుడు పద్మావతీదేవితో, 'కొత్త కాపురానికి కావలసిన వస్తుసామగ్రి అంతా వచ్చినట్లేనా?' అని ప్రశ్నించాడు. అందుకు పద్మావతీదేవి తనతో పాటుగా తెచ్చుకున్న సారె నంతా గుర్తుకు తెచ్చుకుని సకలమైన వస్తువులు సమకూరాయని, కేవలం కరివేపాకు మాత్రం తీసుకురాలేదని చెప్పింది. ఈ తప్పిదానికి అలక వహించిన శ్రీనివాసుడు అంతటి చక్రవర్తి ఆకాశరాజుకు ఇంత చిన్న విషయం తెలియదా? అని ప్రశ్నించాడు. అంతేకాకుండా, ఆకాశరాజు ప్రేమగా పంపిన సారెనంతా తిరస్కరించి, ఇకనుండి తిరుమల క్షేత్రంలో కరివేపాకు వాడకాన్ని పూర్తిగా నిషేధించమని కూడా శాసించాడు. తిరుమలలో ఆ శాసనం నేడు కూడా అమలులో ఉంది, ఆంధ్రులు పులిహోరలో తప్పనిసరిగా ఉపయోగించే కరివేపాకు, తిరుమల ఆలయం లోని పులిహోర ప్రసాదంలో మచ్చుకు కూడా కానరాదు. ఈసారి జాగ్రత్తగా గమనించండి.

శ్రీవారి అస్వీకారానికి గురైన ఆ సారె పెట్టెలన్నీ బండశిలలుగా మారి, మోకాలిమిట్ట మార్గంలో కలియుగారంభం నుంచి అచేతనంగా పడి ఉన్నాయి.

అట్టి సారెపెట్టెలలో ఒకదానిపై ఆంజనేయుడు కొలువుండి, ఆకాశరాజు తన కుమార్తెకు, అల్లునికి ఎంతో ప్రేమగా పంపించిన సారెకు రక్షణభారం వహిస్తూ, స్వామివారు ఎప్పుడెప్పుడు కరుణించి ఈ సారెను స్వీకరిస్తారా అని ఎదురు చూస్తున్నాడు. సకల పాపాలను తొలగించి, అందరినీ అక్కున జేర్చుకునే ఆ శ్రీవారు ఇంత స్వల్ప విషయానికి అలక పూనటం వెనక ఏ మహత్తరమైన పరమార్థం దాగి ఉందో? ఎంతటి లోకకళ్యాణం సమకూర నుందో? స్వామివారి ఈ చిత్రమైన లీలలో మనబోంట్ల ఊహకందని నిగూఢ



రహస్యమేదో నిక్షిప్తమై ఉండి ఉంటుంది!

సారె పెట్టెపై కొలువై ఉన్న ఆంజనేయునికి అంజలి ఘటించి, మరి కొన్ని మెట్లు ఎక్కి, సరిగ్గా 3550వ మెట్టు చేరగానే, సాక్షాత్తు శ్రీవారు సాక్షాత్కరించిన ఆనందం కలుగుతుంది. అప్రయత్నంగా భక్తుల నోటినుండి వెలువడే గోవిందనామాలతో దిక్కులు పిక్కటిల్లుతాయి.

దారి పొడవునా మెట్లను పూజించుకుంటూ రాగా మిగిలిన పసుపు–కుంకుమను ఆఖరి మెట్టుకు సమర్పించటంతో, 3,550వ మెట్టుపై ఎల్లవేళలా పెద్ద "కుంకుమ రాసి" అరుణ వర్ణంలో కానవస్తుంది. అక్కడే కర్పూరనీరాజనం కూడా సమర్పించి, 'స్వామివారి సన్నిధికి ఎపుడెపుడు ఏతెంచుదామా' అన్న ఆత్రుతతో రహదారిపై కొద్ది దూరం నడుచుకుంటూ, ఈనాడు "టోల్ గేటు మంటపం" గా పిలువబడే 48 స్తంభాల ప్రాచీన మంటపం దాటి, మనకు కుడి ప్రక్కనే ఉన్న గోదాదేవి ప్రతిమకు నమస్కరించుకుంటాం! ఈ మంటపాన్నే ఇదివరకు 'బళ్ళమంటపం' గా పిలిచేవారు. మెట్లు నిర్మించడానికి పూర్వం, ఎడ్లబళ్ళు, గుర్రపుబళ్ళపై కొండకు చేరుకున్న భక్తులు, తమ బళ్ళను ఈ మంటపం ముందు నిలపడం వల్ల ఈ మంటపానికి 'బళ్ళమంటపం' అనే పేరొచ్చింది.


చివరిగా, అక్కడే ఉన్న తి.తి.దే. కార్యాలయంలో మనం అలిపిరి వద్ద నడక ప్రారంభించే ముందు జమ చేసిన సామానులను, పాదరక్షలను తిరిగి తీసుకుని, ముందే బుక్ చేసుకున్న కాటేజీకో లేదా క్యూ కాంప్లెక్సుకో పరుగు పెడతాం!

కానీ, వందేళ్ళక్రితం పరిస్థితి ఎంతో భిన్నంగా ఉండేది. అత్యంత ప్రయాసతో, దాదాపు రెండు రోజులు ప్రయాణం చేసి, అలసి–సొలసి తిరుమలకు విచ్చేసిన భక్తులు ఈ మంటపాల లోనే విశ్రాంతి తీసుకునే వారు. వాటిలో స్నానపానాలకు, భోజనాదులకు, విశ్రాంతికీ కావలసిన వసతులన్నీ ఉండేవి. రాత్రికి మంటపాల లోనే విశ్రమించి, మరునాటి ఉదయం పరగడుపుతో కాలినడకన శ్రీవారి సన్నిధికి చేరుకుని, మహాద్వార సమీపంలోనే తలనీలాలు సమర్పించుకొని, స్వామిపుష్కరిణిలో పవిత్రస్నాన మాచరించి, క్షేత్రనియమానుసారం ముందుగా ఆదివరాహుణ్ణి దర్శించుకొని, తడిబట్టలతోనే మహాద్వారం లోనుంచి నేరుగా విమానప్రదక్షిణ మార్గానికి చేరుకుని, పొర్లుదండాలు పెట్టుకుని, విమానవేంకటేశ్వరునికి సమస్కరించి, గర్భాలయం ముందున్న "కులశేఖరపడి" చేరుకుని, స్వామివారిని తనివితీరా ఆపాదమస్తకం దర్శించి, ముడుపులు చెల్లించి, ప్రసాదాలను అమృత తుల్యంగా భావించి ఆర్తితో స్వీకరించేవారు. తదుపరి తిరుమల యాత్రకు అప్పుడే నాందీ ప్రస్తావన జరిగేది కూడా!

తిరుమల నుండి తిరిగి స్వగృహానికి చేరుకున్న తరువాత, ఇరుగుపొరుగు వారందరినీ ఆహ్వానించి, యాత్రావిశేషాలను మధురానుభూతులను కథలు కథలుగా వర్ణించి, తమతో బాటుగా తీసుకువచ్చిన లడ్డూ ప్రసాదాలను, చిరు కానుకలను పంచిపెట్టి వేడుకలా జరుపు కునేవారు.

**(సశేషం)**

ధారావాహికం



# శ్రీమాన్ అనంతాళ్వాన్ల దివ్య చరితము

- పి. వేంకట రామిరెడ్డి

## పదునొకండవ అధ్యాయము

### శ్రీరామానుజుల వారు తన విగ్రహమును అనంతాళ్వాన్లకు ఇచ్చుట

ముందు అధ్యాయములో చెప్పిన రీతిగ, తన గురువగు శ్రీరామానుజుల వారి తిరుమల అధిరోహక కారకుడు తానై, శ్రీరామానుజుల శిష్య బృందమున, తన స్థాయిని సుస్థిరముగ చేసుకుని, శిష్యచరిత్రన తన నామమును సువర్ణాక్షరములు లిఖియింప చేయ ఆవశ్యకతను అనంతాళ్వాన్ తాను చెప్పకనే చాటి చెప్పెను.

తిరుమల నంబి ఇంట నొక్క సంవత్సర కాలము, తిరుపతిలో ఉండి, కొలది దినములలో తాను శ్రీరంగమునకు బయలుదేరవలెననుకునుచూ, శ్రీరామానుజులవారు, అనంతాళ్వాన్ను, తన వద్దకు రమ్మని కబురుపంప, అనంతాళ్వాన్ హుటాహుటిన తన గురుని చెంతకు వచ్చెను. అపుడు శ్రీరామానుజులు, తాను శ్రీరంగమున, శ్రీరంగనాథుని సేవన తరియింతునని, తానిక తిరుమలకు కానీ, తిరుపతికి కానీ రాలేనని పలుకగా, అది విని దుఃఖితుడైన అనంతాళ్వాన్ చూచి, అనంతా! నిన్ను విడచి నేనెట్లుండగలను. మిగిలిన శిష్యులు వేరు, నీవు నాకు చాలా ప్రత్యేకమగు శిష్యుడవు. అను నిత్యము నీ అంతరంగమున చేయు నా నామస్మరణ ఘోష, అనుక్షణము నాకు వినిపించుచునే యుండును. మన కర్తవ్యములు వేరైనా, గమ్యము ఒక్కటే, నీవు మదిన స్మరియించగనే, నేను నీ ఎదుటకు వచ్చి నిలుతును. నా ఆశీర్వాద బలము, కరుణా కటాక్ష వీక్షణములు నీపై సదా వర్షించుచునే యుండును. నీవు, నా తిరుమల అధిరోహణ

కారకుడవైతివని , నేను తిరుమల నుండి అవరోహనము చేయు వేళ , నీవు నా వియోగము భరించలేనని పలుక, నీకు, యోగముద్రారూపితమైన నా విగ్రహమును, నేనే ఆలింగనము చేసి ఇచ్చితిని కదా! అను నిత్యము, ఆ విగ్రహ రూపమున, నన్ను చూచుకునుచూ, పూజలు చేయుచుంటివి కదా! నీ ఇంటిలోనున్నది నా విగ్రహము కాదు, నా ఈ దివ్య దేహ స్వరూపమే. అనంతా! ఇటు చూడుము, నేడు, నీవు నా వద్దకు వచ్చు మునుపు, చేసిన పుష్పపూజల గురుతులు, నీవు నాకు సమర్పించిన, పుష్పమాలలు అని శ్రీ రామానుజుల వారు పలుక, ఆపాద మస్తకము, తన గురువగు శ్రీ రామానుజుల వారి దివ్య దేహముపై, నాడు తాను చేసిన పూజల, పుష్పచిహ్నముల చూచి, ఆనంద పరవశుడయ్యెను మన అనంతార్యుల వారు. తన గురువునకు సాష్టాంగ నమస్కారములొనరించెను. మరల అట్లే కట్టడి చేసెను. అధ్యయనోత్సవ ప్రారంభదినము నుండి చివరి రోజు వరకూ శ్రీనివాసుని ఉభయదేవేరులతో, విష్వక్షేన, శ్రీరామానుజ సహితముగ విచ్చేయింప చేయవలెనని, వారి సమక్షమున అధ్యయనోత్సవములు జరుపవలెనని నిశ్చయించిరి.

అధ్యయనోత్సవ ప్రధాన ఏర్పాట్ల వెనుక ఎంతటి చరిత్రయున్నదో, ఆ ఏర్పాట్ల వెనుక శ్రీనివాస ప్రభుడు ప్రధాన సూత్రధారి కాగ, అనంతాళ్వాన్ పాత్రధారి అయ్యెను. ఎంతటి ఘనకార్యముల, మన అనంతాళ్వాన్ పాదుకొల్పెనో చూడుము.

నాటిమొదలు, ఇప్పటికినీ, ఎప్పటికినీ, ఈ అధ్యయనోత్సవముల కొనసాగింపు జరుగుచునేయుండెను. నేటికినీ, అనంతాళ్వాన్ వంశస్థులు, అధ్యయనోత్సవముల ముగింపు సమయమున కణ్ణినుణ్ శిరుత్తంబు 10 పాశురాలను ఒకరోజు, రామానుజనూత్తందారి (108 పాశురాలు) నొకరోజు పాల్గొని, పఠియించి ఉభయ నాంచారులు కూడి శ్రీనివాసుడు, విశ్వక్షేన, రామానుజ సహితముగ అధ్యయ నోత్సవములకు అరుదెంచి, అనంతాళ్వాన్ వారి ఇంటి ఉభయమును గైకొనుచున్నాడు. తదుపరి ఆలయ మర్యాదల ప్రకారము మొదట శ్రీరామానుజుల వారికి, తదుపరి శ్రీ విశ్వక్సేనుల వారికి మర్యాద చేసి, అనంతరము అనంతాళ్వాన్ వంశస్థులకు, ఆలయ అధికారులకు మర్యాదలు చేసెదరు.

## శ్రీరామానుజుల వారి దేహ పరిత్యాగము

### అనంతాళ్వాన్‌ను ఆనందనిలయుడు అనునయించుట

ఒకనాటి ఉదయమున, శ్రీరంగము నుండి వైష్ణవోత్తముడు ఒకరు వచ్చి, అనంతాళ్వాన్తో, అయ్యా మన గురువగు శ్రీరామానుజుల వారు దేహ పరిత్యాగము చేసినారని తెలుప, అది విన్న అనంతాళ్వాన్ కుప్పకూలి, కంటికి మింటికి ధారగ కన్నీరు మున్నీరాయెను. మానసిక ప్రశాంతత కోల్పోయెను. ఆకలి దప్పుల మరచి, తాను అనునిత్యము సలిపేటి సంధ్యావందనాది కార్యముల, పుష్పమాలికాగ్రథనముల, శ్రీ వేంకటేశునికి చేసెడి పుష్పాలంకరణముల విడనాడెను. నిర్లిప్తుడై, నిరాతిశయుడై, నిర్వేదుడై, విషణ్ణవదనుడై, పుష్పతోటలో ఎక్కడో ఒక చోట కూర్చుని, ఎవ్వరితోను సరిగ మాట్లాడక, పట్టించుకునక పోవుచుండెను. ఆలయ ఆలన, పాలనల మరచెను. తాను తన గురువు కడకే పోవలయునని తలపోయసాగెను. ఇట్లు ఒక సంవత్సర కాలమాయెను. సాంవత్సరిక కార్యక్రమముల ఇంట తన తండ్రికి జరిపినట్లు జరిపెను.

ఇట ఆనందనిలయుడు, శ్రీ వేంకటేశ్వరుడు, అనంతాళ్వాన్ రాకకై ఎదురుచూడసాగెను. అనంతాళ్వాన్ నేడో, రేపో, తన బాధ మరచి, నావద్దకు రాకుండునా, విజ్ఞాన ఘనుడు, సర్వశాస్త్రకోవిదుడగు అనంతాళ్వాన్లకు దేహము గాని, బంధములు గాని, సంపదలు గాని అశాశ్వతములని తెలియకున్నదా? యనుకున్నట్టి శ్రీ వేంకటనాధుని ఆశలు, నిరాశలాయెను. రోజులు, వారములు, నెలలు కడచి నొక్క సంవత్సరము కాల చక్రమున తిరిగిపోయె.

ఇక అనంతాళ్వాన్ ఎడబాటు సహియింపగలేని వేంకటాచలాధీశుడు, ఒక అర్చకునికి గాన్పించి, నీవు పోయి, అనంతాళ్వానన్ను నేను రమ్మంటినని, తోడ్కొని రమ్మన, ఆ అర్చకుడు అట్లే గావించెను.

తన ఎదుట, తలవంచి దుఃఖితుడైన అనంతాళ్వాన్లను చూచి, శ్రీనివాసుడు ఇట్లనియె.

అనంతా! రామానుజుల వారు నీకొక్కడికే గురువుగాదు, నాకునూ గురువర్యులే. నీవు నీ దుఃఖమును, బాధను వెల్లడించుకున, నీకు నేనున్నాను, మరి నాలోని బాధ, దుఃఖముల వెడలగొట్టుకున, పంచుకున నాకెవ్వరున్నారు. మన గురువర్యులు శ్రీరామానుజుల వారు వైకుంఠమున, నా సమక్షమున సుఖాశీనుడయ్యున్నారు. ఇక నాకిక్కడ నీకన్న నెవ్వరు కలరు. నీకు నేనున్నాను. నీ కోరికలన్నియూ నేనే నెరవేర్తును. నిన్నుగూర్చి నీవు చింతించ పనిలేదు. నేను చూచుకుందును. అనంతా! ఇటు, నన్ను చూడుమన అనంతాళ్వాన్ తల పైకి ఎత్తి, శ్రీవేంకటనాధుని చూచి, పరవశించి, తనపై శ్రీనివాసునికి కల అభిమానము ప్రేమలకు, ఉబ్బితబ్బిబ్బయి అట్లైన తనకు రెండు వరములీయమని వేడ, శ్రీకాంతుడు అట్లే కోరుకొమ్మన అనంతాళ్వాన్ ఇట్లు కోరెను.

నా మొద టి కోర్కె ఏమన, నీచే శంఖు, చక్రములు ధరియింపచేసిన శ్రీరామానుజుల వారి దివ్యవైష్ణవ తత్వము, నీ దివ్యత్వము, శ్రీగురుని ప్రాముఖ్యములు లోకమునకు చాట, భగవద్రామానుజులు తాను స్పర్శించి, గుండెలకు హత్తుకుని, నాకు ఇచ్చిన తన యోగముద్రాంకిత విగ్రహరూపమును, నేటివరకూ నా ఇంట పూజలు అందుకుంటున్న ఆ విగ్రహమును, నీ ఆలయ ప్రాంగణముననే, సంపంగి ప్రాకారమున, నీకన్న కొంత ఎత్తున నిన్నే చూచుచున్నట్లు, దక్షిణాభిముఖునిగ ప్రతిష్ఠించ ఆనతీయవలెను. ఇది విన్నంతనే ఆనందనిలయుడు, భళా! అనంతా! నీ ఆచార్యప్రేమ. అట్లే ప్రతిష్ఠించుమని పలికెను.

ఇక రెండవ వరము ఏమియని శ్రీవేంకటనాధుడు అడుగ, అనంతాళ్వాన్, స్వామీ, వేంకటనాధ ఆచార్యుడన్న పదమునకు, అసలు, సిసలు, అర్థము, పరమార్థ రూపుడైనట్టి, మన ఆచార్యులగు భగవద్రామానుజుల గుణవర్ణనలతో కూడియున్న "ప్రపన్నగాయత్రి" లోని 108 పద్యములను లేదా ప్రబంధమును, అధ్యయన దినోత్సవ దినములలో, నొక దినము గానము చేయ, నీవే అరుదెంచి, నిలచి, విని, ఆనందించి, లోకుల నాశీర్వదించి, ఉద్ధరింపగ చేయవలయును. అట్లే అధ్యయన దినోత్సవముల విధిగ జరుగునట్లు చూచుకున వలయునని పలుక, ఆనందనిలయుడు, పరమాత్ముడు, పరమానందభరితుడయ్యి, సరియేయని పలికి, అనంతాళ్వాన్లకు తానే శఠారి, తీర్థ ప్రసాదములిచ్చి సత్కరించెను.

పిమ్మట శ్రీవేంకటేశ్వరుని ఆదేశముల మేరకు, అప్పటి వరకు, తన ఇంట ఉండి, పూజలందుకునుచున్న శ్రీరామానుజుల వారి యోగముద్రాంకిత విగ్రహమును, మంగళ వాయిద్యముల, అర్చక వేద విదుల మంత్ర ఘోషల, ఏకాంగిల దివ్య ప్రబంధ పఠనముల నడుమ, ఆనందనిలయము ఎడమ ప్రక్కన, నేటి శ్రీవారి హుండీ ఎదురుగ సంపంగి ప్రాకారమున, యోగ నారశింహుని ఆలయమునకు నొక ప్రక్క యామునోత్తరైకి, ప్రక్కనే, ప్రతిష్ఠించి, దానికి శ్రీ రామానుజాచార్యుల సన్నిధి (భాష్యకారుల సన్నిధి) యని నామమిడిరి మన అనంతాళ్వాన్.

అంతియేగాక, శ్రీరామానుజాచార్యుల పాద ముద్రల శఠకోపము నొకదానిని ప్రతిష్ఠించి ఆ పాద ముద్రల క్రింద తన శిరమున్నట్లు, తాను శ్రీరామానుజుల వారి పాదారవిందచ్ఛాయా రూపముననున్నట్లు, శ్రీరామానుజ పాదచ్ఛాయ పాదుకా తత్వమును కూడ తానుయనుభవింప కోరి, శ్రీరామానుజుల వారి పాదారవిందములకు తచ్ఛాయ కూడిన పాద పద్మములకు తన నామమింబిడెను.

తాను, తన గురువునకు గల సంబంధమును గూర్చి మూడు తనియన్లను (శ్లోకములను) పఠియించి తన పేర వ్యవస్థిత మగునట్లు చేసెను.

**మొదటి తనియన్:**

**శ్రీమద్రామానుజాచార్య శ్రీపాదాంభోరుహద్వయమ్**

**సదుత్తమాంగ సంధార్య మనంతార్య మహంభజే**

అర్థము: శ్రీమద్భగవద్రామానుజాచార్యుల వారి పరమ పవిత్రమైన శ్రీపాద ద్వయములను సత్పురుషుడనై, అనంతార్యులను నేను నా శిరముపై దాల్చి భజియించుచున్నాను.

**రెండవ తనియన్:**

**రామానుజ పదచ్ఛాయా గోవిందాహ్వాన పాయిని**

**తదాయత్త స్వరూపా సాజీయా నద్విశ్రమస్థలి**

అర్థము: ఏవిధముగనైతే గోవిందభట్టాచార్యుల జ్ఞానము వికసించిన పిమ్మట, శ్రీరామానుజులవారి పద్మపాదపుచ్ఛాయగా తానే అయి ఉన్నాడో, అట్టి శ్రీరామానుజుల వారి పాద పద్మముల కడనే నేనున్నూ విశ్రమింతును.

**మూడవ తనియన్:**

**పాదుకే యతి రాజస్య కథయంతి యదాహ్వయా**

**తస్య దాశరథేః పాదౌ శిరసా ధారయామ్యహమ్**

అర్థము: యతిరాజు మూర్తియగు దాశరధి అనగా శ్రీరామానుజాచార్యుల పాదుకలను నా శిరముపై సదా అలంకరించుకుందును.

ఇందువలననే, తిరుమలలోని రామానుజాచార్యుల సన్నిధి శఠగోపమును అనంతాళ్వాన్ యను పేరుతో పిలుచుదురు.

శ్రీ వేంకటేశ్వరుని అధ్యయనోత్సవ క్రమమున తప్పక శ్రీరామానుజుల వారి గుణ, గణ ప్రభోదితము వర్ణించేటి 108 పద్యముల "ప్రపన్న గాయత్రి" పఠనముల విన విశ్వక్సేన, రామానుజుల, సమక్షమున శ్రీ శ్రీనివాసుడు ఉభయదేవేరుల కూడి వచ్చి, తానై నిలచి, విని ఆనందించుచున్నాడు. అట్టి సమయమున, అనంతాళ్వాన్ తానూ, సూక్ష్మ శరీరధారియై తనగురుని అధ్యయన ప్రబంధోత్సవముల వినుచూ నేటికినీ సంతోషించుచున్నారు.

**ఇతిః శ్రీమాన్ అనంతాళ్వాన్ల దివ్య చరితము**

**జియ్యరు వ్యవస్థ ఏర్పాటు, అధ్యయనోత్సవాల ప్రారంభము**

**శ్రీరామానుజుల దేహ పరిత్యాగము**

**అనంతాళ్వాన్ ను, ఆనంద నిలయుడు అనునయించుట యను**

**పదవమూడవ అధ్యాయము సంపూర్ణః**




# తాదళన్ కోవెల

– ఇలపావులూరి వేంకటేశ్వర్లు

**గతంలో మనం శిర్కాలి చుట్టుపక్కల ఉన్న పదకొండు తిరునాన్గూర్ శ్రీవైష్ణవ దివ్యదేశాల గురించి తెలుసుకున్నాము. శిర్కాలి లోనే మరికొన్ని దివ్యదేశాలు ఉన్నాయి. కానీ అవి తిరునాన్గూర్ శ్రీవైష్ణవ దివ్యదేశాల క్రిందికి రావు. కానీ వాటిల్లో కూడా పాశురగానం చేసింది తిరుమంగై ఆళ్వార్ మాత్రమే! దివ్యదేశాలలో అధికశాతం శ్రీమహావిష్ణువు ఉపస్థిత, స్థానక మరియు శయన భంగిమలలో కొలువై దర్శనమిస్తారు. శ్రీరామునిగా, శ్రీకృష్ణునిగా, శ్రీనారసింహునిగా దర్శనమిచ్చే క్షేత్రాలు కొద్ది. ఇక మిగిలిన దశావతారాల రూపాలలో కనపడేది ఇంకా స్వల్పం. చిత్రంగా మూడు దివ్యదేశాలలో స్వామి త్రివిక్రమునిగా కొలువై ఉంటారు. అవి శ్రీ ఉలగండ పెరుమాళ్ కోవెల, కాంచీపురం, శ్రీ ఉలగనాథ పెరుమాళ్ కోవెల, తిరుక్కోవిలూర్. మూడవది శిర్కాలిలోని శ్రీ కలిశీరం విన్నగరం. ఈ క్షేత్ర గాధ కూడా మిగిలిన రెండు దివ్యదేశాల పౌరాణిక గాధ కూడా!**

**పౌరాణికగాథ**

ప్రహ్లాదుని మనుమడైన బలి చక్రవర్తి మహావీరుడు. భూలోకంతో పాటు మిగిలిన లోకాలను జయించాడు. ఆయన పరాక్రమం ముందు ఇంద్రాది దేవతలు పలాయనం చిత్తగించి, శ్రీహరి శరణు కోరారు. ఆయన వారికి అభయమిచ్చి తొందరలోనే బలిచక్రవర్తి పతనం తప్పదు అన్నారు. బలి ఎంతటి వీరుడో అంతకన్నా గొప్ప హరిభక్తుడు, దానశీలి. దేవేంద్ర పదవికి అర్హతను ఇచ్చే నూరవ అశ్వమేధ యాగానికి సిద్ధమయ్యారు బలి. మరింత ఆందోళనకు లోనైనాడు ఇంద్రుడు. శ్రీమన్నారాయణుని పరిష్కారం చూపమని ప్రార్థించారు.

బలి చేసిన దానధర్మాల వలన, చేస్తున్న అశ్వమేధ యాగాల కారణంగా ఇంద్రపదవికి ఒకరకంగా అర్హుడే ! కానీ రాక్షసవంశానికి చెందడం వలన అనర్హత చెందుతాడు. ఈ ఒక్క కారణంతోఅతనినిశిక్షించ దలచారు పరమాత్మ.

బాల బ్రాహ్మణునిగా బలి యజ్ఞశాల వద్దకు

చేరుకొన్నారు. అప్పటికి ఆనాటి దానధర్మాలను ముగించి యాగానికి సిద్ధమవుతున్నారు చక్రవర్తి. ఆయనవద్దకువెళ్లిదానంకోరారువామనుడు. ముద్దుగా ఉన్న బాలుని కాదనలేక ఏమి కావాలి అని ప్రశ్నించారు. తల దాచుకోడానికి మూడడుగుల నేల చాలన్న బాలుని చూసి అహంకారంతో నవ్విన బలి "సరే తీసుకో!"అన్నారు.

ఆ తరువాత కథ మనకు తెలిసినదే. వామనుడు "వటుడింతింతై...."అన్నట్లుగా విరాట్రూపంతో ఒక అడుగుతో భూలోకాన్ని, మరో అడుగుతో ఆకాశాన్ని ఆక్రమించి, మూడో అడుగు బలి శిరస్సున ఉంచి పాతాళానికి పంపారు. పై రెండు క్షేత్రాలతో పాటు ఈ క్షేత్రగాథ కూడా ఇదే !

కానీ ఈ క్షేత్రం ముఖ్యంగా శ్రీరామచంద్రుడు కొలువైనదిగా చెబుతారు. పేరు కూడా ఉచ్చారణ దోషం కారణంగా కలిశీరంగా మారింది అంటారు. ఆ విషయాలను పక్కనబెట్టి ఆలయ విశేషాలు తెలుసుకొందాము.

**ఆలయవిశేషాలు** : విశాలమైన ప్రాంగణానికి తూర్పున మూడు అంతస్థుల రాజగోపురం ఉంటుంది. ఎదురుగా బలిపీఠం, ధ్వజస్థంభం కనపడతాయి. ప్రధాన ఆలయం కొద్దిగా ఎత్తులో నిర్మించబడినది. ముఖమండపం, అర్ధమండపం, గర్భాలయంగా నిర్మించారు. గర్భాలయంలో ఎడమ కాలిని పైకెత్తి ఆకాశాన్ని కొలుస్తున్న భంగిమలో "శ్రీలోకనాథన్ పెరుమాళ్" నేత్రపర్వమైన అలంకరణలో దర్శనమిస్తారు. స్వామి వారి ఉత్సవమూర్తి శ్రీత్రివిక్రమనారాయణ పెరుమాళ్ శ్రీదేవి భూదేవి సమేతులై మూలవిరాట్టుకు ముందుగా కొలువై ఉంటారు. గమనించవలసిన విషయం ఏమిటంటే కాంచీపురం, తిరుక్కోవిలూర్ ఆలయాలలో శ్రీవారు విరాట్రూపంలో దర్శనమిస్తారు. ఇక్కడ మాత్రం సాధారణ రూపంలో కనపడతారు. కాకపోతే ఉలగండ అన్నా లోకనాథన్ అన్నా అర్ధం మాత్రం సమస్తలోకాలకు అధిపతి అని.

క్షేత్రం నామమైన తాదళన్ అంటే మూడు అడుగుల మహావిష్ణువు అని అంటారు. ఈ ఆలయంలో కనిపించే మరోవిశేషం ఏమిటంటే పైకి ఉన్న ఎడమపాద దర్శనం నిత్యం భక్తులకు లభిస్తుంది. కానీ క్రింద ఉన్న కుడి పాద దర్శనం ఒక్క వైకుంఠ ఏకాదశినాడు మాత్రమే! ఉపాలయాలలో శ్రీ లోకనాయకీ తాయారు, శ్రీ గోదాదేవి, శ్రీరామచంద్రమూర్తి, గరుడాళ్వార్, శ్రీ మనవాళ్ మహర్షి మరియు శ్రీ తిరుమంగై ఆళ్వార్ కొలువై ఉంటారు. అర్ధమంటపంలో పన్నిద్దరు ఆళ్వారులు ఉపస్థితులై ఉంటారు.

**తిరుమంగై ఆళ్వార్** : శ్రీవైష్ణవుడైన శ్రీ తిరుమంగై ఆళ్వార్ ఈక్షేత్రంలో శ్రీసుబ్రహ్మణ్యస్వామి ఆయుధమైన "వేల్" ధరించి కనపడటం. గతంలో ఒకే సమయంలో శైవ గాయకభక్తులలో అగ్రగణ్యులైన శ్రీ తిరుజ్ఞాన సంబందార్ మరియు తిరుమంగై ఆళ్వార్ శిర్కాలి విచ్చేసారట. వారిరువురిలో గొప్పవారు ఎవరు ? అన్న సందేశం కలిగిన భక్తులు వారి నడుమ ఒక పోటీ లాంటిది నిర్వహించారట. తిరుమంగై ఆళ్వార్ తన ఇష్టదైవం, స్థానికంగా కొలువైన శ్రీ త్రివిక్రమ పెరుమాళుని కొనియాడుతూ ఎవరికైన అర్ధమయ్యే లలిత లలితమైన తమిళ పదాలతో పాశుర గానం చేశారట. పరవశించి పోయిన జ్ఞాన సంబందార్ ఆయనను ప్రశంసించి తన చేతిలో సదా ఉండే వేల్ని మెడలో ధరించిన మాలను కానుకగా సమర్పించారట. నాటినుండి తిరుమంగై ఆళ్వార్ వాటిని ధరించి కనపడేవారట.

**ఆలయచరిత్ర**

తిరుమంగై ఆళ్వార్ మరియు తిరుజ్ఞాన సంబందార్ ఇరువురూ ఏడో శతాబ్దానికి చెందిన వారని చెబుతారు. వారివురు కలయిక జరిగిన ఆలయం కనుక ఏడో శతాబ్దానికి పూర్వమే నిర్మాణం జరిగి ఉండాలన్నది ఆధ్యాత్మిక వాదుల అంచనా! ఆలయానికి చోళులు, విజయనగర రాజుల, స్థానిక పాలకులు తమ వంతు కైంకర్యాలు సమర్పించారని, పునరుద్ధరణ, నిర్మాణ పనులు చేశారని తెలుస్తోంది. వివరాలను తెలిపే శిలాశాసనాలు పదో శతాబ్దం నాటినుండి ఆలయంలో కనిపిస్తాయి.

**ఆలయఉత్సవాలు**

ప్రతినిత్యం నియమంగా నాలుగు పూజలు నిర్వహించే ఆలయం ఉదయం ఏడున్నర గంటలనుండి పదకొండు గంటల వరకు తిరిగి సాయంత్రం అయిదు గంటలనుండి రాత్రి ఎనిమిదిన్నర వరకు తెరిచి ఉంటుంది. వైకుంఠ ఏకాదశి ఘనంగా నిర్వహిస్తారు. విశేషసంఖ్యలో భక్తులు పాల్గొంటారు. శ్రీరామనవమి, శ్రీకృష్ణాష్టమి, మత్స్య, కూర్మ, నరసింహ, వామన, పరశురామ, బలరామ జయంతులలో ప్రత్యేక పూజలు జరుపుతారు. స్థానిక పర్వదినాలలో వేడుకలు జరుగుతాయి. తిరునాన్గూర్ ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారు. శిర్కాలి రైల్వేస్టేషన్కు అతి సమీపంలో ఉన్న ఈ దివ్యదేశాన్ని మిగిలిన వాటితో పాటు దర్శించుకోవచ్చును. స్థానిక ఆటోవారికి ఈ ఆలయాల సమయాలపై తగినంత అవగాహన ఉండటం వలన వారి సహాయం తీసుకొంటే అన్ని దేవాలయాలను ఒకరోజులో సందర్శించుకునే అవకాశం లభిస్తుంది.

**!! జైశ్రీమన్నారాయణ !!**



# అక్రూరుడు ధృతరాష్ట్రునికి హితోపదేశం చేయుట

– విద్వాన్ వల్లూరి చిన్నయ్య

## ఆంధ్ర మహాభాగవతం, దశమస్కంధం, పూర్వభాగం

దానవత్వ దోషాలను మానవత్వ పరిమళాలుగా మార్చివేసే మహోన్నత తత్వ గ్రంథ రాజము, నీతికి, ని జాయితీకి నిలువుటద్దంగా నిలిచిన నిస్తుల నిగమాగమ సుధాసారము, అక్షయమైన మోక్షాన్ని అక్షర లక్ష రూపంలో ప్రపంచ ప్రజలకు పంచిపెట్టే పరమ పావన గ్రంథం శ్రీమదాంధ్ర మహాభాగవతము. అందులో దశమస్కంధం, పూర్వభాగం ఆధారంగా ''అక్రూరుడు ధృతరాష్ట్రునికి హితోపదేశం చేయుట'' అనే వ్యాసం వ్రాయబడింది.

**ఉ. నీయనుజుండు పాండుధరణీ విభుఁడీల్గిన నీవు భూమి ధ**
**ర్మాయత బుద్ధి నేలుచుఁబ్రజావళిఁ గాచుచు గౌరవంబుతోఁ**
**బాయక లోకులందు సమభావన చేసితివేనిఁ గీర్తియున్**
**శ్రేయము గల్గుః వేఱొకటి చేసిన దుర్గతి గల్గు భూవరా!**

**–మహాభాగవతం – దశమస్కంధం – పూర్వభాగంలోని 1516 నంబరు గల పద్యం**

వరణీయమైన వంశంలో జనించిన ధృతరాష్ట్ర మహారాజా! తమ తమ్ముడగు పాండురాజు చనిపోయిన తర్వాత తమరు రాజ్యాధికారం వహించారు. ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లే విధంగా వారిని పాలిస్తూ, కంటికి రెప్పగా కాపాడుతూ, గౌరవ భావంతో సమాన దృష్టితో చూచుకుంటే, నీకు శ్రేయస్సు, కీర్తి లభిస్తాయి. అందుకు భిన్నంగా నడుచుకుంటే భరింపరాని బాధలు పడవలసి వస్తుంది. ముఖ్యంగా పాండురాజు కుమారులను, తమ తనూజులను సమానంగా చూస్తే సర్వ సౌఖ్యాలు తమను వరిస్తాయి. ఎవరూ శాశ్వతంగా ఈ లోకంలో


ఉండలేరు . పుత్రులు, భార్య, రాజ్యసంపద కూడా అంతే. పాప పుణ్యాలు వ్యక్తి వర్తన వల్ల కూడా వస్తాయి. తల్లిచేపకు జీవనాధారమైన నీటిని దాని పిల్లలు సేవించే విధంగా మంచిబుద్ధి లేని తండ్రి ధనాదులు అతడి పుత్రులే అతనికి శత్రువులై కాజేస్తారు. అటుపిమ్మట అతడు మరణించినా జీవించినా అతని బాగోగులు పట్టించుకోరు. అందువల్ల నీవు ధర్మపు విలువలు తెలుసుకోకుండా వర్తిస్తే నీ ధనాన్ని చెడ్డబుద్ధి గల నీ సుతులు స్వాధీనం చేసుకుంటే ఇహ పర లోకాలలో నిందలకు గురవుతారు.

**శా. నిందం బొందకుమయ్య! యీ తనువు దానిద్రా కళా దృష్టమౌ**
**సందోహంబు విధంబు నిల్వదు సుమీ! జాత్యంధతం బొందియున్**
**మంద ప్రజ్ఞత లేల చేసెదవు సమ్యగ్ జ్ఞాన చక్షుండవై**
**సందేహింపక యిమ్ము పాండవులకున్ సర్వం సహా భాగమున్**

**–శ్రీమదాంధ్ర భాగవతము – దశమస్కంధం పూర్వభాగం – 1519 నంబరు గల పద్యం**

స్వప్నంలో కనిపించే వస్తువుల వలె శరీరం కూడా క్షణ భంగురమే. తమరు పుట్టుకతో గ్రుడ్డివారైనా మందబుద్ధిగా సమాజంలో చెడ్డపేరు తెచ్చుకోవద్దు. జ్ఞాన నేత్రాన్ని ధరించు. సమ సమాజ స్థాపన ఔదల దాల్చి పాండవులకు ఇవ్వవలసిన రాజ్యభాగాన్ని సమర్పించు. శాశ్వత యశస్సును స్వీకరించు అన్నాడు అక్రూరుడు. అతడి మాటలు వినిన ధృతరాష్ట్రుడు ఇలా అంటున్నాడు.

అక్రూరా! నీవు పలికినది ముమ్మాటికీ నిజమే. శుభకరమైనదే. కానీ అది సుదామ పర్వతమందలి స్ఫటిక శిలాప్రదేశంలో పుట్టి వెంటనే అదృశ్యమయ్యే మెఱపుతీగ లాంటి నా మనస్సులో అస్థిరత్వాన్ని పొందుతూ ఉంది. అమృతాన్ని ఆస్వాదించి ఆనందాన్ని అనుభవించని వాని వలె, నేను నీ మంచి మాటలకు అంచిత బుద్ధిని పొందలేకున్నాను. ఎంత గొప్పవాడైనా సర్వేశ్వరుని సంకల్పాన్ని అడ్డుకోలేడు. తన మాయ చేత ప్రపంచాన్ని సృష్టించి జీవకోటి చేసిన కర్మలకు తగిన ఫలితాన్ని ప్రసాదించి ఇచ్చేవాడు, తెలిసికొనుటకు సాధ్యము కాని సంసార చక్ర భ్రమణానికి కారణమయినవాడు, భూభారాన్ని రూపు మాపుటకు దేవకీ దేవి పుత్రుడుగా పుట్టినవాడు, పరమ పురుషుడు అయిన శ్రీకృష్ణభగవానునకు వందనములు అర్పిస్తున్నాను. ఆ మహాత్ముని దివ్యమైన లీలామృతమెట్లున్నదో అట్లే జరుగుతుంది అని ధృతరాష్ట్రుడు అక్రూరునకు తెల్పి అతనికి వీడ్కోలు పలికినాడు. అక్రూరుడు హస్తినాపురిని వీడి మధురకేతెంచి ధృతరాష్ట్రుని ఉద్దేశాన్ని బలరామ కృష్ణులకెఱిగించాడు.



**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం సంకల్పించిన మొత్తం 111 శ్రీనివాస కళ్యాణాలలో భాగంగా గత నెలలో నిర్వహించిన కళ్యాణాలు**

## 44వ కళ్యాణం

తేది 7–6–2023 బుధవారం నాడు ఉదయం 11 గంటల నుండి జరిగింది. ఇది సూర్యచంద్ర కన్వెన్షన్ , మరికెల్ గ్రామం, నారాయణపేట జిల్లాలో శ్రీమాన్ సూర్యమోహన్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి గార్ల ఆధ్వర్యంలో వైఖానసాగమోక్తంగా జరిగింది.

## 45వ కళ్యాణం

తేది 13–6–2023 మంగళవారం నాడు ఉదయం 10.30 గంటల నుండి జరిగింది. ఇ.నెం. 250, రోడ్‌నం. 78, జూబ్లీహిల్స్ హైదరాబాద్‌లో శ్రీమాన్ వై. అశోక్ రెడ్డి, హేమలత దంపతుల నిర్వహణలో వైఖానసాగమోక్తంగా, అన్నమాచార్య కీర్తనల మధ్య జరిగింది.

# సన్యాసులు అవధూతలు

**: కౌతా నిర్మల**



ఆధ్యాత్మిక భావాలు పెంపొందడం, ఆధ్యాత్మిక విషయాల్లో శ్రద్ధ, ఆసక్తి, వైరాగ్యం, భగవద్భక్తిలో గడపటం, కుటుంబ బంధాలను వదులుకోవడం లాంటివి సన్యాసుల లక్షణాలు. అవధూత అనేవారు లక్షల్లో ఏ ఒక్కరో ఉంటారు. ఎక్కడా స్థిరంగా ఉండకుండా, ఎక్కడెక్కడో సంచరిస్తూ, ఎప్పుడో ఒకసారి వచ్చి వెళ్ళిపోతుంటారు అవధూతలు.

సన్యాసాన్ని, సన్యాసిని గురించి ముందుగా తెలుసుకుందాం. సన్యాసంలో 4 రకాలుంటాయి. 1. వైరాగ్య సన్యాసం 2. జ్ఞాన సన్యాసం 3. జ్ఞాన వైరాగ్య సన్యాసం 4. కర్మ సన్యాసం.

1. వైరాగ్య సన్యాసం – అనవసరపు విషయాలకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం, వ్యర్థ విషయాలను వినడం, మాట్లాడటం, చూడటంపై ఆసక్తి, ఇష్టత ఉండవు. ఇష్టం, అయిష్టం అనేవి ఉండవు. అన్ని విషయాలపైన ఆసక్తి తగ్గుతుంది. సుఖాలు, భోగాల పట్ల ఇచ్ఛ నశించిపోతుంది.
2. జ్ఞాన సన్యాసం – సజ్జనులతో కలవడం, సత్సాంగత్యం చేయడం వల్ల కోరికలు, మోహము తగ్గిపోతాయి. విచక్షణా జ్ఞానం, నిగ్రహశక్తి, ధర్మప్రవర్తన, నిస్వార్థ భావం పెరుగుతాయి. మంచి కర్మలను ఆచరిస్తారు. చేసిన కర్మలన్నింటినీ భగవంతునికి సమర్పిస్తూ 'నా చేత ఈ కర్మలన్నింటినీ చేయించేది నువ్వే అని నమ్ముతున్నాను' అని భగవంతునికి నమస్కరిస్తాడు.
3. జ్ఞాన వైరాగ్య సన్యాసం – సాధన చేస్తూ, ధ్యానం ద్వారా అలౌకిక స్థితిలో ఉంటాడు. విచక్షణతో, సహనంతో, క్షమాగుణాన్ని కలిగి వుంటాడు. కష్టసుఖాలకు చలించకుండా ఎప్పుడూ నిశ్చలమయిన స్థితిలో ఉంటాడు.
4. కర్మ సన్యాసం – బ్రహ్మచర్యము, గృహస్థ, వానప్రస్థ ఆశ్రమ ధర్మాలను నిర్వర్తిస్తాడు. తాను చేసే కర్మలకు ఫలితాన్ని ఆశించకుండా, కర్మలు చేస్తూ జీవితాన్ని గడుపుతాడు. సన్యాస జీవితాన్ని గడిపేవారు ఆరు రకాలుగా ఉంటారు.

1. కుటిచకుడు – శిఖను, యజ్ఞోపవీతాన్ని, దండ, కమండలాలను ధరించి ఉంటాడు. ఎక్కడకూ సంచారం చేయకుండా ఒకే ప్రదేశంలో ఉండి, సదా భగవంతుని ధ్యానిస్తూ, భక్తి మార్గంలోనే ఉంటాడు. అల్పాహారాన్ని తీసుకుంటాడు.
2. బహుదకుడు – ఈ సన్యాసి ప్రతిరోజూ ఎనిమిది ముద్దల ఆహారాన్ని మాత్రమే తీసుకుంటాడు. భగవంతుని సాధనలోనూ, దైవస్మరణతోనూ కాలం గడుపుతూ ఉంటాడు.
3. హంస – ఈ సన్యాసి జడలు కట్టిన వెంట్రుకలతో కౌపీనం ధరించి ఉంటాడు.
4. పరమహంస – ఐదు గృహాల నుండి భిక్షను తెచ్చుకుని ఆహారంగా తీసుకుంటాడు. వెదురు దండాన్ని, కౌపీనాన్ని ధరించి ఉంటాడు. ప్రతినిముషం భగవంతుని ధ్యానిస్తూ, ఆధ్యాత్మిక సాధనలోనే కాలాన్ని గడుపుతుంటాడు.
5. తురియాతురుడు – తాను సజీవుడై ఉన్నట్లుగా భావించడు. తన దేహాన్ని శవంలాగే చూస్తాడు.

అవధూత – అవధూత ఎటువంటి నియమాలను కానీ, నిష్ఠను కానీ పాటించడు. ఈ లోకమంతా భ్రమ, మిథ్య. నేను మాత్రమే సత్యం అంటాడు. నాశనమయ్యే ఈ శరీరం నేను కాదు. ఎదుటివారు నన్ను చూసే రూపం నాది కాదు. నాకు పాప పుణ్యాలు, సుఖదుఃఖాలు, అహంకారం, గర్వం, అసూయ, దర్పము, ద్వేషము, అసహనం, క్రోధం లాంటివి ఏవీ లేవు. వాటన్నింటినీ త్యజించినవాడను. కేవలం జీవించటానికి మాత్రమే, దొరికిన ఆహారంలో కొంత అగ్నిదేవునికి సమర్పించి, మిగిలినది నేను భుజిస్తాను. ఆహారం లభించని రోజు ఏకాదశి. ఆహారం దొరికిన రోజు ద్వాదశి అని భావిస్తాను. రాత్రింబవళ్ళు సంచారం చేస్తూ, చూడటానికి ఉన్మత్తుడిలా కనిపిస్తూ తిరుగుతుంటాను. కర్మలన్నీ క్షయం అయ్యేవరకు అవధూతలా ఉంటాడు. అంత్యకాలంలో స్వర్గానికి చేరుకుంటాడు.

# జడ మహర్షి






పూర్వం భార్గవుడనే బ్రాహ్మణుడుండేవాడు. ఆయన సమస్త వేదశాస్త్రాలు నేర్చుకున్నాడు. మంచి వాళ్ళకే మంచివాడు. ఈ భార్గవుడి కొడుకే జడ మహర్షి.

జడ మహర్షి పుట్టాక ఆయనకి జాతకకర్మ, చెవులు కుట్టించటం, ఉపనయనం లాంటి చెయ్యవలసినవన్నీ పూర్తి చేశాడు భార్గవుడు. ఒకనాడు కొడుకుని పిలిచి నువ్వు వెళ్ళి ఒక గురువుగారిని ఆశ్రయించి విద్య నేర్చుకుని గృహస్థుడవై సంతానాన్ని కని వానప్రస్థాశ్రమానికి వెళ్ళి తపస్సు చేసుకుని, అన్నీ పరిత్యజించి, నిర్మోహివి, నిర్జితేంద్రియుడివి, నిరహంకారివి, నిర్మత్సరుడివి, నిత్యోపవాసివి అయి జీవించమని చెప్పాడు.

కాని జడ మహర్షి మాట్లాడలేదు. తండ్రి చాలాసార్లు అడిగాక తండ్రీ! నువ్వు చెప్పినవి చాలా జన్మల్లో చేశాను. నేను ఇప్పటికి అయిదువేల జన్మలెత్తాను. అన్ని రకాలయిన దుఃఖాలు అనుభవించాను. పుత్ర, మిత్ర కళత్ర, శత్రు, భ్రాతృ వియోగాలన్నీ అనుభవించాను. కొన్ని వేలమంది తల్లుల పాలు తాగాను. బాల్యం, యౌవనం, ముసలితనం అన్నీ నాకు తెలుసు. ఎన్నిసార్లో పుట్టాను. ఎన్నిసార్లో చచ్చాను. ఇపుడు నీకు కొడుకుగా పుట్టాను. నేను జ్ఞానినై పుట్టాను. నువ్వు చెప్పేవేవీ నా మనస్సులోకి వెళ్ళవు. జడుడు అనే పేరు నాకు సరిపోతుంది కూడా.

అన్నీ విని భార్గవుడు కుమారా... నీకీ జడత్వం ఎందుకు వచ్చింది? ఇంత విజ్ఞానం ఉంది కదా. నీకేమైనా శాపం ఉందా? వివరంగా చెప్పమన్నాడు.

నేను పూర్వజన్మలో బ్రాహ్మణ్యుడైన బ్రాహ్మణుణ్ణి. చాలామంది శిష్యులకు జ్ఞానోపదేశం చేసిన గురువుని. అజ్ఞానమనే చీకటిని పోగొట్టుకుని, ఎవరికీ దొరకని జన్మ జన్మలు గుర్తు చేసుకోగలిగిన జ్ఞానం ఈ జన్మలో పొందాను. నేను ఇంక మోక్షానికి దారి వెతుక్కోవాలి. నీకేమైనా సందేహాలుంటే అడుగు అవి తీర్చి వెళ్ళిపోతానన్నాడు జడ మహర్షి.

భార్గవుడు కొడుకుని చూసి ఆశ్చర్యంతో గర్భంలో ఉండగానే జ్ఞానివైన నిన్నుకన్న మేము ఎన్ని నోములు నోచి ఉంటామో! ఇలాంటి కులదీపం లాంటి కొడుకుని పొందే అదృష్టం ఎంతమందికి దక్కుతుంది? నేను నిన్ను గురువుగా అనుకుని కొన్ని ప్రశ్నలు అడుగుతాను. సమాధానం చెప్పమని ఇలా అడిగాడు భార్గవుడు.

ప్రాణికి పుట్టడం, బ్రతకడం, మరణించడం ఇవి ఎలా జరుగుతున్నాయి? ఎలా పుడుతున్నాడు? ఎలా చచ్చిపోతున్నాడు? ఎలా పాపపుణ్యాలు అనుభవిస్తున్నాడు? జ్ఞానం ఎలా పొందుతున్నాడు? అని అడిగాడు.

తండ్రిగారూ! మొదట మనిషి మరణించే విధానం చెప్తాను వినండి అన్నాడు. మరణకాలం వచ్చినప్పుడు శరీరం బాగా వేడెక్కి ఆవిర్లు వస్తాయి. మలమూత్రాలు బయటికి వచ్చే దారులు మూసుకుపోయి మలమూత్రాలు రావడం ఆగిపోతుంది. పొట్ట పెరిగి, పెదవులు ఎండి, గొంతు తడారిపోయి, మాట పడిపోయి, కళ్ళు జీవం లేనట్లయి, నాలుక వెనక్కి లాక్కుపోయి శ్వాస ఆగిపోతుంది అన్నాడు

జడ మహర్షి.

ధర్మం తప్పనివాడు, అన్నం నీళ్ళు దానం చేసి, పెద్దలని గౌరవించి, అసూయ లేకుండా అసత్యం పలకకుండా ఉన్నవాడు సుఖంగా, మంచిగా మరణిస్తాడు. అలా మంచిగా ఉండని వాడు బాధపడుతూ, కష్టపడుతూ మరణిస్తాడు.

మరణించాక తల్లితండ్రుల వల్ల వచ్చిన శరీరం పోయి, వారి వారి పనులు, వయస్సు, రూపాన్ని బట్టి యాతనా శరీరాల్లో ప్రవేశిస్తారు. ఇలా పాపం చేసిన వాళ్ళ యాతనా శరీరాల్ని యమభటులు కాళ్ళు చేతులు కట్టేసి, కర్రలతో కొడుతూ, వేడి నేలమీద ఈడ్చుకుంటూ, రాళ్ళు, గుట్టలు, ముళ్ళు గల భయంకరమైన మార్గంలో నక్కలు పిక్కలు కొరికి తింటూ వెంట వస్తూ ఉండగా తీసికెడతారు.

ఇలా తీసుకెడుతూ ఉండగా బంధువులు మిత్రులు అతని దేహాన్ని కాలుస్తుంటే ఆ వేడికి తట్టుకోలేక బాధపడ్డాడు. పన్నెండు రోజుల వరకు బంధువులు చేసే పిండప్రదానాలు, భూమి మీద పడుకునే ముఖ్య వ్రతం వల్ల యాతనా శరీరం తృప్తి పడుతుంది. పన్నెండవ రోజు మైల స్నానాలు, తర్పణాలు ఇలాంటి వాటి వల్ల యాతనా శరీరం సంతోషపడుతుంది.

పదమూడో రోజు జీవిని యమధర్మరాజు దగ్గరికి తీసుకువెడతారు. చిత్రగుప్తుడి దగ్గర పాపాల పట్టీ ఉంటుంది కదా. అది చూసి యమధర్మరాజు శిక్ష వేస్తాడు. వాటి గురించి కొన్ని తెలుసుకుందాం.

రౌరవం : ఇది ఉండే ప్రదేశం రెండువేల యోజనాలు. అదంతా ఎర్రటి నిప్పులు భగభగమంటూ ఉంటాయి. అందులో వేస్తే కాలి బూడిద అవడం మళ్ళీ మామూలు అవడం ఇలా జరుగుతూనే ఉంటుంది.

మహారౌరవం : ఇది ఎన్నోవేల యోజనాలు. ఇందులో యమభటులు పాపాలు చేసినవాళ్ళని కాళ్ళు, చేతులు కట్టిపడేస్తే కుక్కలు, నక్కలు, పాములు, గ్రద్దలు ఒకటేమిటి అన్నీ కలిసి పొడిచి కరిచి మాంసం ఎముకలు నమిలి నమిలి బాధపెడతాయి.

తమో నరకం : ఇది అతి చల్లగా ఉంటుంది. కాళ్ళు, చేతులు కొంకర్లు పోయి ఒకళ్ళ రక్తం ఒకళ్ళు తాగేస్తారు.

నికృంతం : దీంట్లో చక్రాలు తిరుగుతూ శరీరాల్ని ముక్కలుగా చేస్తుంటే మళ్ళీ అవి అతుక్కుంటూ అవి మళ్ళీ ముక్కలవుతూ ఆ చక్రంలో తిరుగుతూనే ఉంటారు.

అప్రతిష్ఠ నరకం : పేగులు పిండి మెడలు వేలాడుతూ రక్తాలు కారుతున్న కళ్ళతో రాట్నాల మీద వేల వేల సంవత్సరాలు త్రిప్పించబడతారు.

అసిపత్త్రవనం : ఇది కొన్నివేల యోజనాల్లో ఉన్న ప్రదేశం. ఇది చాలా చల్లగా ఉండి, ఆకులు, పూవుల లాంటి కత్తులతో ఉన్న చెట్లతో ఉంటుంది. పాపాత్ములని దీంట్లో పడెయ్యగానే ఆ కత్తులు నరికేస్తూ ఉంటాయి. పెద్ద పెద్ద కుక్కలు అవి నోటితో పట్టుకుని తిరుగుతూ ఉంటాయి.

తప్తకుంభ నరకం : ఎప్పుడూ మండుతూనే ఉండే మంటలమీద పెద్ద పెద్ద కుండల్లో సలసల కాగే నూనెలో తలక్రిందులుగా పడేస్తారు.

అమిత కర్దమ : ఈ నరకంలో పెద్ద పెద్ద పక్షులు ఇనుపముక్కులతో పొడుస్తూ ఉంటే విపరీతమైన ఆకలి, దాహంతో రక్తం కారుతూ అరుస్తూ ఉంటారు. ఇలాంటి నరకాలు ఎన్నో ఉన్నాయని చెప్పాడు జడ మహర్షి.

భార్గవుడు మళ్ళీ ఏ పాపాలు చేస్తే ఏ జన్మ వస్తుందో వివరంగా చెప్పమన్నాడు జడ మహర్షిని.

నరకబాధలు అనుభవించిన తరువాత వాళ్ళ జన్మలు ఎలా ఉంటాయో విపులంగా చెప్తాను విను అన్నాడు జడ మహర్షి.

కడజాతి వాడినుండి దానం తీసుకున్న బ్రాహ్మణుడు గాడిదగాను, అతడికి సహాయం చేసినవాడు పురుగుగాను పుడతారు. గురువుని మోసగించినవాడు కుక్క, గురువు భార్యతో కలిసినవాడు గాడిద, తల్లితండ్రులు చెప్పినట్లు విననివాడు గోరువంక, వాళ్ళకి మనోవ్యాధి కలిగించినవాడు తాబేలు, ఒకరి ఉప్పుతిని శత్రువర్గంలో చేరినవాడు కోతి, విశ్వాసహీనుడు చేపగాను, అసూయ కలవాడు డేగగాను, ధనం లాంటివి దొంగతనం చేసినవాడు కొంగగాను, మిత్రుడి భార్యతో కలిసినవాడు పంది, యజ్ఞం, దానం, వివాహం చేసేటప్పుడు విఘ్నం కలిగించినవాడు, కూతుర్ని ఒకరికిచ్చి పోట్లాడి, మళ్ళీ వేరే పెళ్ళి చేసినవాడు పురుగుగాను, దేవతలకి, పితరులకి, అతిథులకి ముందు అన్నం పెట్టకుండా తనే తినేవాడు కాకి, బ్రాహ్మణుడు శూద్ర స్త్రీతో వెడితే కట్టెలోని పురుగు గాను, కృతజ్ఞత లేనివాడు పురుగు, తేలు, చేపగాను, ఆగవాళ్ళని, పిల్లలని చంపినవాడు పురుగుగాను, అన్నం దొంగతనం చేసినవాడు ఈగగాను ఇలా రకరకాలుగా పుడతారు. పాపం పూర్తయ్యేవరకు మనుష్య జన్మ రాదని చెప్పాడు.

మరి పుణ్యం చేసుకున్న వారి గురించి చెప్పనేలేదని భార్గవుడు అడిగితే జడమహర్షి పుణ్యం చేసుకున్న వాళ్ళ సంగతి కూడా చెప్తున్నాడు. వాళ్ళు దివ్యాభరణాలు, దివ్యాంబరాలు, దివ్య సుగంధాలు అనుభవిస్తూ విమానంలో స్వర్గానికి వెళ్ళి అక్కడ స్వర్గసుఖాలు అనుభవించి పుణ్యం అయిపోగానే మళ్ళీ మనిషి జన్మ ఎత్తుతారని చెప్పాడు.

భార్గవుడు కుమారా! గర్భం లోనికి మనిషి ఎలా ప్రవేశిస్తాడు? ఎలా పెరుగుతాడు? వివరంగా చెప్పమన్నాడు. స్త్రీ పురుషులు కలిసే సమయంలో పర లోకానికి వెళ్ళిపోయిన జీవుడు చాలా వేగంగా గాలి రూపంలో శుక్లంలో కలుస్తాడు. అది మావిగా, పిండంగా మారుతుంది. తరువాత పంచాంగాలు, ఉపాంగాలు కలుగుతాయి. అన్ని అవయవాలు పెరిగి ఒక బొటనవ్రేలి మీద ఒకటి వేసుకుని తొడల ప్రక్కన చేతులు పెట్టి, చేతులు మోకాళ్ళపైన, కళ్ళు మోకాళ్ళ వెనుక, ముక్కు మోకాళ్ళ నడుము భాగంలో, రెండు పిక్కలు దగ్గరికి చేర్చి బాగా ముడుచుకుపోయి మోకాళ్ళ మధ్య ఉండగా ఆ తల్లి కడుపులో వేడిని భరిస్తూ, ఆమె తీసుకునే ఆహారం శరీరాన్ని పెంచుతుండగా పుణ్యపాపాలు అతన్ని ఆశ్రయించడం చేత అతనికి జ్ఞానం కలుగుతుంది. తొమ్మిది మాసాలు నిండిన తరువాత శిశువు రూపంలో బయటికి వచ్చి ఏడుస్తాడు.

భార్గవుడు చేతులు జోడించి యోగీంద్రా! మోక్షాన్ని పొందటానికి యోగవిద్యని కూడా నువ్వే ఉపదేశం చెయ్యమన్నాడు.

జడ మహర్షి ఇలా చెప్పాడు. యోగి అవమానం అమృతంలా, గౌరవం విషంలా, మాట ఎప్పుడూ సత్యాన్ని చెప్పేదిగా, తలపులు బుద్ధిగా ఉండి బ్రహ్మచర్యాన్ని అవలంబిస్తూ తన ఆత్మని పరమాత్మ మీద నిలిపి లోకంలో పరమాత్మ తప్ప ఇంకేమీ లేదన్నట్లుగా ధ్యానం చేసుకుంటూ పరమాత్మని అనుభవించగలిగినవాడు మోక్షం కలుగుతుందని చెప్పి తాను కూడా యోగసాధన కోసం వెళ్ళిపోయాడు.

# భస్మం

**- శ్రీమతి వెలమకన్ని పద్మావతి**

భస్మం అంటే విభూతి. ఈ విభూతిని త్రిపుండ్రములుగా నుదుట ధరిస్తారు. ఈ మూడు రేఖలు త్రిమూర్తులుకు ప్రతీక. మొదటి రేఖ బ్రహ్మ, మధ్యరేఖ విష్ణువు, మూడో రేఖ మహేశ్వరుడు. ఒక్క విభూతి రేఖకు ఈశ్వరుడే అధినేత.

ఈ భస్మం మూడు రకాలు. 1.శాంతిక భస్మం 2. పౌష్టిక భస్మం 3. కామద భస్మం


శాంతిక భస్మం : గోమయాన్ని ఆవుతోక కింది భాగం నుండి ఇవతలకి రాకుండానే చేతితో తీసుకోవాలి. దీనిని చెట్లకు కాని, చదరలపై గాని, నేలమీద గాని, బల్లలపై గాని పిడకలుగా వేసి బాగా ఎండబెడతారు. ఈ పిడకలతో వేదమంత్రాలతో హోమం చేసి, వచ్చిన భస్మాన్ని ''శాంతికం'' అంటారు.

పౌష్టిక భస్మం : ఆవు పేడ వేస్తుంటే మధ్యలో (కింద పడకుండా) చేతితో పట్టుకొని, పిడకలుగా చేసి ఎండబెట్టి ఆ పిడకలతో షడక్షరీ మంత్రంతో హోమం చేయగా వచ్చిన విబూతిని పౌష్టిక భస్మం అంటారు.


కామద భస్మం : సేకరించిన గోమయాన్ని పిడకలుగా చరిచి ఎండబెట్టి వాటితో బీజాక్షరములతో హోమం చేయగా వచ్చే భస్మాన్ని కామద భస్మం అంటారు.

గోమయాన్ని సేకరించేవారు తెల్లవారు జామునే స్నానాదికములు గావించుకొని గోశాలకు వెళ్ళి గోవులకు నమస్కరించి, పూర్ణిమ అమావాస్య లేదా అష్టమి నాడు గాని గోమయాన్ని సేకరిస్తారు. దానిని పిడకలుగా చరిచి బాగా ఎండబెడతారు. వేద మంత్రాలతో అగ్నిని మధించి హోమగుండంలో ఆవాహన చేసి ఈ పిడలకతో విధి విధానంగా హోమం చేస్తారు. అటు తర్వాత ఒక కొత్త రాగి లేదా ఇత్తడి పాత్రను తెచ్చి ఈ భస్మ ప్రసాదాన్ని మంత్రపూర్వకంగా పాత్రలోకి నింపి చందనము సుగంధాది ద్రవ్యాలతో మిశ్రితం చేసి శుచియైన ప్రదేశంలో ఈ పాత్రను భద్రపరుస్తారు.

ప్రతిరోజు శుద్ధ జలముతో స్నానం చేసిన తర్వాత భస్మధారణ చేయాలి. అనారోగ్యంతో బాధపడేవారు జలస్నానం చేయలేరు కాబట్టి ''భస్మస్నానం'' చేయవచ్చు. భస్మస్నానం ఎలా చేయాలో తెల్సుకుందాం. అనారోగ్యవంతులు కాళ్ళూ – చేతులూ శుభ్రంగా కడుక్కుని జలంలో విభూతిని కలుపుకుని ఈశాన మంత్రముతో శిరస్సుపై చిలకరించుకోవాలి. తత్పురుష మంత్రంతో ముఖాన, అఘోర మంత్రంతో హృదయం పైన, వామ మంత్రంతో నాభి ప్రదేశములో, సద్యోజాత మంత్రంతో సర్వాంగాలకు విభూతిని అలదుకోవాలి. దీనినే భస్మస్నానం అంటారు. ఆ తర్వాత కట్టుకున్న వస్త్రాన్ని విడిచి మరో వస్త్రం ధరించాలి. చేతులు కాళ్ళు మరల కడుక్కుని ఆచమనం చేయాలి. ఈ విధంగా భస్మస్నానం చేయలేనివారు త్రిపుండ్ర ధారణ చేసినా చాలు. మధ్యాహ్న సమయానికి ముందు కాలంలో తడిపిన విభూతిని, తర్వాత కాలంలో పొడి విభూతిని ధరించాలి.







# రాధాకృష్ణుల గురించి అద్భుత రహస్య ఆలయం



మనదేశంలోని అనేక పర్యాటక ప్రాంతాలు అంతుచిక్కని రహస్యాలుగా మిగిలిపోయాయి. వీటిలో కొన్ని చారిత్రాత్మక, ఆధ్యాత్మిక ప్రాధాన్యతను కూడా కలిగి ఉన్నాయి. వీటి మర్మాలను ఛేదించాలని భావించి చాలా మంది తమ జీవిత కాలం వెచ్చించినా ప్రయోజనం లేకుండా పోయింది. ఈ క్రమంలో మరికొంతమంది ప్రాణాలు కోల్పోగా మరికొంతమంది మతిస్థిమితం కోల్పోయారు. ఈ కోవకు చెందినదే మధురలోని నిధివన్. ఇక్కడ రాత్రి పూట జరిగే వింతలు ద్వాపరయుగం నుంచి కలియుగం వరకూ అంతచిక్కని రహస్యాలుగానే మిగిలిపోయాయి.

**ద్వాపర యుగం నుంచి రహస్యం**

ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని మధుర జిల్లాలోని బృందావనలోని ఉన్న నిధివన్ రహస్యం ద్వాపరయుగంలోని రాధ, రాధకృష్ణులతో ముడి పడి ఉంది. శ్రీకృష్ణుడు ప్రతి రోజూ రాధను కలుసుకోవడానికి ఇక్కడికి వస్తుంటారని స్థానికుల నమ్మకం.

**అదృశ్య రూపంలో కాపాలా**

అంతేకాకుండా రాధకృష్ణులు గోపికలతో కలిసి ఇక్కడ రాత్రిపూట నాట్యం కూడా

చేస్తుంటారని స్థానికులు చెబుతారు. ఆ సమయంలో కృష్ణుడి భటులు రాత్రి పూట ఈ నిధివన్ చుట్టూ అదృశ్య రూపంలో కాపాలా కాస్తూ కృష్ణుడి ఏకాంతానికి భంగం కలగకుండా చూస్తారని స్థల పురాణం.

**పక్షులు కూడా ఉండవు**

అందువల్లే నిధివన్ లోని ప్రధాన ఆలయం ద్వారాలను సూర్యాస్తమయం అయిన వెంటనే మూసివేస్తారు. అంతేకాకుండా నిధివన్ కు ప్రవేశించే ద్వారాన్ని కూడా మూసి తాళం వేస్తారు. రాత్రి సమయంలో ఇక్కడకు మనుషులే కాదు, కనీసం పక్షులు కూడా వెళ్లవు.

**ఇదే నిదర్శనం**

ఇందుకు నిదర్శనంగా ఉదయం వందల సంఖ్యలో కోతులు ఉండే నిధివన్ లో రాత్రి అయిన వెంటనే ఒక్క కోతి కూడా ఆ ప్రాంతంలో కనిపించదు. అదే విధంగా అనేక చెట్ల పైన ఉదయం పూట కనిపించే పక్షి కూడా రాత్రి సమయంలో అక్కడ ఉండదు.

**చనిపోవడం లేదా మతిస్థిమితిని కోల్పోతారు**

ఒక వేళ కట్టుబాటులను ధిక్కరించి ఈ నాట్యాన్ని చూసిన వారు చనిపోతారని లేదా మతిస్థిమితం కోల్పోతారని చాలా ఏళ్లుగా నమ్ముతున్నారు. అంతేకాకాండా ఆ వనానికి ఎదురుగా వాకిళ్లు వచ్చేలా ఇంటి నిర్మాణం కూడా చేపట్టరు. ఇక రాత్రి సమయంలో ఆ వనానికి దగ్గరగా ఉన్న ఇళ్లలోని వారు వనం వైపు ఉన్న కిటికీలను కూడా మూసివేస్తారు.

**పట్టీల శబ్దం**

ఇక రాత్రి సమయంలో వేణు నాదం అంటే పిల్లనిగోవి వాయిస్తున్న శబ్దంతో పాటు ఆడవారి పట్టీల శబ్దాలు వేల ఏళ్ల నుంచి వినిపిస్తున్నాయని చెబుతారు. కృష్ణుడి వేణుగానంతో పాటు గోపికలు నత్యం చేయడం వల్ల ఆ శబ్దాలు వస్తుంటాయని స్థానికుల నమ్మకం.

**మొక్కలా, గోపికలా?**

ఇక్కడ ఉన్న మరో విశేషం ఏమిటంటే నిధివన్ లో ఉన్న మొక్కల కాండాలు అన్నీ ఒకేలాగా ఉంటాయి. ఇక భూమి పై ఒక్క చుక్క నీరు లేకపోయినా చెట్లు ఎల్లప్పుడూ పచ్చగా ఉంటాయి. ఈ చెట్లే రాత్రి పూట గోపికలుగా మారి నాట్యం చేస్తుంటారని చెబుతారు.

**అక్కడే ఏకాంతంగా గడుపుతారు**

వనం మధ్యలో ఉన్న రంగమహల్ లోనే రాధ, కృష్ణులు నాట్యం తర్వాత ఏకాంతంగా గడుపుతారని పూజారులు చెబుతున్నారు. అందువల్లే రాత్రి ఆలయ ద్వారం మూసే ముందు అలంకరించిన మంచం, ఓ వెండి గ్లాను నిండా పాలు, కొన్ని తీపి పదార్థాలు, తాంబూలం, పళ్లు తోముకోవడానికి రెండు వేపపుల్లలు, చీర, గాజులతో పాటు మరికొన్ని అలంకార వస్తులు అక్కడ ఉంచుతారు.

**ఉదయానికి ఇలా**

ఇక ఉదయం ఆలయ ద్వారం తీసే సమయానికి తాంబూళం నమిలి ఉమ్మిన గుర్తులు, పాలు తాగిన ఆనవాళ్లతో పాటు మంచం పై ఉన్నదుప్పట్లు కొంత చెదిరి ఉంటాయి. ఇక స్వీట్లు, పండ్లు సగం తిన్న ఆనవాళ్లు కనిపిస్తాయి. దీన్ని భక్తులు కూడా చూస్తారు. ఇది చాలా ఏళ్లుగా జరుగుతున్న తంతు.

**ఛానల్ వారు విఫలయత్నం**

ఇటీవల ఓ ఛానల్ వారు ఈ రహస్యం కనుగొనాలని ప్రయత్నించి విఫలమయ్యారు. ఆలయ తాళాలు వేసి ఉన్నవి వేసినట్లే ఉన్నా ఉదయానికి రంగమహల్ లో మంచం పై దుప్పట్లు చెదిరి పోయి ఉండగా వెండి గ్లాసులు పాలు సంగం ఖాళీ అయ్యి కనిపించాయి.

**గోపిక దప్పిక తీర్చడానికి?**

ఇక్కడ వనంలో ఉన్న కొలనును విశాఖ కుండ్ అని అంటారు. విశాఖ అనే కోపిక దప్పిక తీర్చడానికి కృష్ణుడు తన పిల్లనగోవితో ఈ కొలనును సృష్టించారని చెబుతారు. నిధివన్ కు వెళ్లినవారు ప్రధాన ఆలయమైన రంగమహల్ లోని రాధకృష్ణుడి విగ్రహాలతో పాటు విశాఖ కుండ్ ను దర్శించుకుని వస్తారు.

**ఎన్నో ఆలయాలు**

ఈ నిధివన్ చూసిన భక్తులు తప్పక కృష్ణుడి బాల్యంతో ముడి పడి ఉన్నమధురను అక్కడి ఉన్నఅనేక దేవాలయాలను తప్పక దర్శించుకుంటారు. ఇక్కడ ఉన్న ఆలయాల్లో ఎక్కువ శాతం రాధ కృష్ణులవి కావడం గమనార్హం.

**ఎక్కడ ఉంది?**

ఉత్తర ప్రదేశ్ లోని మధుర జిల్లాలో బృందావన్ ఉంది. ఇక్కడే మన నిధివన్ ఉంటుంది. మధుర నుంచి బందావన్ కు 15 కిలోమీటర్ల దూరం ఉంటుంది. 26 నిమిషాలు ప్రయాణం. ఆలయం ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ తీసి ఉంటారు.

**ఎలా వెళ్లాలి?**

మధుర నుంచి బృందావన్ కు రైలు సదుపాయం బాగా ఉంది. ఇక్కడకు నేరుగా విమాన యాన సదుపాయం లేదు. దగ్గరల్లో కేరియా ఎయిర్ పోర్ట్ ఉంది అక్కడి నుంచి రోడ్డు ప్రయాణం ద్వార బృందావన్ చేరుకోవచ్చును.

★ ★ ★

## శ్రీ వేంకటేశ్వర మహామంత్రపీఠం ఆధ్వర్యంలో

# శ్రీనివాస కళ్యాణాలు

**ఉచిత శ్రీనివాస కళ్యాణాలను నిర్వహించండి!**
**శ్రీవారి కృపకు పాత్రులుకండి!!**



**తిరుమల శ్రీవేంకటేశ్వరుని కరుణా కటాక్షములు అందరికీ లభించాలని 'కరోనా' లాంటి మహమ్మారి నుండి లోకాన్ని స్వామివారు రక్షించాలనే ఉద్దేశ్యంతో, భగవంతునికి మరియు ఆయన భక్తులకు సేవచేయాలన్న లక్ష్యంతో "శ్రీనివాస కళ్యాణాలు" అనే కార్యక్రమమును చేపట్టాము.**

కలియుగ దైవమైన తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ప్రతి సంవత్సరం 7 కళ్యాణాల కంటే తక్కువ కాకుండా కనీసం 111 కళ్యాణాలను వివిధ ప్రాంతాలలో ఉచితంగా నిర్వహించాలని సంకల్పించాము.

ఆహ్వానించిన భక్తుల ప్రాంతములో అనగా వారి వారి ఊరు, అపార్టుమెంట్ లేదా ఇంటివద్దనే నిర్వహించెదము. శ్రీవారి కళ్యాణమును శాస్త్రోక్తంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు అనగా విగ్రహాలను, బ్రాహ్మణులను, ఇతర సామగ్రిని మేమే ఏర్పాటు చేసెదము. కళ్యాణముతో పాటు వీలైతే అన్నమయ్య కీర్తనలు, ప్రవచనములను కూడా ఏర్పాటు చేయగలము. భక్తులలో శ్రీవేంకటేశ్వరస్వామి పట్ల భక్తి భావమును, శరణాగత తత్త్వమును ప్రోత్సహించుచు, స్వామివారి సేవాభాగ్యమును మరియు ఆశీస్సులను అందించుటే మా లక్ష్యం.

**శ్రీవారి కళ్యాణమును తమ ప్రాంతము, ఊరు, ఇంటి వద్ద నిర్వహించుటకు ఆసక్తికల భక్తులు మమ్మల్ని సంప్రదించవలెనని మనవి. భక్తులకు అనువైన రోజున 'నమో వేంకటేశాయ' రథం యుక్తంగా విచ్చేసి శ్రీనివాస కళ్యాణమును నిర్వహించుదుము. (హైదరాబాద్ మరియు పరిసర ప్రాంతాలలో మాత్రమే)**


**శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం**

శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

ఫోన్: 040-27175050
సెల్: 93482 12354
E.mail: srivenkatesham@gmail.com
Website:Srivenkatesham.org

# రాశి ఫలితములు

## మేషరాశి

**అశ్వని 1,2,3,4 పాదములు, భరణి 1,2,3,4 పాదములు, కృత్తిక 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులకు కొంత వరకు గత నెల కంటే ఈ నెల అనుకూలంగా ఉంటుంది. ప్రతి విషయంలో ఆచితూచి వ్యవహరించాలి. పిల్లల కోరికలు తీర్చడంలో చాకచక్యంగా ఆలోచించి మాట్లాడాలి. శత్రువులు మిత్రువులుగా మారతారు. అమ్మవారి పూజ తప్పనిసరిగా చేయండి.

## వృషభరాశి

**కృత్తిక 2,3,4, రోహిణి 1,2,3,4 పాదములు, మృగశిర 1,2 పాదములు.**

ఈ రాశి స్త్రీ, పురుషులకు తెలియకుండానే ఆనందంగా ఉంటారు. అకస్మిక ధన లాభం ఉంది. ఓర్పుతో, నేర్పుతో వ్యవహరిస్తే, పెండింగ్ పనులు సానుకూలంగా జరిగిపోతుంటాయి. ఇది కాల మహిమ. అఖండ దీపారాధన, దేవి పూజలు చేయాలి.

## మిథునరాశి

**మృగశిర 3, 4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు, పునర్వసు 1, 2, 3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు కొంత అనుకూలంగా ఉన్నట్లు కనిపిస్తుంది. కొత్త స్నేహితులు వల్ల అభివృద్ధి ఉంటుంది. కానీ వారిపై అతి నమ్మకం వద్దు. నమ్మితే మోసం చేస్తారు. కొన్ని కొన్ని వ్యవహారాల దగ్గర మొహమాటం పనికిరాదు. ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడుకొని సమస్యను పరిష్కరించుకోగలరు. నమ్మకంతో దుర్గాదేవికి అవసరమైన పూజలు చేయండి.

## కర్కాటకరాశి

**పునర్వసు 4వ పాదము, పుష్యమి 1,2,3,4 పాదములు, ఆశ్లేష 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా ఉంటుంది. చాలా జాగ్రత్తగా ఆలోచన చేసి నిర్ణయాలు తీసుకోవాల్సిన రోజులు ఇవి. నాలుకను అదుపులో ఉంచుకోవాలి. ఏ మాత్రం భయపడకూడదు. శని స్తోత్రం, శని ఆరాధన వలన శివ ధ్యానం వల్ల కొంత వరకు ఉపశమనం ఉంటుంది.

## సింహరాశి

**మఖ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు, ఉత్తర 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా ఉంటుంది. ఏ విషయంలో చిరాకు పడరాదు. ఆదాయ వనరుల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఖర్చులు అదుపులో పెట్టుకోవాలి. మీరు పట్టుదలతో కార్యాన్ని సాధించాలి. తొందరపాటు పనికిరాదు. పెద్దలను గౌరవించండి. లక్ష్మీ నారాయణుల నిత్య పారాయణం చేయండి.

## కన్యారాశి

**ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు, చిత్త 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు ప్రతి విషయంలో చికాకులతో పాటు మనో భీతి ఉంటుంది. ఏ విధంగా చూసిన అర్థం కాని పరిస్థితులు ఎదురవుతాయి. ప్రయాణంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. శకునం చూసి బయటకు వెళ్లండి. తొందరపాటు మంచిది కాదు. చాలా జాగ్రత్తగా ఆలోచన చేయండి. దుర్గాదేవి సప్తస్తుతి చేయండి.

## తులారాశి

**చిత్త 3,4 పాదములు, స్వాతి 1,2,3,4 పాదములు, విశాఖ 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. నవగ్రహ ప్రదక్షిణాలు చేయండి. ప్రతి విషయంలో కార్యానుకూలత కలిగి ఉంటారు. విద్యార్థులకు చాలా అనుకూలంగా ఉంటుంది. ఎవరికి వారు ప్రతి విషయంలో సామరస్యంగా పట్టు సాధించగలరు.

## వృశ్చికరాశి

**విశాఖ 4వ పాదము, అనూరాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా ఉంటుంది. కుటుంబంలో అందరూ కలిసి ఏ పనినైనా ప్రారంభించండి. చాలా సందర్భాల్లో కూల్‌గా, నిబ్బరంగా ఉండండి. వివాహ ప్రయత్నాలు ఫలిస్తాయి. విద్యార్థులకు అనుకూలంగా ఉంటుంది. గురు పూజలు, సాయిబాబా దర్శనం, శనగ గుగ్గిలు చేసి ప్రసాదంగా గురువారం ఉదయం సాయిబాబా దేవాలయంలో పంచండి.

## ధనూరాశి

**మూల 1,2,3,4 పాదములు, పూర్వాషాఢ 1, 2, 3, 4 పాదములు, ఉత్తరాషాఢ 1వ పాదము.**

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా ఉంటుంది. ఏ విషయంలోనైనా ఆలోచన చేసి ముందుకు సాగండి. జాయింటు వ్యాపారాలు భార్యభర్తల బంధంలాగా ఉండాలి. ఏ చిన్న పని అయినా శ్రద్ధతో పూర్తి చేయుట మంచిది. మీ విషయాలు బయట వారికి తెలియనీయరాదు. శివారాధనతో శాంతి ఉంటుంది.

## మకరరాశి

**ఉత్తరాషాడ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు, ధనిష్ఠ 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా ఉంటుంది. తొందరపాటు నిర్ణయాల వల్ల సమస్యల్లో చిక్కుకునే అవకాశాలు ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో కొన్ని పనులు వాయిదా వేయుట మంచిది. అనారోగ్యం పాలయ్యే అవకాశాలు ఉన్నాయి. జాగ్రత్తగా ఆలోచన చేసి, కొన్ని పనులు ప్రారంభించాలి. మహాన్యాస రుద్రాభిషేకం చేయండి.

## కుంభరాశి

**ధనిష్ఠ 3,4 పాదములు, శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాబాద్ర 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు చాలా అనకూలంగా ఉంటుంది. మీరు వెళ్లిన పనులు నెరవేరగలవు. ఆర్థిక విషయాల్లో వెసులుబాటు ఉంటుంది. తొందరపడి ఏ నిర్ణయాలు తీసుకోరాదు. ఆలోచన చేసి మంచి నిర్ణయాలు తీసుకోండి. నిర్ణయాలు తీసుకునేటప్పుడు కొన్ని మెలుకువలు పాటించండి. దక్షిణామూర్తిని ఆరాధించండి.

## మీనరాశి

**పూర్వాభాద్ర 4వ పాదము, ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు, రేవతి 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు కొన్ని సమస్యలు ఉన్నాయి. అనారోగ్య సూచనలు కనబడుతున్నాయి. ఉద్రేక భావనాలకు అవకాశం ఉంది. కోపం, చికాకులకు ప్రధాన కారణం నదుల దగ్గర జలం ఊరుట తగ్గినప్పుడు అధికంగా ఉద్రేకపడగలరు. నోటిలో నీరు కొద్దిసేపు పెట్టుకుంటే చిక్కులు రావు.

# మీ విజ్ఞానం

నిర్వహణ: **డా.పి. లలితవాణి**





శ్రీ వేంకటేశం
ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1,
హబ్సీగూడ, హైదరాబాద్-500007,
ఫోన్: 040-27175050
Email: srivenkatesham@gmail.com


ఈ ప్రశ్నలన్నింటికీ ఇదే పేపరు మీద కొట్టివేతలు లేకుండా సమాధానాలు రాసి ఈనెల 20వ తేదీలోగా మాకు పంపగలరు. మీ చిరునామాను స్పష్టంగా రాయాలి. సరియైన సమాధానాలు వ్రాసిన వారిలో లక్కీడిప్ ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి 'శ్రీవారి పాదాలు' బహుమతిగా ఇవ్వబడతాయి.

## ఈ క్రింది ప్రశ్నల జవాబుల కోసం గత నెల సంచికను పరిశీలించండి

1. మురాసురుడు ఎవరి కొడుకు?
2. విఠలుడు నిలిచిన రాయి ఎవరు?
3. కనకదాసు గురువు ఎవరు?
4. సన్యాసం ఎన్ని రకాలు?
5. సాయిరెడ్డిగారి భార్య పేరేమిటి?
6. 16 స్తంభాల మండపం ఏది?
7. శంఖుడు ఎక్కడ తపస్సు చేసాడు?
8. విష్ణువు తల తెగి ఎక్కడ పడింది?
9. సూర్య రథానికి వాహకుడైన సర్పరాజు ఎవరు?
10. ఆషాఢశుద్ధ ఏకాదశిని ఏమని అంటారు?
11. లక్ష్మణుని నిందించింది ఎవరు?
12. వేంకటాచలం భూలోకంలో ఎప్పుడు ప్రసిద్ధమవుతుంది?
13. మురాసురిని చంపిందెవరు?
14. ఉలగండ అంటే ఏమిటి?
15. మనసు నిశ్చలంగా ఉంటే ప్రయోజనం ఏమిటి? ఏమి జరుగుతుంది?

1. ______
2. ______
3. ______
4. ______
5. ______
6. ______
7. ______
8. ______
9. ______
10. ______
11. ______
12. ______
13. ______
14. ______
15. ______

## గత నెల ప్రశ్నలకు కరెక్టు సమాధానాలు

1. విశాఖ నక్షత్రంతో కూడిన పూర్ణిమ గల మాసం; 2. మారీచుడు; 3. పూరీ జగన్నాథ ఆలయంలో; 4. మహా విష్ణువు; 5. గోవులో; 6. కాకులలో; 7. ద్యుమత్సేనుడికి; 8. ఇంద్రుడు; 9. మారీచుడు; 10. అవసాన దశలో హరినామ స్మరణ చేసినందుకు; 11. 22-4-23 నుండి 05-5-23 వరకు (12 రోజులు); 12. తన ధర్మప్రవర్తన వలన; 13. అష్టాంగమార్గం; 14. మొదటి మెట్టు; 15. శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామివారు

**సరైన సమాధానాలు ఎవరూ రాయలేదు**

పేరు: ______
చిరునామా: ______
______
______
______
పిన్‌కోడ్: ______
ఫోన్: ______



Postel Registration No: HSE/879/2022-2024

Published on 28th and Licenced to Post On 29th & 30th of Every Month

RNI No.: APTEL/2008/23122

శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక



If Un delivered please return to:

**SRI VENKATESHAM, (Sri Venkateshwara Maha Mantra Peetham)**

H.No: 1-1-53, Street No. 1, Habsiguda, Hyderabad-500007. Ph: 040-27175050.

డిజిటల్ పాఠకుల కోసం పూర్తిగా కలర్ పేజీలు https://www.srivenkatesham.org లో చదవండి

Srivenkatesham Magazine in Google Drive https://drive.google.com/drive/folders/1jOWBeoUHjF4Qhn4wl-d9eUGlh6kVYyLq